
సింహపురి రైతు

అభ్యుదయ రైతు మాస పత్రిక


ఆగష్టు - 2014

రూ. 10/-




68 వ
స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు

శృంగేరి మఠం శంకర పీఠంలో కొత్తగా నిర్మించిన మహారాజా గాలి గోపురం




సింహపురి రైతు simhapurirythumonthlymagzine@gmail.com Cell : 9490142934



సింహపురి రైతు

అభ్యుదయ రైతు మాసపత్రిక



ఎడిటర్ : వేమారెడ్డి నిరంజన్ రెడ్డి సంపుటి : 18 సంచిక:3 వెల రూ.10/- ఆగష్టు - 2014

విషయసూచిక

సబ్ ఎడిటర్
సి.ఎస్.ఆర్. కోటిరెడ్డి, సెల్ : 9440764754

ఆధ్యాత్మికం

రధ్యా చర్పట విరజితకష్ఠ:
పుణ్యాపుణ్య వివర్జితవస్థ:
యోగీయోగ నియోజితచిత్త:
రమతే బాలోన్మత్తవదేవ॥

భుజం మీద ఓ శాలువ వేసుకొని యోగంతో మనసును నిలిపి, బ్రహ్మతత్వాన్ని తెలుసుకున్న జ్ఞాని లోకానికి అతీతంగా జీవిస్తుంటాడు. అతను ఒక బాలునిలాగా లేదా పిచ్చివానిలాగా లోకానికి కనిపిస్తూ తాను మాత్రం ఆనందాన్ని పొందుతుంటాడు.


బాలుని వలె అసూయద్వేషాలు లేని మానసిక స్థితి ఆయనలో ఉంటుంది. పిచ్చివాడి లక్షణాలు కొన్ని ఉంటాయి. కానీ ఆయన మానసికస్థితి మటుకు దిగజారదు. కొన్ని బాలురల లక్షణాలు, కొన్ని పిచ్చివాళ్ళ లక్షణాలతో కనిపిస్తూ బయట ప్రపంచంతో సంబంధ లేకుండా తనతోతాను ఆనందాన్ని పొందగలుగుతాడు. అతను మనకు పిచ్చివాడిలాగా కనిపిస్తాడు, కానీ నిజానికి మనం పిచ్చివాళ్ళులాగా అతనికి కనిపిస్తాం.

ప్రపంచంనుండి అతి తక్కువ ఆశించి, ప్రపంచానికి, ప్రజాశ్రేయస్సుకు అత్యధికంగా తన శక్తిని ఉపయోగించే అతను పుణ్యాపుణ్యాలకు అతీతుడు.

రమణా రెడ్డి పేజీ

ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యవసాయ సూచనలు

ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) అనేది స్విట్జర్లాండ్‌లోని జెనీవా పట్టణం కేంద్రంగా స్థాపించబడినది. ఇది అంతర్జాతీయ వ్యాపారానికి సంబంధించి నియమ నిబంధనలు రూపొందించడానికి ఏర్పడింది. అంతకు పూర్వం గాట్ అగ్రిమెంట్ (GATT) పేరుతో వుండి 1995 జనవరిలో ప్రపంచ వాణిజ్య సంస్థగా రూపాంతరం చెందింది. దీనిలో ప్రస్తుతం మనదేశంతోపాటు 150 దేశాలకు సభ్యత్వం వుంది. ఇది బహుముఖ వ్యాపార ఒప్పందాలకు రూపకల్పన చేసి అమలుపరిచే సంస్థ. ప్రపంచమంతటిని స్వేచ్ఛా వాణిజ్య మండలంగా మారుస్తామన్న నినాదంతో ఏర్పడిన సంస్థ. ఇందులో వ్యవసాయ ఒప్పందాలు ఒక భాగంగా ఇమిడి వున్నాయి.



ఈ వ్యవసాయ ఒప్పందాలలో మూడు ప్రధానాంశాలు వున్నాయి. 1. మార్కెట్ ప్రవేశం, 2. దేశీయంగా వ్యవసాయానికి మద్దతు, 3. ఎగుమతి సబ్సిడీలు. వీటిని సభ్య దేశాలన్నీ అంగీకరించి కలిసికట్టుగా రూపొందించుకున్నవి. దీని ప్రకారం మన వ్యవసాయ ఉత్పత్తులు సభ్యదేశాలలో ఎక్కడికైనా ఎగుమతి చేసుకోవచ్చు. దీనివల్ల వినియోగదారునికి లభించే సేవలు, వస్తువుల కొరత వుండదు. ఈ విధంగా అంతర్జాతీయ స్వేచ్ఛా వ్యాపారానికి తలుపులు తెరచుకొన్నాయి. ఈ ఒప్పందాల ప్రకారము ఆయా దేశాల దిగుమతి సుంకం విధింపులో కొంతమేరకు స్వతంత్రం వుంటుంది. వాణిజ్యపరమైన అడ్డంకులు మాత్రం ఉండవు. పోటీ నెదుర్కోగలిగిన ధర, నాణ్యమైన ఉత్పత్తుల తయారీ, ఇవి రెండూ అంతర్జాతీయ వాణిజ్యానికి ముఖ్యమైన అర్హతలు. మనదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడడమంటే అంత సులభమైన విషయంకాదు. అయితే ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల దృష్ట్యా ఇది తప్పనిసరి. ఇప్పటి వరకు మన రైతాంగం అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. నాణ్యతపై అంతగా దృష్టి పెట్టలేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడిన తర్వాత నాణ్యత మాట వినిపిస్తున్నది. అప్పటి వరకు నాణ్యత గల ఉత్పత్తులు సాధించడానికి రైతులను సమాయత్త పరచలేదు. 1995 తర్వాత మన రైతాంగం అధిక దిగుబడితో పాటు నాణ్యతా ప్రమాణాలు సాధించడం, ఖర్చులు తగ్గించడంపై దృష్టిపెట్టారు. స్వేచ్ఛా వాణిజ్యంలో నిలబడాలంటే ఇంతకన్నా వేరే మార్గంలేదు. వ్యవసాయ కృత్రిమ వనరులకు స్వస్తి చెప్పి, ఆధునిక సాంకేతిక పద్ధతులతో మేలైన యాజమాన్యంతో, సహజ సస్యరక్షణ పద్ధతులతో వ్యవసాయం చేయాలి. ఇంతకుముందు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని వ్యవసాయంలో కీలకాంశంగా భావిస్తూ వచ్చారు. 15-20 సం॥ల నుండి సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం మొదలైంది. దీనివల్ల సాగు ఖర్చు తగ్గి, ఉత్పత్తుల నాణ్యత పెరగడం ప్రారంభమయింది. ఇది సాధించగలిగితే మన రాష్ట్రం నుండి వరి, జీడిమామిడి, పొగాకు, పండ్లు, కూరగాయలు, పసుపు, మిర్చి, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలు వంటి ఉత్పత్తులకు అవకాశాలు ఇప్పుడున్న దానికన్న పెరుగుతాయి.

ప్రస్తుత ప్రపంచీకరణ వాణిజ్యం వల్ల మనకు లాభమా, నష్టమా అనే సందేహం చాలా మందిలో వుంది. ఇందులో నిస్సందేహంగా గొప్ప అవకాశాలు, పలు సవాళ్ళు ఇమిడి ఉన్నాయి. దీని వల్ల లబ్ది పొందాలంటే వ్యవసాయరంగంలో పరిశోధన, విస్తరణలకు ఇంకా ప్రాధాన్యమివ్వాలి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతి విధానాలు, సుంకాలు విధించడం, సబ్సిడీలు ఇవ్వడంలో మార్పు రావాలి. ఇవి మన రైతులను, వ్యవసాయాన్ని ఆదుకొనేవిగా, రక్షించేవిగా ఉండాలి. వ్యవసాయ ఉత్పత్తులు నాణ్యతలోను, ధరలోను పోటీకి నిలబడగలగాలి. కొత్త సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు రైతులకు అందుతూ ఉండాలి.


కోటయ్య (రైతు రుణ మాఫీ కమిటీ) గారు ఏదో ఒకటి తేల్చి చెప్పండి?

మీరు ఎవరో? మీరు ఏమి చేస్తుంటారో అమాయకులమైన మా రైతులకు తెలియదు. మీరు పెద్దవారు అయ్యిఉంటేనే రైతు ఋణ మాఫీ వంటి క్లిష్టమైన కమిటీకి అధ్యక్షులుగా నిర్ణయింపబడ్డారు. మీరు మేధావులు అయి ఉంటేనే గదా ఈ కమిటీకి పెద్దలుగా నియమింపబడి ఉండేది.

రైతలమైన మాకు సహజ అలవాటేమిటంటే -పెద్దవారిని గౌరవనీయులైన వారిని " అన్న " అనిగాని లేక " మామ " అని గాని ఆత్మీయంగా పిలుచుకోవడం మా అలవాటు. అందువల్ల మీ మీద గౌరవంతో కొందరం అన్నా అని పిలుచుకుంటాం-కొందరం " మామా " అని పిలుచుకుంటాం.

కోటన్నగారూ:-

అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగైనా నెగ్గితీరాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు తన ఇష్టం వచ్చినన్ని వరాలు ఇచ్చేశాడు. ఆయన మాటల్ని విశ్వశించి తమ కష్టాలు తీరిపోతాయని భావించి ఆయన పార్టీని గెలిపించి ముఖ్యమంత్రి స్థానంలో ఆయన్ని కూర్చోబెట్టారు.



రైతులకైతే పాపం ఎన్నెన్ని ఆశలు కల్పించాడో. రైతులు బ్యాంకుల్లో తీసుకుని ఉన్న అప్పులు కట్టవద్దు-నేను ముఖ్యమంత్రినైతే మీ ఋణాలన్నీ రద్దుచేస్తానన్నాడు. ఏ అప్పు కట్టవద్దన్నాడు. ఎనభై వేల కోట్ల రూపాయల ఋణమాఫీ ఎలా చేయగలరని కొంతమంది మేధావులు ఆయన్ని ప్రశ్నిస్తే -ఆ అప్పులు ఎలా తీర్చాలో-అంత మొత్తాన్ని ఎక్కడ్నుంచి ఎలాతేవాలో మాకు తెలుసు పొమ్మన్నాడు. రైతులు గుడ్డిన ఓటుమీద మళ్లీ మళ్లీ గ్రుడ్డి చంద్రబాబుకు వేశారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు. మొదట సంతకం రైతుల ఋణమాఫీపైనే అన్నాడు. సంతకం సంగతేమోగానీ, మధ్యలో మీరు (కోటన్నగారు) బయటకు వచ్చేశారు. మీరెవరో మాకు తెలియదు. మీరేమి చేస్తుంటారో మాకు తెలియదు. పల్లెల్లో అమాయకులమైన మేము ఎలా జీవిస్తుంటామో మీకు తెలుసో? లేదో తెలియదు. పైకి మేము తెల్లచొక్కా వేసుకొని తెల్లపంచె కట్టుకున్నా-మా చొక్కాలోపల మటుకు చినిగిపోయిన బనియన్ ఉంటుంది. అచ్చం మా బతుకుల్లాగే. మేం అప్పుల్లో పుట్టాము-అప్పుల్లో పెరిగాము, అప్పుల్లోనే సచ్చిపోతూఉంటాం. గ్రామల్లో నూటికి 97 కుటుంబాలది అప్పుల బ్రతుకే.

రైతులకు బ్యాంకులు అంత సులభంగా అప్పులు ఇవ్వవు. మా పొలాలు ఎకరా పది లక్షల రూపాయలు విలువ చేస్తున్నా-మాకు అప్పిచ్చేది ఎకరాకు 20 వేల రూపాయలే. అదికూడా మా పాసుపుస్తకాలు బ్యాంకుల్లో కుదువ పెట్టి రెండు, మూడు దినాలు మమ్మల్ని బ్యాంకు చుట్టూ త్రిప్పుకొని అప్పిస్తారు. మా మీద అభిమానంతో మాకు అప్పివ్వరు. ఈ రైతుగారు అప్పు తీసుకుంటే-తిరిగి బ్యాంకుకు కడతాడా-కట్టడా? అన్న అనుమానంతో మమ్మల్ని అప్పు ఎగవేతదార్లుగా భావిస్తూ అప్పిస్తారు బ్యాంకులవారు.

బ్యాంకు మాకు ఇచ్చే అప్పు వ్యవసాయానికే అట్టట్టా సరిపోతుంది. ఇక కుటుంబం బ్రతకాలా, పిల్లల్ని చదివిచ్చుకోవాలా! ఇవిగాక ఆస్పత్రులు, మందులు-మాకు ఎన్నెన్నో ఖర్చులు. వాటికోసం మళ్లీ బయట అప్పుజేయాల. పంటవేస్తాము-పంట పెరుగుతూ ఉంటుంది. పంటతోపాటుగా అప్పుకూడా పెరిగిపోతూ ఉంటుంది. కానీ మా ధైర్యం ఏమిటంటే ఈ పంట బాగా పండుతుంది, ఈ పంటలో మా అప్పంతా తీరిపోతుందని భ్రమల్లో బ్రతుకుతూ ఉంటాము.

వాతావరణం అన్నీ కలిసొచ్చి ఒక్కోసారి పంట బాగా పండబోతుందని ఎన్నెన్నో ఆశలు పెట్టుకుంటూ ఉంటాం-ఎన్నెన్నో కలలు కంటూఉంటాము. కానీ మామీద, మా ఆశలమీద ఎప్పుడూ ఒక కన్నేసి ఉంచుతారు ప్రభుత్వ అధికారులు, వ్యాపారస్తులు ఎప్పుడు మాట్లాడుకుంటారో, ఏ మాయచేస్తారోగానీ ఒక్కసారిగా ధబేల్‌మని వడ్ల ధర పడిపోతుంది. కంటినిండా కళ్లనీళ్లు పెట్టుకొని, ఆరు, మూడుగా వ్యాపారస్తుడికి అమ్మేసుకుంటాం. మా ఆశలన్నీ అడియానలైపోతాయి. మా కలలన్నీ కల్లలుగా మిగిలిపోతాయి. మేము చేసిన అప్పుమటుకు మా గుండెలమీద కుంపటిలాగా మలమల కాగిపోతూ ఉంటుంది.

మాకు ఎంత అన్యాయం జరిగినా, మా జీవితాలతో ఎందరో చెలగాటమాడుకుంటున్నా-మేమేమీ చెయ్యలేని నిస్సహాయులం. ఐక్యతలేని నికృష్టులం, చేతగాని దద్దమ్మలం, పిరికి సన్యాసులం. అట్లని మేమేమీ అమాయకులంకాదు. రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ, వారు కాలుతో చెబితే మేము చేత్తో చేసే అసహాయశూరులం. మా బతుకులు బాగుకోసం పోరాడటం మాకు తెలియదు. రాజకీయ

నాయకుల బాగుకోసం పాడుపడమంటే-ఆఖరుకు వాళ్ల కాళ్లు ఒత్తేదానికైనా మేము సిద్ధం.

మా సంగతి తెలిసే రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారస్తులు మా జీవితాలతో చెలగాటమాడు కుంటుంటారు. కూరలో కరివేపాకులా వాడుకుంటూ ఉంటారు. ఎవరెంత అపకారం చేసినా, అన్యాయం చేసినా, వీధుల్లో కూర్చొని ప్రతివాడిని విమర్శిస్తూ ఉంటామే తప్ప-తమ బ్రతుకులు ఎలా బాగుచేసుకోవాలో ఆలోచించనే ఆలోచించము.

రైతులమైన మాకు ఇప్పుడేగాదు-స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అందరూ కలిసి మా జీవితాలతో ఆడుకుంటున్నారు. విచిత్రమేమిటంటే ఈ దేశంలో ఉన్న కోటీశ్వరులు టాటాలు, బిర్లాలు, రిలయన్స్ అధిపతులు, వాళ్లెంత పెద్దవారైనాసరే వారికి ఆకలేస్తే అన్నం తింటారే తప్ప-తమ వద్ద మూలుగుతున్న కోట్ల రూపాయల్నో-నల్లధనాన్నో, బంగారాన్నో తిని బ్రతకలేరు.

సామాన్యుడునుండి, మధ్య తరగతినుండి లక్షాధికారైనా, కోటీశ్వరుడైనా ఆఖరుకు భిక్షాధికారైనా, ఆయనెంత పెద్ద అధికారైనా, ఈ దేశానికి ప్రధానమంత్రైనా, రాష్ట్రపతైనా, రాష్ట్రానికి ముఖ్యమంత్రైనా ఆకలేస్తే అన్నం తినాలే తప్ప ఇంకేమి తినలేరు. వాళ్లు తినేటప్పుడైనా కనీసం ఆహారాన్ని పండిస్తూ, పల్లెల్లో నివశిసున్న " రైతు " ఎలా ఉంటాడో, ఎలా జీవిస్తుంటాడో అని ఒక్క క్షణమైనా ఆలోచిస్తారా అంటే-లేదుగాక లేదు. ఈ దేశంలో నిజాయితీగా ఏ ఒక్కరు కూడా రైతుని గురించి ఆలోచించనే ఆలోచించరు-అదీ మా బ్రతుకు.

కోటమామగారు!

మేము ఎప్పుడు ఎవర్నీకూడా ఏదీకూడా మాకు ఉచితంగా ఇవ్వమని ఎప్పుడూ అడగలేదు. ఉచిత కరెంటు మేము అడగలేదు, ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ మేము ఎవర్ని అడగలేదు. బ్యాంకుల్లో మా అప్పులు తోసెయ్యమని మేము ఎవర్నీ అడగలేదు. అడక్కుండానే వాగ్దానాలు ఇచ్చేది రాజకీయ నాయకులు. వాళ్ల అధికార దాహం తీర్చుకోనేదానికి దేశమెట్లాపోయిన పరవాలేదు, దేశం ఆర్ధికంగా ఎంత దివాలా తీసిన పరవాలేదు-తాము మాత్రం అధికారంలోకి వచ్చితీరాలి-ఎంతటి వాగ్దానాలైనా ఇచ్చితీరాలి. అలా రాజకీయ నాయకులు తమ నోటికి ఏది వస్తే అది ఉచితంగా మామొఖాన పారేస్తామంటూ ఉంటారు.

అమాయకులైన ప్రజలుగానీ, రైతులుగానీ " అరే ఈ నాయకుడు ఇన్ని ఉచిత వాగ్దానాలు ఇచ్చేస్తున్నాడే-ఇంత డబ్బు ఈయన సొంతదా? మనదేకదా-మనకు ఇస్తాడు. ఇలా చేస్తే దేశం అప్పులపాలైపోయి, ఆఖరికి దెబ్బతినేది మనమేగదా అని ఈ దేశంలో సామాన్యుడుగానీ, ఏ రైతుగానీ ఆలోచించనే ఆలోచించడు. అంతా ఎవరికి వారి స్వార్ధం.

మీకు తెలుసో తెలియదో! ఈ దేశంలో రైతులది అప్పుల బ్రతుకు. ప్రభుత్వమే రైతుల బ్రతుకుని అలా తయారుచేసింది. మాకేదీ ఉచితంగా వద్దయ్యా, మేము పండించే పంటలకు గిట్టుబాటు ధర వచ్చేటట్టు చేస్తే చాలయ్యా! మేము వ్యాపారస్తుల చేతిలో దోపిడికి గురికాకుండా ఉండేలా చేస్తే చాలయ్యా అని మేము అరవై సంవత్సరాల నుండి మొత్తుకుంటుంటే-అస్సలు విషయం వదిలేసి ఎంత సేపటికీ ఉచితాలంటూ-కుక్కకి బిస్కెట్లు వేసినట్లు మాకు వేస్తూ-వారి పబ్బం గడుపుకుంటున్నారు.

సార్ కోటయ్యగారు

మాలో చాలా మందికి పెళ్లై ముప్ఫై సంవత్సరాలైపోయింది. మా భార్యలు వాళ్ల అమ్మగారింట నుండి తెచ్చిన నగలు ఆ పెళ్లి దినాన చూడడమే. ఆ మరుసటి దినాన నుండి బ్యాంకుల్లో తాకట్టు పెట్టబడి ఉన్నాయి. మా రైతుల భార్యలు కళ్లనిండా నీళ్లు నింపుకొని మాతో "మా నగలు ఒక్కసారి బ్యాంకునుండి తెచ్చి మాకు చూపించడయ్యా మీకు పుణ్యముంటుంది" అని ఏడుస్తూ-రోదిస్తూ మమ్మల్ని అడుగుతూ ఉంటే " మేము ఇదిగో ఈ పంటలో తెస్తాము-రాబోయే పంటలో తెస్తాము అంటూ చెప్పిన అబద్ధం చెప్పకుండా వస్తూ ఉన్నాం. వారి మెడలో ఎప్పుడూ పసుపుతాడు తప్ప-బంగారు మెడలు ధరించి ఎరుగరు.

మొన్న జరిగిన ఎన్నికల్లో బ్యాంకుల్లో ఉన్న మా ఋణాలు తీసెయ్యమని చంద్రబాబుని ఏ రైతు అడగలేదు. ఆయనకై ఆయనే రైతుల ఋణాలన్నీ రద్దుచేస్తానని ప్రకటించేశాడు. ముఖ్యమంత్రైతే మొదటి సంతకం రైతుకు ఋణమాఫీ అన్నాడు. ఆ వాగ్దానాలన్నీ ఎట్టాబొయ్యనో! ఢుడింగ్‌న మీరు (కోటయ్య) సీన్‌లోకి వచ్చేశారు. మీరు ఈ అప్పుల మీద ఏమి స్టడీ చేశారో తెలియదు. ఎంతకాలం స్టడీ చేస్తారోకూడా తెలియదు.

మీరు ప్రభుత్వానికిచ్చిన నివేదికలో ఒక్కో రైతు కుటుంబానికి రూ. లక్ష వరకు "రుణ మాఫీ" చేయాలని సూచించినట్లుగా పేపర్లలో చదివాము.

అయితే మంత్రివర్గ సమావేశంలో ఈ విషయంపై చర్చించిన అనంతరం, ప్రభుత్వం తరపున చంద్రబాబునాయుడు విధాన ప్రకటన చేస్తూ ప్రతి రైతు కుటుంబానికి రూ. 1,50 లక్షల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామన్నారు. అది పంట రుణమైనా, బంగారంపై ఋణమైనా సరే ఒక్కో కుటుంబానికి లక్షన్నర వరకూ లబ్ది చేకూరుస్తాం అంటూ దీనివల్ల 96.27 శాతం మంది రైతుల రుణాలన్నీ పూర్తిగా మాఫీ అవుతాయి. మరో 3.73 శాతం మందికి రూ. 1.50 లక్షల వరకు రుణమాఫీ అవుతుందన్నారు. 31-03-2014

తేది వరకు అప్పులు కట్టిన వారికి, కట్టని వారికి రుణమాఫీ వర్తింప చేస్తామని చెప్పారు. రైతులకిది కొంతవరకు సంతోషమే! విధి, విధానాలపై స్పష్టతలేదు. కుటుంబం అంటే నిర్వచనం లేదు. పైగా 96.27 శాతం మందికి రుణాలన్నీ పూర్తిగా మాఫీ అంటున్నారు. అంటే ఇప్పటివరకూ మీరంటున్న లక్ష కోట్ల రైతు రుణాలలో-ఇప్పుడు మాఫీ చేస్తామంటున్న 30 వేల కోట్లు పోతే మిగిలిన 3.73 శాతం మంది రైతులు బ్యాంకుల నుండి 70 వేల కోట్ల రుణం పొందారా? ఇది ఎలా వీలైంది. దీంట్లోని మతలబు ఏంటో అర్ధంగాకుంది.

మీరు చెప్పిన దానిని నమ్మి, వెసులుబాటు ఉన్న రైతులుకూడా బ్యాంకు రుణాలు చెల్లించలేదు. ఇప్పుడు గడువు తేదీలు దాటిపోయినవి. గడువులోగా చెల్లిస్తే వడ్డీలేకుండా 1 లక్ష వరకు, పావలా వడ్డీతో తర్వాత 2 లక్షల వరకు చెల్లించే వీలుండేది. ఇప్పుడు మొత్తానికి 11 శాతంకు పైగా వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఎవరు చెల్లించాలి? రుణాలు చెల్లించిన రైతులకు, వారి ఖాతాలకు ఎప్పుడు జమచేస్తారు? ఇటువంటి విషయాలపై స్పష్టత ఇవ్వకుండానే మసిపూసి మారేడు కాయను చేసినట్లుగా- ఇంకా రైతులను మోసపుచ్చుతున్నారు. 30 శాతం రైతుకి మేలుచేసి 100 శాతం అని చెబుతున్నారు. పైగా పార్టీ కార్యకర్తలచే సంబరాలు జరిపిస్తున్నారు. "కొంతవరకు చేశాం-ముందు, ముందు ఇంకా ప్రాధాన్యతనిచ్చి రైతులను ఆదుకుంటామని చెప్పాల్సిందిపోయి",చెప్పింది చేశాం అని గర్వంగా చెప్పాల్సిన సంగతికాదు. "చేసింది గోరంత-చెప్పేది కొండంత"లా ఉంది. ఇప్పటికైనా వెంటనే అమలుచేసి రైతులకు తిరిగి రుణాలు ఇప్పించండి.

రైతులమైన మేము డబ్బులకోసం అల్లాడిపోతున్నాం. బ్యాంకులకు అప్పుకట్టవద్దన్న డబ్బు మేము తినేశాం. అప్పు పోతుందిలే అనే ఉద్దేశ్యముతో. మా అవసరాలు తీర్చుకున్నాం. మేమేమీ జల్సాలు, దుబారాలు చేయ్యలేదు. మా బతుకులు మేము బ్రతుకుతూ మా బిడ్డల్ని కూడా చదివించుకోవాలని ఆరాటపడుతున్నాం. అందుకోసమే మా డబ్బు ఖర్చు పెడుతున్నాం. బతుకు భారంగా నడుస్తున్నది. అప్పిచ్చేనాధుడులేదు. బ్యాంకుల్లో మా పరపతి పోగొట్టుకున్నాం. ఏమిచెయ్యాలో తెలియక అల్లాడిపోతున్నాం.

అయినా మాకు తెలియక అడుగుతున్నాం.

ఈ దేశంలో ఉన్న పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు-గుట్టు చప్పుడుగాకుండా కొన్ని వేల కోట్ల రూపాయల రుణాలు రద్దు చేస్తుంటారే-రైతులఅప్పు రద్దు విషయం వచ్చేసరికి లెక్కలు, కమిటీలు, అధ్యయనాలు ఏమిటిసార్ ఇదంతా?

మమ్మల్ని నల్లుల్ని నలిపి చంపినట్లుగా చంపకండి! ఏదైనా అవునో-కాదో తేల్చిచెప్పేయండిసార్-మీ పాదాలకు నమస్కారం పెడతాము.

మట్టిపువ్వు


నాన్నను చూస్తే నాకెందుకో
ఎన్నడూ ఊడ్పులెరగని పొలాన్ని చూసినట్లుంటుంది
నాన్న కళ్ళు
తడింకిపోయిన పంటకాలవల్లా
నా గుండెను పిండేస్తుంటాయి
అప్పుడెప్పుడో
వానమబ్బు వంగి నేలను వాటేసుకున్నప్పుడల్లా
నాన్న మట్టి పరిమళమై గుబాళించే వాడు
పచ్చకోక కట్టిన పొలం ఇంటికి నడిచొచ్చినప్పుడల్లా
నాన్నముఖం తోరణాలు కట్టిన వాకిలిలా కళకళలాడేది
వాకిట్లో ధాన్యం పురుల్లా
నాన్నగుండె నిండా కమ్మని కలలు పొంగేవి
కాలం కొత్త రెక్కలు తొడుక్కుంది
ప్రకృతి పళ్ళు నూరినప్పుడు
నింగి నేలపై అలిగినప్పుడు
నాన్న చెట్టు నీడలో సేద తీరిన కాకులు
తలో కొమ్మా నరుక్కుపోయాయి
కల్లంలో గింజలనేరుకునే పిచ్చుకలు
కంకుల్నే పొడుచుకు తినేశాయి
పాలు పోసుకున్న వరిదుబ్బులా ఉండాల్సిన నాన్నిప్పుడు
వడగళ్ళ వానకు ఒరిగిపోయిన పనైపోయాడు
నల్లరేగడి లాంటి వాడిప్పుడు
చవిటి పర్రలా ఏకాకయ్యాడు
పడిన కష్టాన్ని ఎవరెవరో గంపలకెత్తుకుపోతుంటే
రాలిపడ్డ పరిగమధ్య నిలువెల్లా నీరైపోయిన నాన్న
అదృష్టమాడే జూదంలో ఎప్పుడూ ఆఖరిమెట్టు మీదే
అనుబంధాలు, ఆత్మబంధాల వెక్కిరింతల నడుమ
ఆయనదెప్పుడూ ఒంటెద్దుపోరే
ఏడుపదుచుల ఊబి ఉక్కపోతలో
ఏరువాక మరచిన నాన్న బతుకుమడి మీద
ఎండపాయ నడకే
సహజాతాల మీద సంస్కారాల మీద
చలువ సమాధి పందిళ్లు కట్టుకున్న వాళ్ళకి
నేలను నమ్ముకున్న నాన్నెప్పుడూ
నేలబారు మనిషే
రాశులు రాశులుగా లోకాన్నే దీవిస్తున్నా
ఆయనెప్పుడూ మట్టిపువ్వే
కాలం మళ్ళీ కొత్తరెక్కలు తొడుక్కుంటూనే ఉంటుంది
మళ్ళీ మళ్ళీ ఆరుకాలాల శ్రమకు ఆది పురుషుడై నాన్న
మట్టిలోంచి మొలకెత్తుతూనే ఉంటాడు

యార్లగడ్డ రాఘవేంద్రరావు

అద్భుత వరి వంగడాల రూపశిల్పి

9 వరి రకాలను ఆవిష్కరించిన దళిత రైతు భో బ్రగడే. 2.5 లక్షల హెక్టార్లలో సాగవుతున్న 'హెచ్ఎంటీ'

జ్ఞానభాండాగారాలను తల దిండుగా పెట్టుకొని పెరిగిన వారు విసిరేసిన వెలివాడలో పుట్టిన మట్టి మనిషి దాదాజీ రాంజీ భో బ్రగడే. బతుకు మట్టికొట్టుకుపోయినా మట్టిని నమ్ముకొనే బతికిన వెలివాడ దళిత రైతు. మట్టి మీద ఆయనకున్న మమకారం, అద్భుత ఆవిష్కరణలకు కారణమైంది. ఆ కృషి ఫలితమే ఇప్పుడు యావత్తు ఉత్తరాది కంచాల్లో వెదజల్లిన విరజాజి మొగ్గల్లా పరుచుకున్న అన్నం మెతుకులు. అవి భో బ్రగడే సృష్టించిన హెచ్ఎంటీ రకం బియ్యపు మెతుకులే.



విదర్భలోని నాందేడ్ జిల్లా చండీపూర్ తాలూకాలోని నాగ్‌బీడ్ ఓ మారుమూల కుగ్రామం. దాదాజీ ఆవిష్కరించిన హెచ్ఎంటీ ధాన్యంతో ఇది వెలుగులోకి వచ్చింది. మూడో తరగతితోనే చదువుకు స్వస్తి చెప్పిన దాదాజీ భో బ్రగడేకు శాస్త్ర పరిజ్ఞానం లేనప్పటికి శాస్త్రీయ దృక్పధాన్ని అలవర్చుకున్నారు. ప్రతి విషయాన్ని పరిశీలించి చూడడం అలవాటు. నారు పోశామా, నాటేశామా, కోసి నూర్చి మండీకి తోలామా అనే విధానం కాదు ఆయనది. మనస్ఫూర్తిగా నిమగ్నమై పనిచేయడం ఆయనకు అలవాటు. దాదాపు 30 ఏళ్ల కిందటి మాట. ఉన్న ఎకరన్నర పొలంలో ఆ ప్రాంతంలో బాగా ప్రాచుర్యంలో ఉన్న పటేల్-3 రకం వరి సాగు చేశాడు. జబల్‌పూర్‌లోని జెఎన్‌కెవి వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ జెపీ పటేల్ ఈ రకాన్ని అభివృద్ధి చేశాడు. పొలంలో వేసిన పంటను కంటికి రెప్పలా కాపాడుకునే దాదాజీ పంటపొలంలో ప్రతి అడుగును పరిశీలిస్తాడు. ఈ క్రమంలో ఓ మడి మూలని మూడు వరి వెన్నులు మిగతా చేనుకు భిన్నంగా కనిపించాయి. వెంటనే వెన్నులకు గుర్తులు పెట్టి ప్రత్యేకంగా కోసి నూర్చాడు. ఆ గింజలను భద్రంగా దాచి మరుసటి సంవత్సరం పంట సమయంలో ప్రత్యేకంగా నాటేసి అడవి జంతువుల పాలు కాకుండా చుట్టూ కంచెవేశాడు. ఈసారి వచ్చిన దిగుబడిని మరోమారు జాగ్రత్తగా తిరిగి సాగు చేశాడు. కొత్తవిత్తనం సంరక్షణ ప్రస్థానం సాగుతూ 1988 నాటికి నాలుగున్నర క్వింటాళ్ల విత్తనం చేతికి వచ్చింది. బియ్యం మరపట్టించి చూడగా 80 శాతం బియ్యం దిగుబడి వచ్చింది. పటేల్ రకంతో పోలిస్తే అన్నం నాణ్యంగా, రుచికరంగా ఉంది. తన పంట గొప్పతనం గుర్తించిన దాదాజీ భో బ్రగడే ఈసారి 150 కిలోల ధాన్యాన్ని విత్తాడు. దాదాజీ ఆశలు ఫలించి 50 బస్తాల ధాన్యం చేతికొచ్చింది. 1990లో దాదాజీ వద్ద విత్తనం తీసుకున్న బీమ్‌రావ్ షిండే అనే భూస్వామి నాలుగెకరాల్లో సాగు చేశాడు. ఆచేత, ఈచేత చుట్టుపక్కల రైతులకు చేరిన ఈ విత్తనం ఆ ప్రాంతంలో చాలా విస్తీర్ణంలో సాగైంది. మార్కెట్‌లో కొత్త రకం మేలిమి ధాన్యం రాశులుగా పోగవగా వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. తలోడి మార్కెట్ వ్యాపారి ఒకడు ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసి దానికి అనాటికి బాగా ప్రాచుర్యంలో ఉన్న హెచ్ఎంటి గడియారం స్ఫూర్తితో హెచ్ఎంటీ అని పేరు పెట్టాడు. ఇప్పుడు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో ఇది సాగవుతోంది.

అసలు కథ అప్పుడు మొదలయింది. భోబ్రగడే ఘనతను చూసి కొందరు పెద్దమనుషులకు కన్నుకుట్టింది. ఓ దళిత రైతు విత్తనాన్ని రూపొందించడం వారికి నచ్చలేదు. అతనికి అందుతున్న ఖ్యాతిని కాజేయాలని 'ఈనగాచిన చేను నక్కలు నమిలేసినట్లు' నిరుపేద దళిత రైతు కష్టఫలితాన్ని కొల్లగొట్టడానికి కుట్రచేశారు. హెచ్ఎంటీ ధాన్యానికి ముందు ఒక తోక తగిలించి పీకేని హెచ్ఎంటీగా పేరు పెట్టి చెలామణి చేయడం ప్రారంభించారు. ఓ జాతీయ ఆంగ్ల దిన పత్రిక

ప్రతినిధి ఈ కుట్రను బట్టబయలు చేయడంతో పలు స్వచ్ఛంద సంస్థలు భోబ్రగడేకు మద్దతుగా ముందుకొచ్చాయి. న్యాయపోరాటంతో పాటు, శాస్త్రీయ పరీక్షలు జరిపించి నిజాన్ని నిగ్గుతేల్చగా హెచ్ఎంటీ, పెద్ద మనుషులు చెలామణిలోకి తెచ్చిన హెచ్ఎంటీకి ఎలాంటి తేడాలేదని తేలిపోయింది. హైద్రాబాద్ నగరంలోని సీసీఎంబీ శాస్త్రవేత్తలు రెండు వంగడాల జన్యుపటాలను చిత్రించగా ఎలాంటి తేడాలు లేవని వెల్లడయింది. ఈ విషయం నాగ్‌పూర్‌లోని ఓ స్వచ్ఛంద సంస్థ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌కు తెలియపర్చింది. ఎన్ఐఎఫ్ దాదాజీ రాంజీ భోబ్రగడే కృషిని గుర్తించి 2005లో జాతీయ పురస్కారం ఇచ్చి గౌరవించింది.


దాదాజీ విత్తనాభివృద్ధి ప్రస్థానం హెచ్ఎంటీతో ఆగిపోలేదు. 1987లో మరో రకం ధాన్యానికి ఊపిరి పోసి, దానికి తన మనవడు నాందేడ్ చిన్నూర్ పేరు పెట్టాడు. 1994లో నాందేడ్ హీరా, 1996లో విజయ్ నాందేడ్, 1997లో దీపక్ రత్న రకాలను సృష్టించి మనుమల పేర్లు పెట్టాడు. 1998లో తన పేరుతోనే డీఆర్‌కి (దాదాజీ రాంజీ భోబ్రగడే) రకాన్ని సృష్టించాడు. 2002లో కాటే హెచ్ఎంటీ, 2003లో డీఆర్‌కె సుగంధి రకానికి ఊపిరి పోశాడు. దాదాజీ మొత్తం 9 రకాల వరి వంగడాలను సృష్టించాడు. ఇందులో హెచ్ఎంటీ రకం ఇప్పుడు నాలుగు రాష్ట్రాల్లో 2.5 లక్షల హెక్టార్లలో సాగవుతున్నదంటే.. దాని గొప్పదనం అర్థమౌతుంది. మన్నులోంచి అన్నం తీసే రైతన్నల ఆశలకు ఎప్పటికప్పుడు కొత్త ఉత్సాహాన్ని అందించిన భోబ్రగడేని కుల వివక్ష అణగదొక్కిందని మహారాష్ట్రలో అనేకమంది మేధావులు విమర్శించారు. స్వచ్ఛంద సంస్థలు ఈ కుట్రను తూర్పారబట్టాయి. రైతు క్షేత్ర స్థాయి పరిజ్ఞానానికి శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాన్ని అందిస్తే కొత్త ఆలోచనలకు ఊపిరిపోసి వెనవేల సృజనలు చేయగలరని దాదాజీ రాంజీ భోబ్రగడే నిరూపించారు.

విత్తనాలకు: భోబ్రగడే వరి వంగడాలను సికింద్రాబాద్‌లోని సుస్థిర వ్యవసాయ కేంద్రం అనేక విత్తనోత్పత్తి సహకార సంఘాల ద్వారా రబీ నాటికి రైతులకు అందుబాటులోకి తెస్తోంది. రైతులు డా. రాజశేఖర్ (7386145368) కు ఫోన్ చేసి రిజర్వు చేసుకోవచ్చు. భోబ్రగడేను 09767290201 నంబరులో సంప్రదించవచ్చు.

లాల్‌బహదూర్‌శాస్త్రి

ఆయన భారతదేశానికి ప్రధానమంత్రి. రష్యా వెళ్ళడానికి ఆయన అధికారిక పర్యటన ఖరారైంది. ఆయన వేసుకునే కోటు పాతదయింది. పొరుగు దేశానికి వెళ్తున్నందున వారికి కొత్త కోటు కుట్టించాలని వారి శ్రీమతి లలిత అనుకుంది. దానికి కావలసిన కొత్త బట్ట దుకాణం నుండి తెప్పించింది. దర్జీని పిలిపించింది. దర్జీ ప్రధానమంత్రి గారి కోటు కొలతలు తీసుకున్నాడు. కొత్త బట్ట ఉంచిన సంచీ పట్టుకెళ్ళేటప్పుడు ప్రధాని పిలిచి అతని చెవిలో ఏదో చెప్పాడు.

వారం రోజుల తర్వాత దర్జీ ఖాళీసంచీ తెచ్చి ప్రధానమంత్రి ఇంట్లో పెట్టి వెళ్ళాడు. సంచి తెరచి చూసిన ప్రధాని భార్య నివ్వెరపోయింది. వెంటనే విషయం తెలుసుకోవాలని ప్రధానిని ఏంటి సంగతి అంటూ ఆతురతగా అడిగింది. ఆయన నవ్వుతూ " నా పాత కోటు ఇంకా కొన్ని రోజులు వాడుకోవచ్చు. దర్జీతో నేను కొత్త కోటు కుట్టవద్దు. దానికోసం తెచ్చిన బట్ట దుకాణానికి వాపసు చేసి వచ్చిన డబ్బుతో మన వీధిలోని గాంధీ ప్రభుత్వ పాఠశాలలో చదివే ఇద్దరు నిరుపేద విద్యార్థులకు బట్టలు కుట్టించమన్నాను అతడలాగే చేశాడు'' అన్నాడు. ఆయన భార్య ఆశ్చర్యపోయింది. సామాన్యుడిలా నిరాడంబరంగా జీవించాలనే భారత మాజీ ప్రధాని స్వర్గీయ లాల్‌బహదూర్ శాస్త్రి. 1964-66 లో మన ప్రధానిగా పనిచేశారు. జైజవాన్ జైకిసాన్ నినాదం వారిచ్చిందే.



తరిమిన అవసరం.. మెరిసిన సృజన

తక్కువ ఖర్చుతో చిన్న ట్రాక్టర్‌ను రూపొందించిన పత్తి రైతు మస్తాన్‌వలి

ప్రశంసలతో సరిపెట్టిన అమాత్యులు.. ఆర్థిక స్థోమత లేక రెంటికి మించి తయారు చేయలేకపోయిన వైనం

కొత్త మోడల్ మినీ ట్రాక్టర్ తయారీకి తాజాగా యత్నాలు

రాష్ట్రంలోని రైతాంగంలో నూటికి 80 శాతం వరకు సన్న, చిన్నకారు రైతులే. లక్షల ఖరీదుండే పెద్ద ట్రాక్టర్లను వీరు కొనుగోలు చేసుకోలేరు. కాడి, మేడి వదిలి పెట్టిన రైతు పొలం దున్నుకోవడానికి, అంతర సేద్యానికి అద్దె ట్రాక్టర్ల కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. అవసరమైనప్పుడు అద్దె ట్రాక్టర్లు దొరక్క అదనుతప్పి సేద్యం చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలను తొలినాళ్ల నుంచే విస్తారంగా సాగుచేస్తున్న గుంటూరు, కృష్ణా తదితర కోస్తా జిల్లాల్లో ఈ ఇబ్బంది మరీ ఎక్కువ. ఏడేళ్ల క్రితం అటువంటి పరిస్థితుల్లో గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన రైతు మస్తాన్ వలీ మనసులో ఈ గడ్డు సమస్యకు పరిష్కారం వెతకాలనే ఆలోచన మొలిచింది. ఈ సృజనాత్మక ఆలోచనకు మెకానిక్‌గా తనకున్న అనుభవాన్ని జోడించి దుక్కికి, అంతర కృషికి ఉపయోగపడే విధంగా చిన్న ట్రాక్టర్‌ను రూపొందించాడు. అలాగని మస్తాన్‌వలీ పెద్ద చదువులు చదువుకున్నవాడేమీ కాదు.



తండ్రి పుల్లాసాహెబ్, తల్లి అల్లాబీలవి వ్యవసాయా ధారిత జీవితాలే. పేదరికం వల్ల మస్తాన్ చదువు రెండో తరగతిలోనే ఆగింది. బతుకు బండిని ఈదడానికి ఉన్న ఊళ్లోనే పదేళ్లు సైకిల్ రిపేరింగ్ షాప్ నడిపాడు. తర్వాత గుంటూరులోని ఓ లారీ వర్క్‌షాపులో మెకానిక్‌గా చేరాడు. మంచి పనితనం ఉన్న మెకానిక్‌గా పేరు సంపాదించినా చేతిలో రూకలకు ఇంట్లో నూకలకు కటకట పరిస్థితినే ఎదుర్కొన్నాడు. చివరకు ఉన్న ఊరే కన్నతల్లి అని తలచి పొన్నెకల్లు చేరాడు. తిరిగి సైకిల్ షాప్ నడుపుతూనే పత్తి సాగు ప్రారంభించాడు. పత్తి పంటలో నిర్ణీత కాల వ్యవధిలో అంతరకృషి చేసి కలుపును తొలగించాలి. అదునుకు కూలీలు దొరకరు. దొరికినా, ఖర్చు బారెడు.. లాభం జానెడు అనే పరిస్థితి. ఈ పరిస్థితిలో తనకున్న మెకానిక్ అనుభవంతో దుక్కులు దున్నుకోవడానికి, కలుపు తీసుకోవడానికి ఒక చిన్న ట్రాక్టరు తయారు చేయాలని తలపెట్టాడు. పత్తి సాళ్ల వరుసలకు అనుకూలంగా 31 అంగుళాల వెడల్పు, మూడు అడుగుల ఎత్తు ఉండేలా ఒక్క చిన్న ట్రాక్టర్ తయారీ నమూనా రూపొందించుకున్నాడు. ఆటో చాసిస్‌తో పాటు ఇతర విడిభాగాలను సమకూర్చుకొని వాటికి 10.2 హెచ్‌పి సామర్థ్యపు ఇంజన్ అమర్చాడు. 2007లో తొలి ప్రయత్నం ప్రారంభించాడు. ట్రాక్టరు రూపొందినా కొన్ని సమస్యలు వచ్చాయి. తరువాత ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఒక సంవత్సరం ఆగి 2008 లో పూర్తిస్థాయిలో మార్పులు, చేర్పులు చేసి రెండు మినీ ట్రాక్టర్లను రూపొందించాడు. ఫలితంగా అప్పట్లో రైతులకు ఒకింత ఊరటనిచ్చే మినీ ట్రాక్టరు రూపొందించగలిగాడు.

డ్రైవర్ ఇతరుల సహాయం లేకుండా కల్టివేటర్, గుంటక వంటి పనిముట్లను తగిలించుకొని సాధారణ ట్రాక్టర్‌లాగే నడుపుకోవచ్చు. మస్తాన్ సృష్టించిన ఈ చిన్న ట్రాక్టర్ చూడ ముచ్చటగా ఉండడమే కాకుండా అన్ని పనులకు అనువుగా ఉండడంతో అప్పట్లో రైతులను ఆకట్టుకొంది. ఆయన తయారు చేసిన రెండు ట్రాక్టర్లలో ఒకటి ఆయన వద్ద ఇప్పటికీ వినియోగంలో ఉంది. అనేక మంది రైతులు ఆసక్తితో ముందుకొచ్చి మస్తాన్‌ను తమ కోసం కూడా ఒక ట్రాక్టర్ తయారు చేసి ఇవ్వమని అడిగారు. తగిన పెట్టుబడి సమకూరక తయారు చేయలేకపోయాడు. మస్తాన్‌వలీ తయారు చేసిన ట్రాక్టరు మంత్రుల ప్రశంసలందుకుంది. పల్లెసృజన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు విశ్రాంత బ్రిగేడియర్ పి.గణేశం ఈ మినీ ట్రాక్టర్‌ను పరిశీలించి మస్తాన్‌వలీ సృజన శీలతను ప్రశంసించారు. ఈ ఆవిష్కరణను నేషనల్ ఇన్నొవేషన్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లి నమోదు చేయించారు. ఎవరైనా వ్యాపారవేత్త చొరవ తీసుకొని మస్తాన్‌వలీకి రాయల్టీ చెల్లించి ఈ మినీ ట్రాక్టర్లను పెద్దమొత్తంలో ఉత్పత్తి చేయగలిగితే.. ఇప్పటికైనా మరింత తక్కువ ధరకే రైతులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉ

ంటుందని గణేశం ఆశాభావం వ్యక్తం చేశారు.

కొత్త మోడల్ మినీ ట్రాక్టర్‌ను తయారు చేస్తా!

పొలాల్లో సకాలంలో కలుపుతీతకు ఉపయోగపడే విధంగా 10.2 అశ్వశక్తి గల ఇంజన్‌తో మినీ ట్రాక్టర్‌ను ఐదేళ్ల క్రితం తయారు చేశాను. మొదటి దానికి దాదాపు 1.5 లక్షల ఖర్చయింది. పత్తి, మిర్చి తోటల్లో అంతర కృషికి ఇది చాలా బాగా పనిచేస్తుంది. అయితే, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో వీటిని తయారు చేయలేకపోయాను. ఈ ట్రాక్టర్‌ను వ్యవసాయ శాఖ ప్రదర్శనలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు చూసి ప్రశంసించారు. అంతేతప్ప ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందలేదు. అప్పుడు తయారు చేసిన దానికంటే మరింత శక్తివంతమైన మినీ ట్రాక్టర్‌ను తయారు చేయాలనే ఆలోచనతో పనిముట్లు, పరికరాలు సమకూర్చుకున్నాను. కొత్త మోడల్ మినీ ట్రాక్టర్‌ను తయారు చేస్తా.

ఇటువంటి ఎన్నో ప్రోత్సహకాలను ప్రభుత్వం అభివృద్ధి పరచవచ్చు. మినీ ట్రాక్టర్లు, మినీ కల్టివేటర్లు, నారువేత మిషన్లు, కలుపుతీసే యంత్రాలను ఎన్నింటినో ప్రభుత్వము 90% సబ్సిడితో రైతులకు అందించవచ్చు.

100% సబ్సిడీతో సోలార్ పవర్‌ను రైతులకు ఏర్పాటు చేయవచ్చు. ఇలాంటి ఎన్నో ప్రోత్సహకాలను రైతులకు ప్రభుత్వం అందించి-వ్యవసాయాన్ని లాభిసాటిరంగంగా మార్చవచ్చు.

రైతులు తమ పంటల్ని గిట్టుబాటు ధరకు అమ్ముకొనేలా చేయవచ్చు. కోల్డేజ్ స్టోర్సుని ఏర్పాటుచేసి కూరగాయలు, పండ్లు నేరుగా రైతులే విదేశాలకు ఎగుమతి చేసుకొనేలా చేయవచ్చు.

రైతులయందు మనస్సుండాలిగానే మార్గాలు అనేకం ఉన్నాయి. కానీ ప్రభుత్వం రైతులకు అటువంటి సహాయసహకారాలు అందించే అందించదు.

ఈ రైతుల్ని నిజంగా అభివృద్ధి చేసితీరాలి అనే నిజాయితీ గలిగిన ప్రజా నాయకుడే ఈ దేశంలో లేడు.

రైతులకు ఎలా చేస్తే-ఏమిచేస్తే రైతులు బాగుపడతారో ప్రజాప్రతినిధులకు-అధికారులకు తెలియదా అంటే? అన్నీ వారికి తెలుసు. తెలిసినా సరే వాళ్ళు రైతులకు చెయ్యాల్సినవి చెయ్యనే చేయరు.

ఈ దేశంలో రైతుల్లో మార్పురాదు. రైతులపట్ల పరిపాలకుల-అధికారుల అభిప్రాయము మారదుగాక మారదు.

40 రోజుల్లో నవజీవనం..!

రసాయనిక వ్యవసాయం వల్ల నిస్సారమైన నేలలో తిరిగి జీవశక్తిని నింపడానికి ఉపయోగపడే ఒక సహజ పద్ధతి ‘ రామబాణం ’. అందుబాటులో ఉన్న వనరులతోనే రైతులు పొలంలో దీన్ని సులభంగా అమలు చేయవచ్చు. వరుసగా రెండు పంటలకు ముందుగా ఈ పద్ధతిని అమలు చేస్తే.. ఆ భూమి పూర్తిగా సారవంతమవుతుందని ‘రామబాణం’ రూపకర్త డా. పత్తిపాటి రామయ్య చెప్పారు.

1వ రోజు	ఎకరం భూమిని ఎద్దులతో దున్నించాలి
2వ రోజు	ఉదయం 6 గం.కు.. రెండుంపావు కిలోల అల్లం రుబ్బి 4 లీటర్ల నీటితో కుండలో కలిపి భూమిలో పాతిపెట్టాలి.
8వ రోజు	ఉదయం 6 గంటలకు.. 4 కిలోల నాటు ఆవు పేడను 6 లీటర్ల నీటితో కుండలో కలిపి భూమిలో పాతిపెట్టాలి. సాయంత్రం 6 గంటలకు.. మురిగిన అల్లం ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో చల్లాలి.
14వ రోజు	సాయంత్రం 6 గంటలకు.. మురిగిన పేడ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో చల్లాలి.
17వ రోజు	ఉదయం 6 గంటలకు.. 8 కిలోల బెల్లం 12 లీటర్ల నీటితో కుండలో కలిపి భూమిలో పాతిపెట్టాలి.
18వ రోజు	సాయంత్రం 6 గంటలకు.. 3 లీటర్ల నాటు ఆవు మూత్రాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో చల్లాలి.
22వ రోజు	ఉదయం 6 గంటలకు.. కుండలో 4 లీటర్ల నీటితో రెండుంపావు (2.25) కిలోల ఇంగువ కలిపి పాతిపెట్టాలి.
27వ రోజు	ఉదయం 6 గంటలకు.. 4 కిలోల మంచి శనగపిండిని కుండలో 1 లీటరు నీటితో కలిపి పాతి పెట్టాలి.
28వ రోజు	సాయంత్రం 6 గంటలకు.. మురిగిన ఇంగువ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో చల్లాలి.
34వ రోజు	సాయంత్రం 6 గంటలకు.. మురిగిన మంచి శనగపిండి ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి చల్లాలి.
36వ రోజు	ఉదయం 6 గంటలకు.. ఒకటిన్నర (1.5) లీటర్ల నాటు ఆవు పెరుగులో ఒకటిన్నర (1.5) లీటర్ల నీటిని కుండలో కలిపి మజ్జిగ చేసి భూమిలో పాతి పెట్టాలి.
40వ రోజు	సాయంత్రం 6 గంటలకు.. మురిగిన మజ్జిగను 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో చల్లాలి.


ప్రకృతి వ్యవసాయం, ‘రామబాణం’పై ఆసక్తి కలిగిన రైతులు సంప్రదించాల్సిన చిరునామా:

డా. కె.గంగాధరం (09849059573),
వర్డ్ ప్రకృతి వ్యవసాయ పాఠశాల,
చెంచురాజుకండ్రిగ, పిచ్చాటూరు మండలం, చిత్తూరు జిల్లా.

మోడీకి మట్టిమనిషి మొర

సాగు నీటి ప్రాజెక్టుల పూర్తికోసం నేషనల్ హైవే అథారిటీ లాగా 'నేషనల్ వాటర్ అథారిటీ'ని ఏర్పాటు చేయాలి. ఈ సంస్థ ద్వారా నిధుల సమీకరణ జరగాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఇరిగేషన్ బాండ్లు జారీ చేసే సౌలభ్యం గురించి ఆలోచించాలి. వ్యవసాయ పరిశోధనను న్యూక్లియర్ స్పేస్ టెక్నాలజీ లాగా పీఎంఓ ఆధ్వర్యంలో ఉంచాలి. సివిల్ సర్వీసెస్ లాగా ఆల్ ఇండియా అగ్రికల్చర్ సర్వీసెస్ ఏర్పాటుచేసి వారినే కీలక విభాగాల్లో నియమించాలి. పరిశోధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం/ ఎక్కువ చేయాలి.

<u>ప్రధాని మోడీ గారూ</u> :- ఉభయ తెలుగు రాష్ట్రాల, యావద్భారతావని రైతుల తరపున మీకు స్వాగతం. మీ ప్రభుత్వం కొలువు తీరింది. సంతోషం. మీ ఆధ్వర్యంలో కొత్త కేంద్ర బడ్జెట్ వచ్చింది. మీ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోని మళ్ళీ ఇంకోసారి చది వాము. ఈ నేపథ్యంలో అందరం కలిసి మా జీవనాధారమైన వ్యవసాయ రంగాన్ని బాగుపరిచేటందుకు మా కోర్కెలు మీ ముందు పెడుతున్నాము. మీకు ఇవన్నీ తెలియవనికాదు గానీ, మిగతా పనుల ఒత్తిడిలో మమ్మల్ని ఇంతకు ముందు ప్రభుత్వాల్లాగా మరచిపోతారేమో అని భయం, ఇక అసలు విషయాల్ని ప్రస్తావిస్తాం.



కనీస మద్దతు ధర కేవలం యాభై రూపాయలు పెంచారు. మీ మ్యానిపెస్టో ప్రకారం స్వామినాధన్ కమిటీ సిఫారసు మేరకు సాగు ఖర్చు + 50 శాతం కలిపి ఇస్తాము అన్నారు. మరచిపోవద్దు ప్రధాని గారూ!

ప్రభుత్వం వ్యవసాయానికి చేసే కేటాయింపులు, భారత స్థూల జాతీయోత్పత్తికి వ్యవసాయం అందిస్తున్న నివృత్తికి, ఆ రంగం మీద ఆధారపడి జీవిస్తున్న వారి శాతానికి అనుగుణంగా ఉండేలా చూడండి. పరిశోధనలకి కనీస పక్షం జీడీపీలో ఒక్క శాతం అయినా కేటాయించండి. ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను కేంద్ర స్థాయిలో ప్రవేశపెట్టాలి. వ్యవసాయాన్ని రాష్ట్రాల సబ్జెక్టు అని తోసేయకుండా వ్యవసాయం, సాగులను కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి సబ్జెక్టుగా మార్చాలి. సాగు నీటి ప్రాజెక్టుల పూర్తికోసం నేషనల్ హైవే అథారిటీ లాగా నేషనల్ వాటర్ అథారిటీని ఏర్పాటు చేయాలి. ఈ సంస్థ ద్వారా నిధుల సమీకరణ జరగాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టుల కోసం ఇరిగేషన్ బాండ్లు జారీ చేసే సౌలభ్యం గురించి ఆలోచించాలి. సాగునీటి ప్రాజెక్టుల్లో సరఫరా చానెళ్ళకు సిమెంట్ లైనింగ్ చేయించాలి. నీటి సరఫరాకు సిమెంట్, ప్లాస్టిక్ లేదా స్టీలు పైపులని వాడాలి. నదీజలాల సరఫరా నీటి సెస్సు విధింపు తదితరాల కోసం చట్ట న్యాయపరమైన అధికారాలు కలిగిన రివర్ వ్యాలీ అథారిటీని ఏర్పాటు చేయాలి. ఇవన్నీ చర్చించేందుకు వ్యవసాయం కోసం ప్రతి సంవత్సరమూ ఒక ప్రత్యేక పార్లమెంటు సెషన్ ఏర్పాటు చేయాలి.

వ్యవసాయంలో యాంత్రీ కరణని జాతీయ ప్రాధాన్యతగా చేయాలి. యువతని ఆకర్షించ డానికి ఇదొక మార్గం. అన్ని రకాల వ్యవసాయ మిషనరీలపై తొంభై శాతం ఖచ్చితమైన సబ్సిడీ ఇస్తూ, కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా మినహాయించి, నాలుగు శాతం వడ్డీపై ఇవ్వాలి. నీటి ఆదా కోసం డ్రిప్, స్ప్రింక్లర్, గ్రీన్ హవుస్ మొదలగు వాటికి 90 శాతం సబ్సిడీనే కాదు, తగినన్ని సంఖ్యలో నీటి ఆదా పరికరాలను సరఫరా చేయాలి.

సమయానుకూలంగా ఎరువులు సరఫరాచేస్తూ, ఎరువుల సబ్సిడీని రైతుకు ఉన్న భూ విస్తీర్ణము, పంటను ఆధారంగా చేసుకొని సబ్సిడీని నగదు రూపంలో బ్యాంకులు, పోస్ట్ ఆఫీసుల ద్వారా నేరుగా అందించాలి.

సాంకేతిక, పెట్టుబడులు, మార్కెట్ సౌకర్యాలను రైతుల దరికి తేవాలి. అన్ని పంటలకు మార్కెట్ ప్లాన్లు అవకాశాలు తయారుచేయుటకు కమోడిటీ బోర్డులను ఏర్పాటు చేయాలి. ప్రతి రైతు పొలం సాయిల్ హెల్త్ రిపోర్ట్‌ను ప్రభుత్వం లేదా ప్రైవేటు వ్యక్తుల ద్వారా మదింపు చేయాలి.

ధాన్యం, గోధుమల సేకరణ భారత ఆహార సంస్థ ద్వారా బఫర్ స్టాక్ లేదా పూర్తి స్థాయి అవసరాలకు పరిమితం చేసి మిగిలిన పంటను ఎగుమతి చేసుకొనేందుకు అనుమతి ఇవ్వాలి. పంటకు ముందే కనీస ఎగుమతి పరిమాణాన్ని లెక్కించి రైతులకు ఆ మేరకు తమ పంటకు రాబోయే ధరపై భరోసా కలిగించాలి. భారత ఆహార సంస్థ, కాటన్ కార్పొరేషన్, నాఫెడ్ తదితర సంస్థల పనితీరును కాలానుగుణంగా చేయాల్సిన మార్పులను పరిశీలిస్తామన్నారు. అలాగే స్థానికంగా గోదాముల కొరత ఎక్కువగా ఉంది. సోనా మసూరి బియ్యాన్ని సూపర్ ఫైన్‌గా గుర్తించి 'పూసా 1107' తరహాలో ఎగుమతికి అనుమతి ఇవ్వాలి.

'పత్తి కమోడిటీ బోర్డు' ఏర్పాటు చేయాలి. మరీ అత్యవసర పరిస్థితులలో తప్ప, పత్తి ఎగుమతులు ప్రతి సంవత్సరం సాఫీగా జరగాలి. పత్తి ఉత్పత్తి ప్రాంతాల్లో జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయాలి. యంత్రాలను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలి. పరిశోధనల్లో యూనివర్శిటీలతో పాటుగా ప్రైవేటుకి భాగస్వామ్యం కల్పించాలి.

రబ్బర్, సుగంధ ద్రవ్యాల (స్పైసెస్) బోర్డుల తరహాలో జాతీయ చక్కెర కమోడిటీ బోర్డు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం పంట మన డిమాండ్ కంటే ఎక్కువ ఉన్న నేపథ్యంలో వార్షిక ప్రాతపదికన ఇరవై లక్షల టన్నుల ఎగుమతికి అనుమతి ఇవ్వాలి. చక్కెర ఫ్యాక్టరీలు లాభాల్లో నడచినప్పుడు రైతులకు ఫ్యాక్టరీలలో వాటాలు ఇవ్వాలి. చెరకు రైతులకు డ్రిప్ సాగు, యాంత్రీకరణ, విత్తనబెడ్ తదితర పనుల కోసం ప్రత్యేక రుణాలు ఇవ్వాలి. చక్కెర మిల్లులకు ఇథనాల్ కోసం కనీసం లీటర్‌కు రూ.47 చొప్పున పెట్రోల్‌తో సమానంగా ఇవ్వాలి. ప్రతి చక్కెర ఫ్యాక్టరీ పరిధిలో యాజమాన్యంతో రైతుల పక్షాన చర్చించేందుకు రైతు ప్రతినిధుల ఎంపికకోసం రైతుల యూనియన్లు ఏర్పాటు కావాలి. చక్కెర ఫ్యాక్టరీలు కొత్త కంపెనీ చట్టం ప్రకారం తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద లాభాల్లో కనీసం 2 శాతం నిధులను చెరకు రైతుల ఆరోగ్యం, విద్య తదితర విషయాల్లో ఖర్చు పెట్టాలి. జాతీయ నూనె గింజల మిషన్‌ని పునరుద్ధరించాలి.

వాజపేయి హయాంలో మొదలుపెట్టిన నదుల అనుసంధానం వాస్తవరూపం ధరించాలి. సుప్రీంకోర్టు తీర్పుని అమలు చేసి భారత నిర్మాణ్ కార్యక్రమం లాగా దీనికి బడ్జెట్ కేటాయింపులు జరగాలి.

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలి. 50:50 నిష్పత్తిలో వ్యవసాయ కార్మికుల ఖర్చును ఆరు గంటల వ్యవసాయ పనికాలానికి అనుగుణంగా ప్రభుత్వం, రైతులు భరించాలి. సివిల్ కాంట్రాక్టుల్లో లాగా 'స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు' దేశం మొత్తానికి వ్యవసాయానికి కూడా పెట్టాలి. ఒక్కొక్క పంటకు రైతుకు ఎన్ని పని దినాలు ఇవ్వాలో జిల్లా పరిషత్ కమిటీ నిర్ణయించాలి. ఉపాధి హామీ పథకాన్ని వాటర్‌షెడ్లు, కాంటూర్ బండ్లు నీటికుంటలు తవ్వకం తదితర సమాజ ఆస్తుల కల్పనలో కూడా వినియోగించాలి.

పంటల ధర నిర్ధాయక సంఘానికి ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వండి. సాగు ఖర్చు నిర్ణయించేటప్పుడు కోత, రవాణా, మార్కెటింగ్, రైతుల శ్రమ తదితరాలని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి రాష్ట్రం, తన స్వంత వ్యవసాయ ధర నిర్ధాయక సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి రాష్ట్రం తన మార్కెట్ వ్యవస్థ సరైన రీతిలో పనిచేసేందుకు స్వంత మార్కెట్ నియంత్రణ వ్యవస్థను కలిగివుండాలి.

సన్న, చిన్నకారు, మహిళా కౌలు రైతులకు బ్యాంకులు అందించే పరపతి సౌకర్యం మీద ఆర్థిక శాఖ నిరంతర మదింపు, పర్యవేక్షణ ఉండాలి. బ్యాంకింగ్ రంగం కేవలం 30 శాతం రైతుకి కూడా పరపతి సౌకర్యం ఇవ్వలేని నేపథ్యంలో ప్రైవేటురంగం పరపతి సౌకర్యం కల్పించే విషయం దిశగా ఆలోచించాలి. జాతీయ వ్యవసాయ ఆర్థిక కార్పొరేషన్‌ను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోండి. ప్రకృతి ఉపద్రవాల్లో నష్టపోయిన రైతులకోసం ఒక రిలీఫ్ నిధిని ఏర్పాటు చేయాలి. అలాగే మార్కెట్లలో వ్యవసాయ ధరల స్థిరీకరణకు ఒక వ్యవసాయ నిధిని బడ్జెట్ కేటాయింపులతో ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. మార్కెటింగ్ విధానాన్ని సమూలంగా మార్చి, మార్కెట్‌యార్డుకు ఎన్నికైన యాజమాన్యాలు వుండాలి. పంటల ఇన్సూరెన్స్ పథకాన్ని గ్రామ యూనిట్‌గా తీసుకొంటూ, విత్తుల దగ్గరనించి మార్కెటింగ్ వరకు అన్ని రకాల నష్టానూ కవర్ చేయాలి. ఆ సంవత్సర నష్టాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని, దీర్ఘకాల దిగుబడి ప్రణాళికల కోసం పునర్నిర్వచించాలి. కౌలుదార్లు ప్రభుత్వ సబ్సిడీలు రుణాలు పొందేటట్లుగా మార్గం సుగమం చేయాలి.

రైతు ఎప్పుడూ అప్పుల్లోనే ఉంటున్న విషయం మీద ఒక న్యాయ కమీషన్ నియమించి, రైతుల రుణ బానిసత్వాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం వుంది. అత్యవసర సరుకుల

చట్టాన్ని కాలానుగుణంగా సవరించాలి. రైతుల మీద రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు కాకుండా చట్టం చేయాలి. కార్మిక చట్టాలు లాగా రైతు యూనియన్ చట్టాలు తేవాలి. పంచాయితీ స్థాయిలో వ్యవసాయ ప్రణాళికలకు అవకాశం కల్పించాలి. రైతులకు తమ కో ఆపరేటివ్‌లు, వాటర్‌షెడ్లు, ఇతర కమిటీలను తామే నిర్వహించుకొనేలా శిక్షణ ఇచ్చి సాధికారతను పెంపొందించాలి. జిల్లా స్థాయిలో వ్యవసాయ ప్రణాళిక కమిటీ వేయాలి. చిన్న, సన్నకారు రైతులకు సహభాగస్వామ్య విధానం ద్వారా 25 శాతం రైతులు, తమ జీవితకాలంలో కాంట్రిబ్యూట్ చేస్తే 25 శాతం రాష్ట్రాలు, మిగిలిన 50 శాతం కేంద్రం వేసి రైతులకు అరవై సంవత్సరాల తరువాత నిరంతరం పెన్షన్ వచ్చేలా చేయాలి. రాష్ట్రాల పరిధిలో రైతు సంక్షేమ అథారిటీలను ఏర్పాటుచేయాలి.

పండ్లు, కాయగూరలకు సంబందించి మామిడి, అరటి, ఆపిల్ తదితర ప్రధాన పండ్ల పంటలకి ఒక ప్రత్యేక కమోడిటీ బోర్డును ఏర్పాటు చేయాలి. పండ్ల రవాణాకి ప్రత్యేక రైళ్ళు వేయాలి. హార్టీ కల్చర్‌కు సంబంధించి ఒక జాతీయ సలహా సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

వ్యవసాయ పరిశోధనను న్యూక్లియర్, స్పేస్ టెక్నాలజీ లాగా సిఎంఓ ఆధ్వర్యంలో ఉంచాలి. సివిల్ సర్వీసెస్ లాగా ఆల్ ఇండియా అగ్రికల్చర్ సర్వీసెస్ ఏర్పాటు చేసి వారినే కీలక విభాగాల్లో నియమించాలి. పరిశోధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం ఎక్కువ చేయాలి.

దూరదర్శన్ కొన్ని పదుల చానెళ్ళు నడుపుతోంది. ప్రైవేట్ సెక్టార్ సరే సరి. ఇంతమంది కలిసి రైతులకోసం ఒక్క చానెల్ నడపలేకపోతున్నారు. మోడీగారూ, ఈ విషయమై ఒక్కసారి ఆలోచిస్తారా?

వ్యవసాయాన్ని ఒక జీవనోపాధిగా మార్చుకొనేందుకు ఇవి కొన్ని మార్గాలు మాత్రమే. వీటిలో కొన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్నాయి. కొన్ని కేంద్రం పరిధిలో ఉన్నాయి. వ్యవసాయం రాష్ట్ర సబ్జెక్టు అని మీరు, మా దగ్గర డబ్బులు లేవు అని రాష్ట్రాలు ఇద్దరూ మమ్మల్ని పట్టించుకోవటం లేదు.

రైతు మీ ఇద్దరికి సంబంధించినవాడు. అతని పురోభివృద్ధికి కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేస్తాయని, ఆ మేరకు చర్యలు తీసుకొంటారని ఆశిస్తున్నాము. వర్షాలు వస్తాయని ఆకాశం వైపు ఎప్పుడూ చూసినట్లే మీ ప్రభుత్వం వంక కూడా మా కష్టాలు తీరుస్తారని చూస్తున్నాము.

విజయ్‌కుమార్, హైద్రాబాద్

అమ్మమ్మ

చిన్నప్పట్నుంచీ అమ్మమ్మే మాకు నాన్న
అక్కకూ తమ్ముడికీ నాకూ ఆఖరికి అమ్మక్కూడా
ఆకాశాన్ని చూసినా సముద్రాన్ని చూసినా
నాకు అమ్మమ్మే గుర్తుకొస్తుంది
పచ్చని పైర్లూ మోడువారిన వృక్షాలూ తన అనుభవాల్ని గుర్తుకు
తెస్తాయి
చెట్టుమీద పిట్టల కువకువలూ కొట్టంలోని లేగదూడల
పిలుపులూ
ఆమెకోసం వినిపించే పాటల్లా అనిపిస్తాయి
అమ్మమ్మ – తరతరాల రథసారధి
పదికిపైగా పాడిగేదెలూ నాలుగు జతల ఎద్దులూ
డజను మంది పాలేర్లూ కొడవలీ నాగలీ గొర్రూ
అన్నీ ఆమెను నిరంతరం చుట్టుకు తిరిగే తాజాస్వప్నాలు
ఇప్పటికీ అవే తన కుటుంబసభ్యుల వివరాలు
పుటలు విప్పితే పంటపొలాల పరిమళాలు
ధాన్యం కళ్లాల 'పోలిగా' పాటలు
అంతరంగంలో తాతయ్య చుట్టపుగాకు వాసన
కూలీలందరి కుటుంబాల్లో
ఆయన వెలిగించిన దీపాల గురించి చెప్పేటప్పుడు
అమ్మమ్మ కళ్లల్లో కాంతివలయాలు కనిపిస్తాయి
పండిన ప్రతి వంటకాన్ని అందరూ రుచిచూడటం
ఆనాడు ఆమె ప్రవేశపెట్టిన నిర్బంధ విద్య
అమ్మమ్మ – సమైక్య జీవన సౌందర్య ప్రతీక
నాట్లువేసినా కలుపుతీసినా పత్తితీసినా పురుగు ఏరినా
ఆమె మునములో ఉందంటే
తోటి కూలీలకు ఒక చైతన్యగీతం తోడున్నట్లే
అన్నంవేళ చద్దిమూట విప్పినప్పుడు
చుట్టూ కూచున్నవారికి అమృతభాండం అందినట్లే

ఎమ్వీ రామిరెడ్డి

'అన్నపూర్ణ' బాటలో ఏరువాక సాగారో..!

చిన్న కమతం.. పెద్ద భరోసా

అరెకరంలో ప్రకృతి వ్యవసాయంతో చిన్నరైతులకు అనుదినం ఆహార భద్రత

3 రోజులపాటు స్వచ్ఛంద సంస్థల ఉచిత శిక్షణ

కాల్‌సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు సలహాలు

'జట్టు' తోడ్పాటు.. 'సాగుబడి' చేదోడు..

నేల తల్లిని నిత్యం చెమట చుక్కలతో ముద్దాడే రైతన్నే జాతికి వెన్నెముక. కానీ, రెండెకరాల సొంత భూమి ఉన్నరైతు కుటుంబాలకు కూడా మూడు పూటలా కడుపునిండే పరిస్థితి లేదు. రసాయనిక వ్యవసాయ పద్ధతిని అనుసరించడంతో సాగు వ్యయం తడిసి మోపెడవుతుంటే.. ఇక రైతుకు మిగిలేదేముంది రెక్కల కష్టం తప్ప! అరెకరంలో ప్రకృతి వ్యవసాయంతో ఈ సంక్షోభాన్ని పారదోలవచ్చని బడుగు రైతులు రుజువు చేస్తున్నారు. 'అన్నపూర్ణ' పంటల నమూనా ద్వారా జట్టు ట్రస్టు వీరికి వెలుగుబాట చూపుతోంది. పలువురు ప్రకృతి వ్యవసాయ దిగ్గజాల బోధనలను రంగరించి, సులభసాధ్యమమ్యేలా, వాతావరణ మార్పులను తట్టుకునేలా ఈ పంటల నమూనాను రూపొందించడం విశేషం.

అన్నపూర్ణ పంటల నమూనా అనుసరించే రైతులు.. అరెకరం స్థలంలోనే అనేక రకాల కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, ధాన్యాలు, పండ్ల చెట్లను కలిపి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయవచ్చు. ఆ కుటుంబానికి ఏడాది పొడవునా సంపూర్ణ ఆహార భద్రతతోపాటు రసాయనిక అవశేషాల్లేని సహజాహారం లభిస్తుంది.

ప్రకృతి వ్యవసాయానికి 'సాగుబడి' తోడ్పాటు

ఈ భూమిపుత్రుల విజయగాథను 'అరెకరం అక్షయపాత్ర' శీర్షికన 'సాక్షి' (ఫిబ్రవరి 3,2014, 'సాగుబడి') ఎలుగెత్తి చాటింది. అప్పటి నుంచి ఈ చిన్నరైతుల పొలాలకు సందర్శకులు పోటెత్తుతున్నారు. రైతులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులు సైతం ఈ పంటలను సందర్శిస్తున్నారు. కొందరు రైతులు ఇప్పటికే శిక్షణ పొంది, ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి సేద్యానికి ఉపక్రమిస్తుండడం శుభపరిణామం. కొన్ని ఎకరాల భూమి ఉండి, అందులో వాణిజ్య దృష్టితో ఏకపంటలు పండించే రైతులు కూడా.. తొలుత తమ కుటుంబ అవసరాల కోసం ఈ నమూనాను అనుసరించి ప్రకృతి వ్యవసాయం ప్రారంభించవచ్చు. సేద్యమనే మహా యజ్ఞంలో ఈ వెలుగుబాటను ఎంచుకునే రైతులకు 'సాగుబడి' చేదోడుగా ఉంటుంది. నిపుణులు, రైతులకు మధ్య వారధిగా ఉంటూ, ఎప్పటికప్పుడు మెలకువలను అందిస్తుంది. ఆలస్యమెందుకు..? మీరూ కొత్తదారి తొక్కండి.

ప్రకృతి వ్యవసాయంపై 3 రోజుల ఉచిత శిక్షణ

'అన్నపూర్ణ' పంటల నమూనాలో ప్రకృతి వ్యవసాయంపై జట్టు స్వచ్ఛంద సంస్థ విశాఖపట్నం జిల్లా తోటపల్లిలో రైతులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తోంది.

స్వయంగా తోటపల్లి వస్తే పెద్ద రైతులైనా, పేద రైతులైనా 3 రోజుల ఉచిత శిక్షణ పొందవచ్చు. ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

అయితే, రైతులు తమ గ్రామంలోనే సామూహిక శిక్షణ పొందవచ్చు. ఏ జిల్లాకు చెందిన రైతులెవరైనా కనీసం 20-30 మంది ఒక బృందంగా ఏర్పడితే వారి ఊళ్లోనే 'అన్నపూర్ణ' పంటల నమూనాపై ఉచితంగా శిక్షణ పొందవచ్చు. జట్టు సంస్థ సిబ్బంది వారి ఊరికెళ్ళి 3 రోజులపాటు శిక్షణ ఇస్తారు. తర్వాత కాలంలో రైతుల సందేహాలను ఫోన్ ద్వారా నివృత్తి చేస్తారు.

విశాఖపట్నం జిల్లాకు చెందిన (ఎకరం లోపు సొంత భూమి ఉన్న) పేద రైతులకు ఉచితంగానే భోజన వసతులు కూడా కల్పించి తోటపల్లిలో జట్టు సంస్థ శిక్షణ ఇస్తున్నది. ఆసక్తి కలిగిన ఇతర జిల్లాలకు చెందిన పేద, గిరిజన రైతులకు కూడా ఆయా జిల్లాల్లో శిక్షణతోపాటు ఉచిత భోజన, వసతి సదుపాయాలు సమకూర్చే అవకాశాలున్నాయి. అంతేకాకుండా, రంపచోడవరం, చిత్తూరు, పాడేరు ప్రాంతాల్లో గిరిజనులకు కోవెల్ ఫౌండేషన్ (వి.కృష్ణారావు-0440976848), సీసీఎస్ సంస్థ (లాఖీ-9848049528) కూడా ఉచితంగా శిక్షణ ఇస్తున్నాయి.

రైతులు సంప్రదించాల్సిన చిరునామా: జట్టు ఆశ్రమం, తోటపల్లి పోస్టు, రావివలస (ఎస్.ఓ.), పార్వతీపురం వయా, విజయనగరం జిల్లా - 535525, కాల్‌సెంటర్: ఫోన్ : 08963-227228 (ఉ. 9 గం. నుంచి రాత్రి 8 గం.), నూకనాయుడు (ప్రాజెక్టు మేనేజర్)-94400 94384.

శిక్షణ పొంది సాగు చేయండి

అన్నపూర్ణ-ప్రకృతి వ్యవసాయ నమూనాలో ఏదో ఒక పంట కాకుండా అనేక పంటలు కలిపి పండిస్తాం. ఈ ఖరీఫ్‌లో ఈ నమూనాలో సాగు చేపట్టే రైతులు పేర్లు నమోదు చేయించుకొని వర్షాలకు ముందే శిక్షణ పొందాలి. వర్షాధార సాగుకు జూన్ 15 లోగా విత్తనాలు చేసుకోవాలి. పండ్ల మొక్కలు నాటుకోవాలి. నీటి వసతి ఉన్న రైతులు ఇంకొన్నాళ్లు ఆలస్యంగానైనా ప్రారంభించవచ్చు.

డి.పారినాయుడు
(9440164289)
'అన్నపూర్ణ' పంటల నమూనా రూపకర్త,
జట్టు ట్రస్టు వ్యవస్థాపకులు, తోటపల్లి

సిగ్గెగ్గులు వదిలేసిన రాజకీయమా? ఎంత పని చేస్తున్నావే!

మనకు వచ్చిన స్వాతంత్ర్యం ఇద్దరు పిల్లల్ని కన్నది. ఒకటి ప్రజాస్వామ్యం, రెండు ప్రభుత్వం. ప్రజాస్వామ్యం మళ్లీ ఇద్దర్ని కన్నది-అవి ఎన్నికలు, ప్రజాప్రతినిధులు. ఎన్నికలు తిరిగి ఇద్దర్ని కన్నది-అవి నోట్లు, ఓట్లు. ఇప్పుడు ఆ రెండే ఎన్నికలను నడిపిస్తున్నాయి, మనల్ని పాలిస్తున్నాయి. కర్రగల వాడిదే బర్రె. డబ్బు, రౌడీలదండు ఉన్న వాడిదే గెలుపుజెండా! కనుకనే బూతులు, తన్నులాటలతో, దుశ్శాసన సభలుగా చెలామణిలో సాగిపోతున్నాయి.

విషంలేని నాగుపాము, అధికార తృష్ణలేని రాజకీయ నాయకుడు ఇక మనకు కన్పించరు. స్వార్థమే పరమార్థం ఇప్పటి రాజకీయ నాయకుల పరిస్థితి. ప్రతిపక్షంలో ఉండగా ఎన్నెన్ని నీతులు ప్రజలకు వల్లిస్తుంటారో. అదే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ నీతులన్నీ ఎట్టాబోతాయో, తాము చెప్పిందే నీతి-తాము చేసేదే ధర్మం.

ఆంధ్రదేశమంతటా మండల ప్రజాపరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగిపోయాయి. ఒక్కో అభ్యర్థి కేవలం యం.పీ.టి.సి. పదవికి 5 లక్షల రూపాయల నుండి 25 లక్షల రూపాయల వరకు ఖర్చు పెట్టిన రాజకీయ నాయకులున్నారు. ఇక జిల్లాపరిషత్ సభ్యత్వ పోటీకైతే 40 లక్షల నుండి కోటి రూపాయల వరకు ఖర్చు పెట్టుకున్న అభ్యర్థులున్నారు. ఇంతేసి డబ్బు వీరికెక్కడిది? ఇన్ని లక్షల రూపాయల డబ్బు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచి-ప్రజాసేవ చేస్తారట-అది ప్రజలు నమ్మాలి.

ఎలక్షన్ కమీషనర్ల నిబంధనలు ఎన్నున్నా, దారిపొడవునా పోలీసుల చెక్‌పోస్టులు ఎన్నున్నా డబ్బు, మద్యం ఎన్నికల్లో ఏరులై పారుతుంది అనేది నగ్నసత్యం. కానీ ఇది అధికారంగా నిరూపించడం చాలా కష్టం. కానీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులే తమ సన్నిహితులతో ఇంత డబ్బు ఖర్చైపోయిందని భాదపడి చెప్పుకుంటూ ఉండడం అందరికీ తెలిసిన నగ్నసత్యం.

అంతేసి డబ్బు అభ్యర్థుల చేతుల్లోకి ఎలావచ్చిందో-అంతేసి డబ్బు ఎన్నికల్లో నెగ్గేదానికి ఖర్చుపెట్టే ధైర్యం వారికి ఎలా వచ్చిందో సామాన్యుడి సందేహానికి ఎంత ఆలోచించినా సమాధానం దొరకదుగాక దొరకదు. అదొక రాజకీయ నిగూఢ రహస్యం.

ఏ పార్టీకి ఆ పార్టీవారు తమ అభ్యర్థుల్ని ఎన్నికల్లో నిలబెట్టుకొని, లక్షల రూపాయలు కుమ్మరించిపోసి ఎన్నికల్లో నెగ్గారు. ఆ తరువాత ఎవరికి మెజారిటి ఉంటే ఆ పార్టీవారే తమ అభ్యర్థిని అధ్యక్షులుగా ఎన్నుకుంటే ఎంత హుందాగా ఉంటుంది? ఎంత గౌరవంగా ఉంటుంది? ఎంత ప్రజాస్వామికంగా ఉంటుంది?

కానీ నేటి రాజకీయాలు అలా జరగడంలేదు. అధికారమే పరమావధిగా భావించి, ఏ పార్టీ సభ్యుడినైనా సరే ఎంతకైనా కొనుగోలు చేసేసి తమ అభ్యర్థిని మండలాధ్యక్షుడిగానో, జిల్లాపరిషత్ ఛైర్మేన్‌గానో, మున్సిపల్ ఛైర్మేన్‌గానో ఎన్నికయ్యేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. ఎం.పి.టీ.సీ.లుగా, జిల్లాపరిషత్ సభ్యులుగా గెలిచిన వారికి రాజకీయ విలువలు, నీతి నిజాయితీలు, సామాజిక విలువలు తెలియదనుకోండి. అన్ని తెలిసిన రాజకీయ నాయకులే మరీ బరితెగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేస్తున్నారంటే ఎంత సిగ్గుచేటైన విషయం. ఒకటో, రెండో జిల్లాపరిషత్ ఛైర్మేన్లును గెలవలేకపోయినంత మాత్రాన అధికారంలో ఉన్నవారికి ఏమి నష్టం జరుగుతుంది? ఏమి కొంపలు మునిగిపోతాయి?

అనాదిగా రాజకీయాలు నడిపినవారు ఇలా డబ్బుతో రాజకీయ వ్యాపారం చేశారా? డబ్బుతో ఎన్నికల్లో గెలిచి ప్రజాసేవ చేయాలని ముందుకొచ్చారా? నాగరికత పెరిగి, మేధస్సు ఎదిగి జీవనపరిధి పెరిగేకొద్దీ మనుష్యులు మనస్సులు మరీ ఇరుకై స్వార్థం పెరిగిపోయి ప్రజల గుండెలమీద తంతూ కేరింతలు కొడుతున్నారు. ఈ అక్రమాల్ని, అన్యాయాల్ని ఎందరో మేధావులు కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప దీన్ని ప్రతిఘటించలేక పోతున్నారు. ఏమిటీ అన్యాయమని నోరెత్తి అడగలేక పోతున్నారు.

ప్రతి దినపత్రిక ఆయా పార్టీల అభిమానంతో కొట్టుకలాడుతూ, నిజాన్ని, ధర్మాన్ని నిర్భయంగా ఎలుగెత్తి చాటడంలేదు. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైపోతుంటే ఊరికే చూస్తూ ఇది తమకేమీ సంబంధంలేని విషయంగా పరిగణిస్తున్నాయి. పత్రికలు కూడా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయేమోననిపిస్తున్నది.

<u>మేధావులారా</u> :- అధర్మం వెయ్యి హస్తాలతో మిమ్ములను చుట్టుముట్టుతున్నప్పుడు మీరు నిస్సహాయంగా చూస్తుండిపోకూడదు. జయాపజయాలతో నిమిత్తంలేకుండా, నిస్వార్థంగా, నిజాయితీగా మీ శక్తిమేరకు అక్రమాలని, అన్యాయాలను ప్రతిఘటించి తీరాలి. మీరు ఏ మేరకు ప్రతిఘటిస్తే ఆ మేరకు అధర్మం బలహీనపడుతుంది.

ఉచ్చ-నీచాల వట్టింపులులేని అధికార వ్యామోహితులు అన్ని పార్టీలలోను ప్రబలిపోయిఉన్నారు. పదవే పరమావధిగా భావించి, సిగ్గెగ్గులులేకుండా ఎంతకైనా తెగించేందుకు సిద్ధపడ్డ ఫలితంగా గెలిచేది ఎవరైనా చివరకు ఓడిపోయేది మాత్రం ప్రజాస్వామ్యమే!

నెల్లూరు జిల్లాలో ధర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఏమి చేయబోతున్నాయో మీకు తెలుసా?

భారతదేశమంతా కరెంటు ఉత్పత్తి చాలా తక్కువగానే ఉంది. జనాభా పెరిగిపోతూ ఉన్నది, ఫ్యాక్టరీలు పెరిగిపోతున్నాయి, బిల్డింగ్‌ల మీద బిల్డింగ్‌లు లేచిపోతున్నాయి. ఇంటికి రెండు ఏర్‌కండిషన్ మిషన్లు పెట్టుకుంటున్నారు. విపరీతంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు వెలుస్తున్నాయి. వీటన్నింటికి సరిపడేంత కరెంటు ఉత్పత్తిని మనం ఉత్పత్తి చేసుకోలేక పోతున్నాము. మరీ ఆంధ్రప్రదేశ్ అయితే కరెంటు ఉత్పత్తి చేయడంలో చాలా అధ్వాన్నంగా ఉంది.

ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా కీర్తిశేషులు డా॥ వై.యస్.రాజశేఖర్ రెడ్డి ఎన్నికయ్యాడు. కరెంటు ఉత్పత్తి ఎక్కువ చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌లోని ఒక్క నెల్లూరు జిల్లా మాత్రమే ఎందుకు అనుకూలంగా కనిపించిందో, రాజశేఖర్‌రెడ్డికి సలహా ఇచ్చిన మహానుభావులెవరోగానీ నెల్లూరు జిల్లాలోని చిల్లకూరు, ముత్తుకూరు, వెంటాచలం మండలంలో గల గ్రామాల్లో ఉన్న బీడుభూముల్ని, మాగాణి భూముల్ని షుమారు పదివేల ఎకరాలను కరెంటు ఉత్పత్తి చేయాలనుకునే కార్పొరేట్ కంపెనీలకు కేటాయించడం జరిగింది.

రైతుల పొలాలకు డబ్బిచెయ్యడం, పవర్ ప్రాజెక్టువారు పనులు ప్రారంభించడం కూడా జరిగిపోయింది. ఈ దెబ్బతో నెల్లూరు జిల్లాలో పొలాలకు విపరీతమైన ధర పలికింది. ఎకరా ధర కోట్ల రూపాయల్లోకి వెళ్లిపోయింది. ముత్తుకూరు మహాపట్టణంగా స్టార్ హోటల్స్‌తో రూపుదిద్దుకోబోతున్నది. నెల్లూరుజిల్లా అంతా రియల్ ఎస్టేట్ మాయలో పడిపోయింది. ఇందులో కోట్ల రూపాయలు గడించినవారూ ఉన్నారు.

అంతా బాగానే ఉందని సంబరపడిపోతున్నారు. రాజశేఖర్ రెడ్డిని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ తమాషాన్నంతా చూస్తూ ఊరుకున్నాయి. లేకపోతే రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ పొలాన్ని అన్యాయంగా కార్పొరేట్ కంపెనీలకు కేటాయించాడని ధ్వజమెత్తడం తప్పితే-అస్సలేమి జరుగబోతున్నదో ప్రజలకు తెలియనీయలేదు-తెలియజెప్పలేదు.

కార్పొరేట్ కంపెనీలు తమ పనుల్ని చాలావరకు నిశ్శబ్దంగా పూర్తింగావించబోతున్నాయి. ఎవడైనా నోరు తెరిస్తే వాడి మొఖాన అంత డబ్బు పారేసి చేతులు దులుపుకున్నాయి. చాలాకాలం తరువాత నెల్లూరు ప్రజలకు, కొందరు మేధావులకు అసలు విషయం తెలిసొచ్చింది. నెల్లూరు జిల్లా మొత్తం మీద 25,000 వేల మెగావాట్ల కరెంటు ఉత్పత్తి కొబోతున్నదని దానివల్ల కొన్ని వేల టన్నుల బొగ్గు కాలిపోబోతున్నదని. దీనివల్ల నెల్లూరు జిల్లా ఎంతవేడిని భరించాల్సి వస్తుందో! మనుషులు ఎంతటి తీవ్ర అనారోగ్యాలను ఎదుర్కొనవలశివస్తుందో అర్థమైంది.

ఇప్పటికే చేతులు కాలిపోయాయి. ఇప్పుడు ఆకులు పట్టుకొని ఏమి ప్రయోజనం? అప్పటి ప్రతిపక్ష పార్టీ అయితే రోడ్డెక్కి నానాయాగీ చేసింది. తమ బలం చాలదని అఖిలపక్ష మంటూ అనేక పార్టీలను కలుపుకొని రోడ్లెక్కారు. నెల్లూరు జిల్లా కొంప మునిగిపోబోతున్నది, ఇన్ని ధర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు ఒక్క నెల్లూరు జిల్లాలోనే పెడితే నెల్లూరు జిల్లా సర్వనాశనమైపోతుంది. ధూళి, దుమ్ముతో నిండిపోతుంది. వాతావరణం వేడెక్కిపోతుంది. పంటలు పండవు అని ప్రతిపక్షీయులు, మేధావులు, స్వచ్ఛంద సేవాసంస్థలు అరిచి గోలచేశాయి. ఏమి జరుగుతున్నదో తెలియదుగానీ, కరెంటు ఉత్పత్తిదార్ల కంపెనీలు రైతుల పొలాలను ఆక్రమించి పెద్ద పెద్ద స్తంభాలనే పొలాల్లోనే నాటేశారు. అది ధరలేని పొలాలైతే పరవాలే. రోడ్డు ప్రక్కనే ఉండి కోట్ల రూపాయలువిలువజేసే భూములైతే ఇంకెందుకు పనికిరావు. ఆ పొలం ఇంక మూడు దుగ్గాణిలకు కూడా అమ్ముడుపోదు. చాలామంది రైతులు అన్యాయంగా మునిగిపొయ్యారు.

మొన్న ఈ మధ్య వేరే పనిమీద డాక్టర్ రామ్మోహన్ (నెల్లూరు) గారిని ఒక పని సందర్భంగా కలిస్తే ఆయన తన గుండెలు బాదుకుంటూ నెల్లూరు జిల్లాలో ఏర్పాటు కాబోయే ధర్మల్ ప్రాజెక్టుల వల్ల నెల్లూరు జిల్లా ప్రజలకు ఎంత అన్యాయం జరుగబోతున్నదో వివరించి చెప్పాడు. ఏమిటో నెల్లూరు జిల్లాలో ఇంతమంది పెద్దలుండి, ఇంతమంది రాజకీయ నాయకులుండి ఇంతమంది మేధావులుండి మనకు జరుగబోతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకుంటున్నారే తప్ప? దీన్ని ప్రతిఘటించాల్సిన విధి నెల్లూరులో గల ప్రతి పౌరుడిపైనా ఉందిగదా అని ఆలోచించడమే లేదు అన్నారాయన.

మన నెల్లూరీయుడు చెన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఈ విషయంపై 01-04-2011 సంవత్సరములో సుప్రీం కోర్టులో పిల్ వేశాడు. 13-04-2011. న సుప్రీం కోర్టు ఈ పరిశ్రమలును అన్నింటిని ఆపమని ఉత్తర్వులు జారీచేసింది.

చంద్రశేఖర్ రెడ్డి తన ప్రకటనలో ఏమి చెబుతున్నాడంటే నెల్లూరు జిల్లాలో ఇంత కరెంటు ఉత్పత్తి అయితే 30 టన్నుల విషవాయువులు ప్రసరిస్తాయి. ఈ ప్రాజెక్టులవల్ల 80^{0} డిగ్రీల వేడి పుడుతుంది. ప్రజల బతుకు భారమై రకరకాల వ్యాధులు, చర్మవ్యాధులు, క్యాన్సర్లు వస్తాయి. పంటలు పండవు. భయంకరమైన వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. సింహపురి ప్రజలారా కళ్ళు తెరవండి. లేకపోతే మన బిడ్డల బతుకులు, బంగారు భవిష్యత్తు నాశనానికి మనమే కారకులౌతాం. ఇకనైనా కళ్లు తెరవండి అంటున్నాడు చంద్రశేఖర్‌రెడ్డి.

<u>ఒకప్పుడు ప్రతిపక్షంలో ఉండగా ఈ విషయంపై అరచి గోలచేసిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు</u>-ఇప్పుడు మీ పార్టీ అధికారంలో ఉన్నది. మీరు నెల్లూరు జిల్లా ప్రజలకు జరుగబోతున్న అన్యాయాన్ని ఆపుతారా? లేక రాజకీయ నైపుణ్యంతో సమస్యను ప్రక్కకు మళ్లించేస్తారా? ఆలోచించండి

శుద్ధికి ఉండాలి సందర్భశుద్ధి!


ఈ రోజు మన ఆహారంలో దాగున్న కొన్ని విషపూరితమైన వాటి గురించి మాట్లాడుకుందాం. అలాగే మీరు చేర్చదగ్గ ఆరోగ్యవంతమైన ప్రత్యామ్నాయాల గురించి కూడా!

చక్కెర : వెనకటి కాలంలో చక్కెరని చెరుకు రసం నుండి నేరుగా తీసుకుని, ముడి రూపంలో వాడేవారు. వడగట్టిన రసాన్ని గడ్డకట్టేంత వరకూ కాచి, దాన్ని ఒక మోస్తరు రాళ్లుగా విడగొట్టి స్వీకరించేవారు. కానీ ఈ రోజున, వాణిజ్యపరంగా దొరుకుతున్న చక్కెర చాలావరకూ రసాయన ప్రక్రియలకు గురైనది. శుద్ధి చేయబడిన చక్కెరను అధిక మోతాదులో స్వీకరించడం రక్తనాళాలు గట్టిపడడాన్ని తీవ్రం చేస్తుంది. మధుమేహ వ్యాధి నియంత్రణను కష్టతరం చేస్తుంది.

చక్కెరకు ప్రత్యామ్నాయాలు:

బెల్లం – చెరుకురసంలో ఉన్న పోషకాలు, విటమిన్లను బెల్లం తయారీలో కోల్పోదు. ఆయుర్వేదంలో దీన్ని జీర్ణవ్యవస్థ మెరుగుదలలో, ఎన్నో ఆరోగ్య సమస్యల వైద్యాలలో ఉపయోగిస్తారు. ఈ రోజున, కొన్ని రకాల బెల్లంలో సూపర్ ఫాస్ఫేట్ బెల్లం వాడి తయారుచేస్తున్నారు. దీన్ని చూసుకోవాలి. నల్ల బెల్లం వాడండి.

తేనె – ఇది ప్రతిరోజూ స్వీకరించడం ఎంతో మేలు. అధిక శ్లేష్మం, అస్తమా ఉన్నవారికి మంచిది. బుర్రని చురుగ్గా ఉంచుతుంది. ఎలా స్వీకరిస్తున్నాం అనేదాన్ని బట్టి తేనె మానవ వ్యవస్థ మీద వివిధ రకాల ప్రభావాలను చూపిస్తుంది. గోరువెచ్చని నీటితో కలిపి తీసుకుంటే, ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచుతుంది.



శుద్ధి చేయబడిన ధాన్యాలు – ధాన్య నిర్మాణంలో మూడు భాగాలుంటాయి–బీజ పోషకం, పొట్టు, బీజం, బీజంలో మొక్క అండం ఉంటుంది. బీజ పోషకం బీజానికి ఆహార సరఫరా చేస్తుంది. ఇక పొట్టు–బీజాన్ని, బీజ పోషకాన్ని కప్పి వాటికి రక్షణ అందించే కవచం. బీజ పోషకంలోని ప్రధాన అంశం పిండి పదార్థం. బీజం, పొట్టులతో పోలిస్తే బీజ పోషకంలో విటమిన్లు, ఖనిజాలు, పీచు పదార్థం తక్కువ. దీనికి విరుద్ధంగా బీజం, పొట్టులలో ఈ పోషకాలు సమృద్ధిగా దొరుకుతాయి. బీ విటమిన్లు, అమినో ఆమ్లాలు, ఫైటోకెమికల్స్, క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, ఐరన్ లాంటి ఖనిజాలు వీటిలో ఉంటాయి.

ధాన్యాన్ని వ్యాపారపరంగా అమ్మే ముందు, ఎక్కువ నిల్వ ఉండటానికి వాటిని శుద్ధి చేస్తూ ఉంటారు. రిఫైన్డ్ గ్రైన్స్‌గా పిలవబడే ఈ ధాన్యాలలో బీజం, పొట్టు పారేయబడతాయి. ఫలితంగా మిగిలేది పోషకాలు, ఖనిజాలు, పీచు పదార్థం కోల్పోయిన ధాన్యం మాత్రమే.

ప్రత్యామ్నాయాలు:

పొట్టు తక్కువ బియ్యం, దంపుడు బియ్యం, శుద్ధికి గురికాని గోధుమ ఈ రోజుల్లో దొరుకుతున్నాయి. గుండె జబ్బు, క్యాన్సర్, ఊబకాయం, టైప్ 2 మధుమేహం లాంటివాటి ముప్పుని తగ్గించగల ఎన్నో పదార్థాలు ఈ ధాన్యాలలో మెండుగా ఉన్నాయి. మన ఆహారంలో ఒకటి లేదా రెండు ధాన్యల కంటే ఎక్కువ ఉండటం ముఖ్యం.

రాగులు : అన్ని ధాన్యాల్లోకీ అధిక పోషణ విలువ కలిగిన ధాన్యం! శరీరంలోకి తేలిగ్గా స్వీకరించ బడుతుంది. మానవారోగ్యంలో కీలకమైన పలు అమినో ఆమ్లాలు, ఖనిజాలు ఇందులో సమృద్ధిగా దొరుకుతాయి. ఫాస్పరస్, ఐరన్ శాతం కూడా ఎక్కువే.

జొన్నలు : వీటిలో అధిక మొత్తాలలో బి–విటమిన్లు, పొటాషియం, ఫాస్పరస్, మెగ్నీషియం, ఐరన్, జింక్, కాపర్, మ్యాంగనీస్ లాంటి ఖనిజాలు ఉంటాయి. గోధుమ అలెర్జీలు గలవారికి బాగుంటుంది. బియ్యం, గోధుమల కంటే జొన్నలు పోషకపరంగా ఉత్తమం.

పాలు : మూడేళ్లలోపు పిల్లలకు మాత్రమే పాలని పూర్తిగా జీర్ణం చేసుకునే ఎంజైమ్స్ ఉంటాయి. అయితే, పాలని సంప్రదాయంగా కాల్షియం వనరుగా భావిస్తారు. క్యాల్షియాన్ని అందించే ఇతర వనరులు కూడా ఉన్నాయి.

ప్రత్యామ్నాయాలు:

వేరుశనగ : ఇది సంపూర్ణ ఆహారం. చాలా మంది యోగులు ఈ ఒక్కదానిమీదే ఆధారపడేవారు. అయితే, తినేముందు కనీసం 6 గంటల పాటు నీళ్లలో నానబెట్టాలి. దీనివల్ల పిత్తానికి సంబంధించిన అంశాలు పక్కకు వెళ్లిపోతాయి.

ఉలవలు : ఐరన్, క్యాల్షియంలకు మంచి వనరు. మొలకెత్తిన ఉలవలు సులభంగా జీర్ణమవుతాయి. ఎండ తీవ్రత ఉన్నప్పుడు, ఉలవలు శరీరాన్ని వేడెక్కిస్తోంటే, మొలకెత్తిన పెసరపప్పుని తినడం ద్వారా ఆ ప్రభావాన్ని తగ్గించవచ్చు.

మిమ్మల్ని శక్తితో నింపే ఆహారాలపై దృష్టి నిలిపి, సోమరుల్ని చేసే ఆహారాలను మానుకోండి.

గోమూత్రం + పేడతో కలిపి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అల్లూరు లింగారెడ్డి

పల్లెల్లో ఇప్పుడు పెద్దగా పశువులులేవు. పశువుల పేడలేదు. దినదినానికి పల్లెల్లో పశుసంపద క్షీణించి పోతున్నది. పశువుల్ని మేపేవాడులేడు. పల్లెల్లో రైతులు పశువుల్ని పోషించడం తమ కర్తవ్యం, తమ భాధ్యతగా బావించడంలేదు. అన్నింటినీ డబ్బులతో కొలుస్తున్నారు. అంతా డబ్బు సంబంధాలే తప్ప మానవీయత సంబంధాలులేవు. ఎంత ఖర్చు పెడితే తిరిగి మనకు ఎంతొస్తుంది? అని లాబాల బేరీజు వేసుకోవడమే పని.

ఇప్పుడు ఇళ్లల్లో వృద్ధుల్ని ఎలా లెక్కలు కడుతున్నారో పశువులు పనికూడా అంతే. తాత ముసలివాడై మంచంమీద నుండి లేవలేని పరిస్థితులలో ఉంటే-ఈ ముసలోడు ఎప్పుడు చనిపోతాడురా బాబు అని రోజులు లెక్కబెట్టే ఘనాపాఠి మనుస్యులున్నారిప్పుడు. మనుష్యులకు, పశువులకు అన్నింటికీ ఆర్థిక లెక్కలే!



భూమిలో సహజంగా ఎన్నో ఖనిజాలు, లవణాలు, పోషకాలు, జీవపదార్థాలు ఉంటాయి. భూమిలో జీవపదార్థముంటుంది. ఆ జీవ పదార్థాన్ని రైతులు కాపాడుకోవాలి. అందుకు చేనుని ఆకుఅలుము, పశువుల, జీవాల పేడతో నింపాలి. కన్నతల్లికి సరైన సమయంలో సరైన మంచి ఆహారం పెడితేనేగదా బిడ్డకు పాలిచ్చి పోషిస్తుంది. నేలతల్లి పరిస్థితి కూడా అంతే!

నేటి రైతు డబ్బుల వేటలోపడి పరుగెత్తుతున్నాడు. ఈ పరుగులో పశువుల్ని పోషించాలనే ఆలోచనే రావడంలేదు. అస్సలు అంత తీరిక, ఓపిక ఉండడంలేదు. వ్యవసాయంలో ఓ భాగమే పశువుల్ని పోషించడం అన్న ధర్మబద్ధమైన ఆలోచనకూడా కరువైపోయింది. పంటవేసి డబ్బు సంపాదించాలి, ఆ పంట పండేందుకు కావల్సిన సహజ ఎరువుల్ని వెయ్యడం రైతు ఎప్పుడో మర్చిపోయాడు. గనుక రసాయనిక ఎరువుల్ని వేయడం మొదలుపెట్టాడు. రసాయనిక ఎరువుల్ని వేయడం, దానితోపాటు పంటపై భయంకరమైన పురుగు మందుల్ని చల్లడం. ఇలా పంటలు పండించి, పండించి నేల నిస్సారమై పోయింది. భూమాత వద్ద నేడు ఎముకల గూడు తప్ప రక్తమాంసాలు కండరాలు లేవు. దినదినానికి నేలతల్లి కృంగి కృశించిపోతున్నది. నిర్జీవమై పోతున్నది.

నేడు నేల విషతుల్యంగా మారిపోయింది. ప్రకృతి అంతా కలుషితమైపోయింది. పీల్చేగాలి, త్రాగేనీరు, తినేతిండి -పండు అన్నీ విషతుల్యమైపోయాయి. తల్లిపాలల్లోనే ఆవగింజంత విషం చేరి ఉన్నదీ అంటే మనం జీవిస్తున్న ఈ భూప్రపంచం ఎలాంటి స్థితికి చేరుకున్నదో గ్రహించండి. మనం తినేది, త్రాగేది అంతా విషతుల్యమైపోయాయి. కాబట్టి చిన్నపిల్లలకు గుండె జబ్బులు, బి.పి.లు, షుగర్ వ్యాధులు, కిడ్నీ జబ్బులు, ఆయాసాలు-ఉబ్బసాలు ఒక జబ్బుకాదు-అనేక రకాలైన జబ్బులు మనిషిని పట్టి పీల్చి పిప్పిజేస్తున్నాయి. అందుకే ఎన్నో హాస్పిటల్స్, ఎంతో మంది డాక్టర్లు, ఎన్నో రకాల మందులు వీధివీధినా వెలుస్తున్నాయి.

కొంతమంది ప్రకృతి ధర్మరక్షకులు ముందుకొచ్చి "ఒరే అబ్బాయిలు మీరు చేస్తున్న వ్యవసాయం మంచిదికాదు. దీనివల్ల మానవాళి మనుగడ నాశనమైపోతున్నది. భవిష్యత్‌లో మానవ జీవితం రోగగ్రస్తమైపోతుంది. మనిషి జీవించడమే దుర్లభంగా మారుతుంది. కాబట్టి ప్రకృతి సిద్దంగా వ్యవసాయం చేయ్యండిరా బాబు అని నెత్తి-నోరు బాదుకుంటున్నారు. ఎవరికి వినిపిస్తాయి ఆ ఆర్తనాదాలు-ఎవరు పట్టించుకుంటారు ఆ మంచి మాటల్ని. మనిషికి డబ్బుకావాలి-అందుకు ఎంతటికి తెగించేందుకైనా సిద్దమే. నేల ఎట్టా అయిపోతే మనకెందుకు? భూమి నిస్సారంగా మారిపోతే మనకెందుకు? మనుష్యులకు ఎన్ని జబ్బులొస్తే మనకెందుకు? అది వారి ఖర్మ. మనకు డబ్బు కావాలి ముందు-అందుకు ఏ పరిస్థితినైనా వాడుకొని తీరవలశిందే-ఇదీ నేటి రైతుల ఆలోచనా వ్యవసాయం.

అధికంగా దిగుబడులు సాధించి ఎక్కువ డబ్బు సంపాదించాలన్నదే వ్యవసాయ పరమలక్ష్యం కాకూడదు, -ఆరోగ్యవంతమైన, మంచి మనస్సు కలిగిన మనుషులున్న సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా రైతులు బ్రతకాలి అంటాడు సుప్రసిద్ధ ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త మసనోబుకుఒకా. పెద్ద చెరుకూరు గ్రామ నివాశి అల్లూరు లింగారెడ్డి బసవాయపాళెం గ్రామంలో చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని చూస్తే ఈ మాటలకు అర్ధం ఏమిటో కళ్లముందు సాక్షాత్కరిస్తుంది.

ఇప్పుడు భారతదేశమంతా అక్కడక్కడా కొంతమంది రైతులు గోఆధారిత వ్యవసాయం చేస్తున్నారు. ఇందుకు విదేశీ గోవు పనికిరాదు. మన దేశీయ ఆవులే పనికొస్తాయి. ముఖ్యంగా ఒంగోలు జాతిలాంటి ఆవులు ఈ వ్యవసాయానికి ప్రసిద్ధమైనవి. ఒంగోలుజాతే అనికాకుండా మన దేశీయ

ఆవు ఏదైనా మంచిదే. రైతులు కొంతమందైతే ఈ వ్యవసాయం చేస్తున్నారుగానీ, దీనికి ప్రభుత్వము వద్దనుండి రైతులకు పెద్దగా ప్రోత్సాహములేదు. ప్రోత్సాహము లేకపోతేపోయింది -గోఆధారిత వ్యవసాయాన్ని ప్రతి రైతు చేస్తే బాగుంటుందని ఏ పాలకుడు-ఏ అధికారి తన నోటితో చెప్పనుకూడా చెప్పడు. గోఆధారిత వ్యవసాయం రైతులందరూ చేబడితే- రసాయనిక ఎరువుల తయారీ ఫ్యాక్టరీలు, మరియు పురుగు మందుల తయారీ కంపెనీలు శాశ్వతంగా మూసేసుకోవాల్సిందే. ఆ ఫ్యాక్టరీలు మూసివేస్తే ఇటు అధికారులకుగానీ, రాజకీయ నాయకులకుగానీ, ఆదాయమేమీ ఉండదు. చేతివాటం పడిపోతుంది. అదివారికిష్టముండదు.

వారి సంగతి ప్రక్కన పెడదాం. ముందుగా మనం ప్రకృతి వ్యవసాయమనండి లేదా గోఆధారిత వ్యవసాయమనండి దాన్ని గురించి మాట్లాడుకుందాం. ఇప్పుడు భూమిని తల్లిగా కొలిచే అతి కొద్దిమంది రైతుల్లో అల్లూరు లింగారెడ్డి ఒకడు. నేడు ఆయన వ్యవసాయాన్ని కొత్తపుంతలు తొక్కిస్తున్నాడు. తక్కువ ఖర్చుతో కూడిన గోఆధారిత వ్యవసాయ పద్ధతిని అనుసరిస్తూ ఉన్నాడు.

లింగారెడ్డి స్వగ్రామం నెల్లూరు రూరల్ మండలం పెద్ద చెరుకూరు. చిన్నా చితకా రైతేమీకాదు-బడా రైతే. మాంచి కండపుష్టి కలిగిన రైతే. డిగ్రీవరకు చదువుకున్నా-వ్యవసాయం మీద మక్కువతో రంగంలోకి దిగాడు. కాడి వట్టాడు-నాగలితో దున్నాడు. కూపస్థమండూకంలా గ్రుడ్డిగా-గుట్టుచప్పుడు కాకుండా బ్రతికే మనిషికాదు. గ్రామ రాజకీయాల్లో, వ్యవసాయ సదస్సుల్లో చురుకుగా పాల్గొనేవాడు. అందరితో మంచిగా ఉంటూ, గౌరవంగా గుర్తింపుగా బ్రతకాలనే కోరిక గలిగినవాడు. కష్టపడి వ్యవసాయం చేసేవాడు. నిమ్మకు నీరెత్తినట్లుండే మనిషికన్నా బాగా బ్రతకాలనే విలవిలలాడే గుండె గొప్పదిగదా!

పెద్ద చెరుకూరు ప్రాంతంలో వ్యవసాయం భూముల ధరలు ఆకాశాన్నంటాయి. లింగన్న కొట్టాడు ఛాన్స్. పొలం అమ్మిన డబ్బులు ఎందులోనో పెట్టకుండా కొడవలూరు మండలం, బసవాయపాళెం గ్రామంలో 20 ఎకరాలు భూమి కొనుక్కున్నాడు. మామూలు వ్యవసాయం, చేపలు, రొయ్యలు సాగు అన్నీ అక్కడ చేశాడు. వ్యవసాయంలో పెద్దగా సంపాదించిందిలేదు. కానీ జీవితం మటుకు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిపోతూ ఉన్నది. మనసుకూడా ధారాళం. తన సొమ్మే ఖర్చు పెడతాడే తప్ప ఇతరుల సొమ్ము ఆశించే మనస్తత్వం కాదు.

అటువంటి లింగన్న ఓ దినం రసాయనిక వ్యవసాయాన్ని మానేసి పూర్తిగా గోఆధారిత వ్యవసాయాన్ని చేపట్టాడు. కొందరు మనుష్యుల మనస్తత్వం అంతే-ఫలితం గొప్పది అయినపుడు త్యాగానికి వెనుకాడరు. గోఆధారిత వ్యవసాయంలో పెద్దగా డబ్బులురావని తెలుసు. ఆదాయముండదనికూడా తెలుసు. అయినాసరే లింగన్న గోశి బిగించాడు-ముందుకు దూకాడు. ఇంట్లో వాళ్లు, కొంతమంది బయటవాళ్లు-ఇదేమి పిచ్చి సేద్యంరా-ఆవు ఒంటేలుతో పంటవస్తుందంట్రా - నీకిదేమి పిచ్చిరా అని ఎగతాళి చేసి ఉండవచ్చు. లింగన్న అవన్నీ పట్టించుకోడు-కోలేదుకూడా!

ధైర్య సాహసే లక్ష్మీ అనుకున్నాడు.

ఎవరైనా మనిషన్నవాడు-ఒక పని చెయ్యాలి అని అనుకుంటే అందుకు ధైర్యంగా ముందడుగు వేయాలి. అంతేగానీ మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చోకూడదు. ఇందులో నష్టమొస్తుందేమో, దెబ్బతింటామేమో ఇలాంటి సందేహాలు మనస్సులోకి రానివ్వకూడదు. గుండె ధైర్యంలోనే ఉంది కీలకమంతా. తెగింపుతో ముందుకు దూకడం, ఎటువంటి ఫలితానికైనా ఓర్చుకొని సరైన నిర్ణయం తీసుకొని తెగువతో ముందుకు దూకినవారే చరిత్ర సృష్టించగలరు.

లింగారెడ్డి ఏమిచేశాడంటే సుభాష్ పాలేకర్ సాగిస్తున్న గోఆధారిత వ్యవసాయాన్ని వంటబట్టించుకొని ఆ ప్రకారం పది ఎకరాలలో వ్యవసాయం మొదలుపెట్టాడు. ఇంట్లో ఒంగోలు ఆవులున్నాయి. అన్నీ అందుబాట్లో ఉన్నాయి-ఇక మొదలు పెట్టడమే తరువాయి.

"ఘన జీవామృతం" అని ఒక పొడిని మొట్టమొదట తయారు చేసుకున్నాడు.

దీనికి

ఆవు పేడ	-	10 కేజీలు
ఆవు మూత్రం	-	6 లీటర్లు
బెల్లం	-	2 కేజీలు
శనగపిండి	-	2 కేజీలు
పుట్టమట్టి	-	1 కేజీ

పై వాటన్నింటిని బాగా కలిపి ఒక వారం రోజులు నీడలో ఆరబెట్టాలి. ఒక వారం దినాలు నీడలో ఆరబెడితే ఘనజీవామృతం, తయారౌతుంది. 200 కేజీలు వచ్చేటట్లుగా ఘనజీవామృతం తయారు చేసుకోవాలి. ఈ ఘనజీవామృతాన్ని దుక్కిలో మొదలుకొని, పైరుపై కూడా ప్రతి పదిరోజులకొక 200 కేజీలు చొప్పున చల్లుతూనే ఉన్నాడు.

దానితోపాటుగానే "జీవామృతం" అనే ఇంకొక ద్రవపదార్థాన్ని కూడా తయారుచేశాడు.

దీనికి

ఆవుపేడ	-	10 కేజీలు
ఆవు మూత్రం	-	10 లీటర్లు
బెల్లం	-	2 కేజీలు
శనగపిండి	-	2 కేజీలు
పుట్టమట్టి	-	1 కేజీ

ఇవన్నీ కలిపి 200 లీటర్ల నీళ్లు పట్టే డ్రమ్ములో వేస్తాడు. మూడు రోజుల తరువాత 175 నుండి 200 లీటర్లు నీరు దానికి కలుపుతాడు. దాన్ని ప్రతిదినం కలియదిప్పుతాడు. 21 రోజులకు "జీవామృతం" తయారౌతుంది. దీన్ని తీసికెళ్లి కయ్యికి మడవపారే దగ్గర పెట్టి-డ్రమ్ముకు కుళాయి పెట్టిఉంటుంది. ఆ కుళాయిని చిన్నగా త్రిప్పితే ఈ 200 లీటర్ల జీవామృతం ఒక ఎకరానికంతా సరిపోయ్యేలా పారిపోతుంది. ఈ జీవామృతాన్ని బాగా వడకట్టి స్ప్రేయర్ టాంకులో పోసుకొని చేనుమీద పది దినాల కొకసారి స్ప్రే చేస్తూ ఉంటే పైరు బాగా నవనవలాడుతూ ఎదుగుతూ ఉంటుంది.

అదలా ఉంటే "బ్రహ్మాస్త్రం" అని ఒక కషాయాన్ని తయారుచేస్తున్నాడు.

20 లీటర్ల గోమూత్రంలో

వేప ఆకు	ఒక్కో రకానికి
ఉమ్మెత్త ఆకు	2-1/2 కేజీ ఆకులు
సీతాఫలం ఆకు	
కానుగ ఆకు	
మారేడు దళాలు	

ఈ ఆకులన్నింటిని విడిగా బాగా రుబ్బి బాగా గుజ్జులా తయారుచేస్తున్నాడు. ఆ ఆకుల గుజ్జునంతటినీ ఇనుపడ్రమ్ములో వేసి, అందులో కొంత గోమూత్రం కలిపి ఒక గంట సేపు పొయ్యిమీద బాగా కాచి కషాయంలాగా తయారుచేస్తారు. ఈ కషాయం బాగా చల్లారిన తరువాత 50 లీటర్ల నీటిలో కలిపి స్ప్రేయర్‌తో కలిపి స్ప్రే చేయిస్తూ ఉంటాడు.

పైరు నాణ్యతకోసం "పంచగవ్య" అనే ద్రావణాన్ని ఇంకొకదాన్ని తయారు చేస్తాడు.

దీన్ని తయారీకి

ఆవు పేడ	-	10 కేజీలు
గోమూత్రం	-	10 లీటర్లు
ఆవు పెరుగు	-	1 కేజీ
ఆవు పాలు	-	2 లీటర్లు
ఆవు నెయ్యి	-	1 కేజీ

వీటన్నింటిని 200 లీటర్లు నీరు పెట్టే డ్రమ్ములో కలిపి, ప్రతిదినము కలియదిప్పుతూ ఉంటారు. పది దినాలు దాటిన తరువాత ఈ పంచగవ్యను చేనుమీద స్ప్రే చేస్తూ ఉంటాడు.

ఆఖరాన పైరు వెన్నుతీసిన తరువాత పుల్లటి మజ్జిగ ఎకరాకు 5 లీటర్లు తీసుకొని, వంద లీటర్ల నీటిలో కలిపి చేను మీద స్ప్రే చేస్తాడు.

ఇలా గోఆధారిత వ్యవసాయం చేస్తున్నాడు లింగారెడ్డి. ఇంక ఈ పైరుకు ఎలాంటి రసాయనిక ఎరువులుగానీ, పురుగు మందులుగానీ వాడే ప్రశ్నేలేదు. అంతా గోసంబంధమైన వ్యవసాయమే.

మొట్టమొదటసారి ఎకరాకు 1-1/2 పుట్లు పండింది.

రెండోసారి ఇలానే వ్యవసాయంచేస్తే ఎకరాకు 2 పుట్లు పండింది.

మొలగొలుకులు వడ్లు కూడా ఇలానే పండించి ఉన్నాడు. వడ్లు పుట్టి 25 వేల రూపాయల లెక్కన అమ్ముతున్నాడు లింగారెడ్డి.

ఇదంతా బాగానే ఉంది-గోఆధారిత వ్యవసాయం చేస్తే లాభమా? నష్టమా అని మీకు సందేహం రావచ్చు. ఎటువంటి పరిస్థితుల్లో కూడా నష్టమేరాదు అంటున్నారు లింగన్న. అయితే ఇలాగే గోఆధారిత వ్యవసాయం చేస్తూ ఉంటే తప్పకుండా మంచి పంట వస్తుంది, మంచి ఆహారాన్ని కూడా ప్రజలకు అందించినవారౌతాము అంటున్నాడు ఆయన.

నేటి రైతులు అత్యాశకు పోయి రసాయనిక ఎరువులు, పురుగుమందులు విపరీతంగా భూమిపై వాడి భూమిని సర్వనాశనం చేసేస్తున్నారు. రైతులు తమకు తామే ద్రోహం చేసుకుంటున్నామన్న నిజం ఇంకా తెలిసిరాలేదు. పచ్చని పంటలతో మనిషికి ఆయువునిచ్చే నేలతల్లిని వ్యాపార వస్తువుగా కాకుండా తల్లిగా చూడాలని లింగన్న చెబుతున్నాడు.

మొట్టమొదట అరు ఎకరాల్లో గోఆధారిత వ్యవసాయాన్ని మొదలుపెట్టి ఇప్పుడు 15 ఎకరాలకు ఆ వ్యవసాయాన్ని పెంచాడు. గోఆధారిత వ్యవసాయాన్ని ఆషామాషీగా కాకుండా, లాభనష్టాల బేరీజు వేసుకోకుండా, సమాజానికి మేలు జరిగే ఓ మంచి పని చేసి తీరాలి అన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు లింగారెడ్డి.

నేనొక్కడినేకాదు, నాతోపాటు ఈ సమాజం బాగుండాలి అని ఆశించే వారికి, వాటిని ఆచరించడం ద్వారా జీవితం సుఖప్రదంగా సజావుగా, సంతోషంగా సాగిపోతుంది. నేలతల్లి సారాన్ని కాపాడలనుకోవడం, నేలతల్లి సౌభాగ్యంగా ఉండాలని కోరుకోవడం-కోరుకొని అటువంటి పద్ధతుల్ని ఆచరించి, అభ్యసించడం ద్వారా సేవ, స్నేహం, సమత, మమత, త్యాగభావనలు వెల్లివిరుస్తాయి. వ్యక్తిగతంగా ఆచరించే ఉత్తమ ఆదర్శాలు, ఉన్నత లక్ష్యాలే జాతి శ్రేష్ఠత్వానికి సోపానాలు.

<u>లింగన్నా</u> :- కొత్తను కాదనుకూడదు. ఈ సమాజం మాటలకు ఎగతాళికి భయపడబాకు, అధైర్యపడబాకు

రాతినేలను అరక కుమ్ముతుంది
రేగడి నేల దమ్ముతో విచ్చుకుంటుంది.

మానవుడి మనస్సు కూడ గుండె నిబ్బరంతో, ధైర్యంతో ఉన్నప్పుడు ఇంద్ర ధనుస్సులు చిందిస్తుంది.

ముందుకు సాగిపో మీకు అంతా మంచే జరిగితీరుతుంది.

అపరాజిత

ఆమె పేరు అపరాజిత. పరాజయం అన్నదే లేకుండా...
జీవితం అంతా విజేతగా ఉండాలని కోరుతూ...
తల్లిదండ్రులు పెట్టిన పేరు అది.
ప్రేమించి పెళ్లాడిన భర్త... ప్రేమకు ప్రతిరూపంగా పిల్లలు.
ఇంతలోనే ఆమెను పరాజయం వెంటాడింది...
భర్తను ఎవరో చంపేశారు... చంపింది నువ్వే అన్నది న్యాయస్థానం.
పదమూడేళ్ళు జైలులో మగ్గి, న్యాయం కోసం అపరాజిత పోరాటం చేసింది.

'వంద మంది దోషులు తప్పించుకోవచ్చు. కానీ ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదు'.: ఇది మన న్యాయవ్యవస్థ నమ్మే సిద్ధాంతం. ఒక నిర్దోషి పదమూడేళ్లు జైల్లో గడిపిన తర్వాత న్యాయదేవత కళ్లు తెరిస్తే ఎలా ఉంటుంది? అపరాజిత జీవితంలాగే ఉంటుంది.

పదమూడేళ్ల క్రితం ఆమె జీవితంలో హఠాత్తుగా అంధకారం అలముకుంది. భర్త కునాల్‌బోసును అతడి స్నేహితుడు, వ్యాపారంలో భాగస్వామి అయిన కళ్యాణ్‌రాయ్ చంపేశాడు. ఇందులో కోడలి ప్రమేయం ఉందేమోనని అపరాజిత అత్త అనురాధ అనుమానం. అంతే! కోడలి మీద కేసు పెట్టింది. ఇదేమీ అపరాజితకు తెలియదు. భర్తపోయిన దు:ఖంతో కన్నీళ్లు తప్ప కంటి మీద కునుకు లేని అపరాజిత... ఒకరోజు మధ్యాహ్నం ఐదేళ్ల పెద్ద కొడుకుని పక్కన పడుకోబెట్టి, మూడున్నరేళ్ల చిన్న కొడుకుని చేతుల్లో నిద్రపుచ్చుతోంది. ఒక్కసారిగా ఇంట్లోకి వచ్చిన పోలీసులు ఆమెను బయటకు లాక్కువచ్చి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. సాక్ష్యాలేవీ ఆమెకు సహకరించలేదు. 'భర్త హత్యలో నా ప్రమేయం ఏమీ లేదు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త దూరం కావడంతో నా ప్రాణమే పోయినట్లుంది' అని ఆమె తన మనోవేదన తెలియచేయాలంటే వినేవాళ్లు లేరు. పోనీ నిరూపించాలంటే మనసు చెప్పే మాటకాదు భౌతికంగా ఆధారాలు కావాలంటుంది న్యాయవ్యవస్థ. కింది కోర్టులో పొరపాటు జరిగిన విషయాన్ని పదమూడేళ్ల తర్వాత ఇటీవల గుర్తించింది కలకత్తా హైకోర్టు. పద్నాలుగేళ్ల శిక్షాకాలంలో అప్పటికే పదమూడేళ్లు పూర్తయ్యాయి. అలా విడుదలైన ఒక నిరపరాధి అపరాజిత.

జైల్లో ఉన్న పదమూడేళ్లలో అత్తింటివారెవరూ అపరాజితను చూడడానికి రాలేదు. ఆమెకు పిల్లల్ని కూడా చూపించలేదు. పైగా పిల్లలకు అమ్మ అంటే నాన్నను చంపిన హంతకి అనే విముఖతను రంగరించి పోశారు. ఇప్పుడు అపరాజిత పేరుకు తగ్గట్టుగానే న్యాయంతో పోరాడి పరాజయాన్ని జయించి విజయం సాధించింది. కానీ ఆమె కొడుకులు ఇప్పుడు చిన్నపిల్లలుకాదు. నానమ్మ పెంపకంలో అమ్మ మీద గొంతువరకు కోపాన్ని నింపుకున్న టీనేజీ యువకులు. 'మాకు అమ్మ లేదు. అమ్మా నాన్న లేక నానమ్మ పెంపకంలో పెరిగిన పిల్లలం. మా జీవితంలో అమ్మ అనే పదానికి తావేలేదు. మేము స్కూలు కెళ్లేటప్పుడు మా తోటి పిల్లలను వాళ్ల అమ్మానాన్నలు చేయిపట్టుకుని తీసుకువచ్చే వాళ్లు. అలా చూసిన ప్రతిసారీ మాకు అమ్మలేదు అనుకునే వాళ్లం. ఇప్పుడు అమ్మ ఉంది అనుకోవడం కుదరదు' అన్నాడు పద్దెనిమిదేళ్ల అబ్రనీల్. అన్న ఆరోపణలతో గొంతు కలిపాడు తమ్ముడు సౌరనీల్.

అసలేం జరిగింది?

అపరాజిత బోసు కోల్‌కత్తాలోని మధ్య తరగతి మహిళ. లోరెటో కాన్వెంట్‌లో పన్నెండో తరగతి చదువుతున్న రోజుల్లో 1989 మే 14వ తేదీన తన స్నేహితురాలి, స్నేహితుల ద్వారా కునాల్ బోసు పరిచయమయ్యాడు. అది ప్రేమగా మారి 1992 జనవరి 24వ తేదీన దంపతులయ్యారు.

ఇది సుతరామూ గిట్టని వ్యక్తి అపరాజిత అత్తగారు అనూరాధా బోసు. తమ స్థాయికి తగిన సంబంధంతో ఘనంగా పెళ్ళి చేసుకోవాల్సిన కొడుకు సాధారణమైన అమ్మాయిని కోడలిగా ఇంటికి తీసుకురావడాన్ని సహించలేకపోయింది. అలాంటి వాతావరణంలోకి అత్తగారింట్లో ఎనిమిదేళ్లు గడిచిపోయాయి. అది 2000 మే నెల 23వ తేదీ. ఎప్పటిలాగానే కునాల్ బోసు మెటల్ స్క్రాప్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్‌గా తన ఉద్యోగానికి వెళ్లాడు. సాయంత్రం ఫోన్ చేసి 'స్నేహితులతో డిన్నర్ ఉంది ఆలస్యంగా వస్తాను' అన్నాడు. కానీ చెప్పినట్లు రాలేదు. మూడు రోజుల తర్వాత తీవ్రమైన గాయాలతో అతడి దేహం ఒక గుంటలో కనిపించింది. 'స్నేహితుడు కళ్యాణ్ రాయ్

తనను చంపడానికి ప్రయత్నించాడ'ని చెప్పి తుదిశ్వాస విడిచాడు కునాల్. ఈ మరణ వాంఙ్మూలాన్ని సమాజం ఒప్పుకుంది కానీ అనూరాధా బోసు ఒప్పుకోలేదు. ఫలితంగా అపరాజిత జీవితం జైలుపాలయింది. ఒక అమాయకురాలు అన్యాయంగా జైలు జీవితాన్ని అనుభవించింది అని న్యాయమూర్తి ఆవేదన చెందారు కానీ అత్త అనూరాధలో లేశమాత్రమైనా ఆ భావన కలగడం లేదనడానికి నిదర్శనం పిల్లలను అపరాజితకు దగ్గర కానివ్వకుండా అడ్డుకోవడమే.

అపరాజిత నిర్దోషి అని న్యాయస్థానం గుర్తించింది. కానీ ఆమె కోల్పోయిన 13 ఏళ్ల విలువైన కాలం ఆమెకు తిరిగిరాదు. పిల్లల అల్లరిచేష్టలకు మురిసిపోయే ఆనంద క్షణాలను ఆమె కోల్పోయింది. పిల్లలిద్దరూ తల్లి ఒడి మాధుర్యం తెలియని నిరాశలోనే పెద్దయ్యారు. పిల్లల ప్రేమకోసం. తల్లి స్థానం కోసం తల్లడిల్లిపోతున్న ఈ మాతృమూర్తి విజేతగా నిలుస్తుందా? పిల్లల మనసు గెలుస్తుందా?

న్యాయం నా వైపే...!

జైలు నుంచి బయటకు వచ్చిన నాకు ఎదిగిన కొడుకులను అక్కున చేర్చుకుని, బాధ తీరే వరకు కన్నీళ్లు కార్చే అవకాశం కూడా లేకపోయింది. ఇప్పటి వరకు న్యాయం కోసం ఎదురు చూశాను. ఇప్పుడు నా పిల్లల మనసు మారడం కోసం ఎదురు చూస్తాను. న్యాయం నా వైపే ఉంది. నా పిల్లలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడడం నేర్చుకున్న తర్వాత నన్ను అర్థం చేసుకుంటారనే నమ్మకం నాకుంది.

అపరాజిత అన్యాయంగా ఎంతటి ఘోరమైన శిక్ష అనుభవించిందో చూడండి. తానే తప్పు చేయలేదు, తానే పాపము ఎరుగదు. అనవసరంగా 12 సం॥లు జైలు శిక్ష అనుభవించింది.

జైలు శిక్షకంటే ఘోరమైన శిక్ష తన బిడ్డలు తనదరికి రాకుండా పోవడం. పైగా ఆమెను హంతకురాలిగా భావిస్తూ ఉండడం.....

ఆ తల్లి ఇటువంటి పరిస్థితిని తట్టుకొని ఎలా బ్రతుకగలుగుతున్నదో? ఇంతటి క్షోభను, గుండెకోతను ఆ తల్లి గుండె ఎలా తట్టుకోగలుగుతున్నదో!

ఓ భగవంతుడా ఆ తల్లి జీవితాన్ని సరిదిద్దు స్వామీ. ఆమె బిడ్డల మనస్సులని మార్చు స్వామీ

అమ్మ చూపు

బతుకు రైలుబండి పరుగెత్తడానికి

అమ్మ పగలంతా పొలంలో పచ్చజండాలు నాటేది

బుగత పొలాన పొద్దస్తమానం ఎద్దులతో పోటీ పడిన అయ్య

పొద్దు వాలాక బుదర ఒళ్లయి

మత్తుగా తేలిన సారాగమైనపుడు

ఎదిరించిన పాపానికి అమ్మ వీపుమీద

తేలిన తట్లు జ్ఞాపకాలు కట్లపాముల్లా

ఇప్పటికీ నా దేహాన్ని పాకుతాయి

బొర్రిగై నేలను తవ్వి తలకెత్తుకొని వచ్చిన అమ్మ కడుపు

పలకా బలపం లేని ఖాళీసంచిలా గాలికి ఆడేది

లోతుకుపోయిన కళ్లతో అమ్మ ముఖం

మసిబారిన దివ్వగూడులా వుండేది!

అయ్య నోటి నుంచి జారిన కాటిసీను పద్యాలు

బియ్యానికి నోచుకోని దాకలో ఎసరునీళ్లయి మరిగితే

అమ్మ చెమటచుక్కలు మెతుకులై

నా పిడికిట్లో దానిమ్మ గింజలై మెరిసేవి!

నా చిరుగుల బాల్యం చుట్టూ అమ్మ కోకముక్కై చుట్టుకొనేది

అమ్మ తనే రెండు కమ్ములుగా మారి

నన్ను రైలుబండిని చేసింది


నన్ను గమ్యానికి చేర్చే పచ్చజండా ఎప్పటికీ అమ్మచూపే


చింతా అప్పలనాయుడు

యువ సాయం

ఈ యువకులు... అందరూ ఉన్నత విద్యావంతులే... మంచి ఉద్యోగాల్లో స్థిరపడిన వారే... అరక దున్ని విత్తు నాటారు... ఆ గ్రామానికి కొత్త రూపు తెచ్చారు... పంటచేలకు పచ్చదనం తెచ్చారు... జీవితాల్లో పచ్చదనం నింపారు... వ్యవసాయం దండగ అన్న ఊరికి... యువ సాయం చేసిన యువకులు వీళ్ళు.

అది తమిళనాడు రాష్ట్రం, తిరువళ్ళూరు జిల్లా తిరునింద్రవూర్ సమీపంలోని పాక్కం గ్రామం. పాక్కంలో పుట్టి చదువుకుని పెద్ద నగరాల్లో మంచి ఉద్యోగాలు చేసుకుంటున్న వాళ్లు చాలా మందే ఉన్నారు. వారిలో ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలిచారు. తిరుమలై-ఐటిఐ విద్యార్థి, గౌతమ్ బాలాజీ - సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, రాము-వెబ్ డిజైనర్, శివకుమార్ - న్యాయవాది, సాలోమ్ - శాస్త్రవేత్త, విశ్వనాథన్ -ఫోర్డ్ కంపెనీ ఉద్యోగి, అరివుక్కరసన్ -ఉపాధ్యాయుడు. వేర్వేరు రంగాల్లో వున్న ఈ మిత్రులందరూ నాగలి పట్టారు. చవుదుబారిన నేలకు సేంద్రియ ఎరువులతో ప్రాణం పోశారు. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసి లాభాలను పండిస్తున్నారు. ఇంతకీ వారు ఈ పని ఎందుకు చేస్తున్నారంటే... "మా పాక్కం ఒకప్పుడు మంచి పంటలకు ప్రసిద్ధిచెందిన గ్రామం. అలాంటిది విచక్షణ రహితంగా కృత్రిమ రసాయన ఎరువుల బారిన పడి నేల చవుదు బారింది.ఇప్పుడు ఈ ఊళ్లోని రైతులు వ్యవసాయం చేయలేక వలస పోతున్నారు. ఇదే కొనసాగితే మరో పదేళ్లకు ఇక్కడ ఊరు ఉండదు. మా ఊరిని పచ్చగా నిలుపు కోవడానికే ఇదంతా చేస్తున్నాం" అంటారు ఈ బృందంలోని సాలోమ్.





వీళ్ల ప్రస్థానం సరిగ్గా అయిదేళ్ల క్రితం మొదలైంది. ఈ యువకులు యాభై సెంట్ల భూమిని కౌలుకు తీసుకున్నారు. ప్రయోగాత్మకంగా వ్యవసాయం చేపట్టారు. ప్రయోగం ఎలాంటి ఫలితాన్నిస్తుందన్న విషయం త్వరగా తెలియాలంటే తక్కువ కాలపరిమితి పంటలనే వేయాలి. అందుకే ఆకుకూరలతో మొదలు పెట్టి పుదీనా, అల్లం, ఆకుకూరలు, కూరగాయలను సాగుచేశారు. పంట పండించడంలో సఫలమయ్యామని త్వరగానే తెలిసింది. కానీ మద్దతు ధర, మార్కెట్‌కు మార్గాలు వారి ఎదుట ప్రశ్నార్థకాలయ్యాయి. పంటను సముద్ర తీరానికి, మార్కెట్, రైతుబజార్, కాలనీలకు తరలించి అమ్మకం సాగించారు. అలా పెరిగిన డిమాండ్ కాస్తా నెలకు రూ.30 వేల నుండి 40 వేల ఆదాయాన్నిచ్చింది. ఈ యువకులు చూపించిన బాటలో గ్రామంలోని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపారు. ప్రస్తుతం పాక్కంలో పండిన కూరగాయలు చెన్నైలోని కోయంబేడు మార్కెట్ నుంచి చిత్తూరు, బెంగుళూరు, కేరళలాంటి ప్రదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఈ యువకులు వ్యవసాయాన్ని కొనసాగిస్తూ, సేంద్రియ వ్యవసాయం చేయాలనే ఆసక్తి ఉన్న వారికి ఉచితంగా శిక్షణ నిస్తున్నారు.


చదువుకున్న వాళ్లు వ్యవసాయం చేయడమేంటి అని ఎవరైనా ప్రశ్నిస్తే... "గింజను నాటే మొక్కను కాపాడి పంట తీయడాన్ని మించిన విద్య మరోటి ఉండదు. అయినా నేలను గౌరవించలేని చదువులెందుకు?" అని తిరిగి ప్రశ్నిస్తునారు అరివుక్కరసన్.

మన యం.వి.రమణా రెడ్డి గారు వ్రాస్తున్న నెల్లూరు జిల్లా చరిత్ర పుస్తకం సెప్టెంబరు మాసంలో విడుదలవుతుంది

మీరెప్పుడైనా తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి శుక్రవార అభిషేకం గురించి విన్నారా?

ఆ స్వామి దర్శనం జరగాలంటే ఆయన ఆశీస్సులు, అనుమతి కావాలి. అభిషేక సేవాదర్శనం అందరికీ లభించదు. కానీ స్వామి సేవలో తరించే ఓ ఇద్దరికీ అభిషేక సేవలు చూపించాలి అనుకున్నప్పటికీ ఎంత ప్రయత్నించినా వారు తిరుమలకు చేరుకోలేకపోయారు. దేనికైనా స్వామి అనుగ్రహం ఉండాలి మరి!

తిరుమలలో శ్రీనివాసునికి జరిగే అన్ని సేవలలో శుక్రవారం తెల్లవారు ఝామున జరిగే అభిషేకం ఎంతో విశిష్టమైనది. ఈ అభిషేక సమయంలో శ్రీనివాసుని దివ్య తేజస్సుని చూడడానికి రెండు కళ్ళు చాలవు. ప్రతీ భక్తునికీ ఈ అభిషేకం సేవలో పాల్గొనాలనే కోరిక ఎంతో గాఢంగా ఉంటుంది. కానీ ఆ స్వామి కరుణించేది ఎవ్వరినో? ఈ అభిషేకం టిక్కట్లు దొరకడం చాలా కష్టం. 2025 దాకా ఈ టికెట్లు ముందుగానే రిజర్వ్ చేసుకున్నారు. ఇదికాక తిరుమల జె.ఇ.ఓ. డిస్క్రీషనరీ కోటా ఉంటుంది. అప్పటి కప్పుడు కొంతమందికి ఇచ్చే అభిషేకం టిక్కెట్లు అవి. అయితే దాదాపు ముఖ్యమంత్రి ఆఫీసు లెవల్లో ప్రయత్నిస్తేగానీ ఆ టిక్కెట్లు దొరకవని చెప్పవచ్చు.



ఆ శ్రీనివాసుని దయవలన నేను ప్రతీ ఉదయం జరిగే సుప్రభాతం, తోమల, అర్చన సేవలన్నిటిలో పాల్గొనే భాగ్యం కలిగింది. ఆ రోజుల్లో నాకున్న ప్రముఖుల పరిచయాలతో ఈ సేవలన్నీ చూడగలిగాను.

కానీ, ఎంతో తక్కువ మందికి మాత్రమే లభించే ఈ అభిషేక సేవ టిక్కెట్లు కూడా సిఫార్సుతో సంపాదించడం నాకు ఇష్టం ఉండేది కాదు. అందువలన చాలా సంవత్సరాలు నేను వాటికోసం ప్రయత్నించలేదు.

అది 1999 వ సంవత్సరం. ఒకరోజు ఉదయం ఆస్ట్రేలియాలో ఉండే నా స్నేహితుడు ఫోన్ చేసి తన భార్యకు చాలా సీరియస్‌గా ఉందనీ, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి అభిషేకం చేయిస్తానని మొక్కుకున్నాననీ, దర్శనం ఏర్పాటు చేయమని అన్నాడు. "నాయనా! నా వల్ల కాదు" అన్నాను.

"నువ్వు ఏం చేస్తావో నాకు తెలీదు! వచ్చే నెల అభిషేక సేవలో పాల్గొనాలి... దట్సాల్" అన్నాడు.

ఇక నాకు తప్పింది కాదు.

ఆ అద్భుత అభిషేక సేవ దర్శనం ఇప్పటికీ మరచిపోలేదు. ఆ సమయంలో స్వామివారి వైభవం చూడటానికి రెండు కళ్ళు సరిపోవు. అలా మైమరచి ఉన్న సమయంలో నాకు ఒక ఆలోచన వచ్చింది. నేను రాస్తున్న స్వామివారి పుస్తకాలన్నిటికీ ప్రచురణ విషయంలో ఎంతో అంకితభావంతో పనిచేస్తున్న కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు గార్లకు ఎలాగైనా ఈ దర్శన భాగ్యం కలిగించాలనే కోరిక కలిగింది.

తర్వాత నెలలోనే నేను, నా భార్య రుక్మిణి, ఆ సోదరులిద్దరూ, కృష్ణమూర్తి తోడల్లుడు మోహన్ గురువారం ఉదయానికి తిరుమలలో ఉండేలా ఏర్పాటు చేసుకున్నాం. ట్రైన్ ఇంకో గంటలో తిరుపతి బయలుదేరుతుందనగా, కృష్ణమూర్తిగారు ఫోన్ చేసి 'సార్! మా తమ్ముడికి ఆఫీసులో అర్జంటు పని వచ్చింది. ఫ్లైట్‌లో సాయంత్రం కల్లా తిరుపతి చేరుకుంటాం' అన్నారు. మేం ముగ్గురం తిరుమల చేరాం. వారి కోసం ఎదురు చూడసాగాను. గురువారం సాయంత్రం నాలుగైనా జాడలేదు. ఇంతలో ఫోన్, 'సార్! ఫ్లైట్ మిస్సయాం' అని, 'ఫ్లైట్‌లో 9 గంటలకల్లా చెన్నై చేరి,

రోడ్డు మార్గంలో 12 గంటలలోపే తిరుమలకు వస్తాం సార్... ఉదయం 3 గంటలకు కదా అభిషేకం' అన్నారు. "వీళ్ళకు ఇలా ఎందుకవుతోంది? ఓ శ్రీనివాసా! వారికి మీ అభిషేక దర్శనం అనుగ్రహించు స్వామీ!" అని ఎంతో ప్రార్థించాను.

రాత్రి పది గంటలైనా వాళ్ళ నుండి మళ్ళీ ఫోన్ రాలేదు. ఏమయిందబ్బా! అని టెన్షన్ పడుతుండగా మళ్ళీ ఫోన్ మోగింది. కృష్ణమూర్తిగారే!

సార్! ఫ్లయిట్ లేటయింది. ఇప్పుడే చెన్నై చేరాం! రెండు గంటల్లో తిరుపతిలో ఉంటాం' అన్నారు.

"హమ్మయ్య" అనుకున్నాను గానీ పన్నెండు గంటలకు 'ఘాట్‌రోడ్ మూసేసారని, ఏ వాహనం పైకి అనుమతించడం లేదని మళ్ళీ కృష్ణమూర్తి గారి నుంచే ఫోన్, అలిపిరి సెక్యూరిటీ ఆఫీసర్ గారిని ఎంతో బ్రతిమిలాడితే, ఆయన అభిషేకం టిక్కెట్లు ఉన్నాయా" అని అడిగాడు. పైన కాటేజ్‌లో ఉన్నాయని చెబితే, వాటిని తిరుమల టోల్‌గేట్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు చూపించమన్నారు. 'ఆయన నాకు ఫోన్ చేస్తే పంపిస్తానని' అన్నారు.

మోహన్‌గారు టిక్కెట్లు తీసుకెళ్ళి టోల్‌గేట్ ఆఫీసర్‌కు చూపించాడు. ఆయన క్రిందకు ఫోన్ చేసేలోపు అలిపిరి సెక్యూరిటీ ఆఫీసర్ డ్యూటీ ఆయిపోయి వెళ్ళిపోవడంతో వేరే సెక్యూరిటీ ఆఫీసర్ వచ్చాడు. పైకి కారు పంపడానికి తనకు ఏ మాత్రం అధికారంలేదని అతడు చేప్పేశాడు. ఆయన ఎంత మొత్తుకున్నా వినలేదు. దాంతో కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు తెల్లారేదాకా కొండ క్రింద ఉండిపోయారు.

నేను, రుక్మిణి, మోహన్ గారు అభిషేకానికి వెళ్ళాం. అనుకోకుండ మోహన్‌గారికి అదృష్టం కలిగింది. స్వామివారి అనుగ్రహం లేకపోతే ఎంత ప్రయత్నించినా దర్శనం లభించదు. ఎందరో ఐ.ఏ.యస్. ఆఫీసర్లు కూడా ఒక్కొక్కసారి ఎంత ప్రయత్నించినా దర్శనం లభించకపోవడం గమనించాను. ఆ స్వామి ఎప్పుడు ఏ విధంగా తన దర్శనం అనుగ్రహిస్తాడో... అంతే ప్రాప్తం. ఆ స్వామి అనుకోకపోతే శతవిధాల ప్రయత్నించినా దర్శనం లభించదు. ఆ శ్రీనివాసుని లీలలు అనంతం. వేయి నాలుకలున్న ఆదిశేషుడే ఆ స్వామి లీలలను పూర్తిగా పొగడలేనప్పుడు, అతి సామాన్యులమైన మనమెంత?

శ్రియం: కాంతాయ కళ్యాణ నిధియే నిధయేర్తినామ్!
శ్రీ వేకంట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్!!

వలస పక్షులు

ఇక్కడ కరవు రక్కసి
కొండచిలువ నోరు తెరిచి కూర్చుంటోంది
కరవుకోరల్లో జనజీవనం కర్కశంగా నలిగి పిప్పై
ప్రాణాన్ని చిక్కబట్టుకొని జీవనభృతి కోసం
వలసపక్షిఎగిరిపోతుంది!
ఆలుబిడ్డల ఎడబాటుకు ఆకలి అడ్డమౌతుంది!
ఆ పక్షులు ముక్కున పొదుచుకొచ్చిన మూడిత్తులు
ఆ గూటికి మూణ్నాళ్ల బత్తెమౌతుంది
పస్తులు ఒకపొద్దు పండుగలౌతాయి
ఇచ్చట కళ్లెప్పుడు వత్తులేసుకొని వసంతాలకై వెతకవు
పట్టెడు మెతుకులకే పడిగాపులు కాస్తుంటాయి
గ్రీష్మం ధాటికి వసంతమెప్పుడో వలస బోయింది!
నీళ్లోసుకున్న మేఘాలెప్పుడూ ఇక్కడ తమ బరువును దింపుకోవు
పచ్చదనాన్ని వెతుక్కుంటూ సాగిపోతుంటాయి!
ఇచ్చట నేలతల్లి నింగికి
మొరెత్తి నిరాశతో బీడు లెత్తుతుంది
మోటబావుల్లో ఊట పాతాళం వలస బోతోంది!
తాగునీట దాగున్న 'ఫ్లోరిన్' మారి కీళ్ల విఘాత కారకమౌతుంది!
మేడు పదులకే జనం ముసలి ముసుగేసుకుంటారు!
ఇక్కడి కొండలగుండెలు కరిగి
బండలుగా బద్దలై బతుక్కు ఉపాధినిస్తాయి!
కొండని నమ్మిన రాజకీయం గుండె
బండరాయిలానే మిగులుతోంది!
అయినా ఇక్కడ కొడిగట్టిన ఆశలదివ్వెలు దివిటీలౌతాయని
ఇంకా మేల్కొనని నిద్దట్లో కలలెన్నో కంటూ...
అదనులో పదవి తన్నుకెళ్లి గోపురమెక్కిన
రాబందుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ
అనుక్షణం విలపిస్తూ... దేవుణ్ని శపిస్తూ! శరిస్తూ!
బతుకుతెరువు వెతుక్కుంటూ
ఈ ప్రాంతం పక్షులన్నీ వలసబోతుంటాయి!

కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి

ప్రచార ఆర్భాటాలు-ఊరేగింపులు-సన్మానాలు-సత్కారాలు ఎందుకు

తెలుగు ప్రజల్ని ఎంత అన్యాయంగా-ఎంతఘోరంగా, ఎంత దుర్మార్గంగా విడగొట్టారో తలుచుకుంటేనే మనస్సుకి బాధైపోతుంది. ఇంత పెద్ద రాష్ట్రాన్ని, ఇంత మంచి రాష్ట్రాన్ని విభజించేదానికి కారకులైన కేంద్ర పెద్దల, పొరుగు రాష్ట్రాల, స్వరాష్ట్రీయుల మోసపూరితమైన చర్యలు ఎంత ద్రోహపూరితమైనవో తలుచుకుంటేనే మరిచిపోలేని విషాధగాథ. రాష్ట్ర విభజన తెలుగువారి పాలిట కర్కశనీతి. శాడిస్టులు చేసిన వికృత చర్య. తెలుగుతల్లిని నడవీధిలో నిలబెట్టి తూట్లుతూట్లుగా పొడిచిన నరహంతకుల రాక్షసచర్య.

కొంతమంది పెద్దలు తమ అధికార దాహం తీర్చుకోనేదానికి రాష్ట్రాన్ని విభజిస్తే, కొంతమంది తమ రాజకీయ ప్రాబల్యం ఎక్కడ దెబ్బతింటుందో, అధికారానికి ఎక్కడ దూరమైపోతామోనని ప్రజల్ని మోసం చేస్తూ నటిస్తే, మరి కొంతమంది రాష్ట్రాన్ని అంత సులభంగా, అంత అన్యాయంగా చీలిపోనివ్వం మా తడాఖా చూపిస్తామంటూ -మాటల ద్వారా పత్రికా ప్రకటనల ద్వారా ప్రజల్ని మభ్యపరుస్తూ, మోసపు మాటలతో ప్రజల్ని వంచిస్తూ ఆంధ్రరాష్ట్రాన్ని రెండుగా చీలనివ్వం అంటూనే నిట్టనిలువునా చీల్చేసిన విధానం చూస్తే ప్రతి తెలుగువాడి గుండె తరుక్కుపోతుంది.

మహాభారతంలో ద్రౌపదిని నిండుసభలో అవమానించిన తీరులాగా ప్రజాస్వామ్య వినాశానానికి కారకులయ్యారు నేటి రాజకీయ నాయకులు. అలనాటి మహాభారతంలో దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణ దుష్ట చతుష్టయాదులులాగా అందరు రాజకీయ నాయకులు, అన్ని రాజకీయ పార్టీలు తలా ఒక చెయ్యేసి కుచ్చితుల రూపంలో ప్రత్యక్షమైనారు.

శకుని మంత్రాంగాలు, సంజయ రాయభారాలు, సైందవుని ప్రతిబంధకాలు, శల్యసారధ్యాలు, ఒకటేమిటి? దుశ్శాసన కీచక పర్వాలతో సహా సమస్తమూ కుళ్లు కుతంత్రాల కథగా సాగిపోయింది. ప్రజాస్వామ్యం పేరిట ప్రజాక్షేమం పేరిట రాజకీయ నాయకులు ఆడిన దొంగనాటకాలు చూస్తే ఔరా! అని ముక్కున వ్రేలు వేసుకోక తప్పదు.

ఒకప్పటి ఈ దేశ ప్రధానమంత్రి- శ్రీమతి ఇందిరాగాంధీ ఈ తెలుగు రాష్ట్రాన్ని చీల్చేదానికిలేదు, కాదు అని ఎంత గట్టిగా నిలబడిందో, అంత గట్టిగా ఈ రాష్ట్రాన్ని చీల్చేదానికి కారకురాలైంది ఆమె కోడలు సోనియాగాంధీ.

ఒక్కప్పటి తెలుగువారు స్వాతంత్ర్య సమరయోధులు, బ్రిటీష్ వారికి ఎదురొడ్డి తమని కాల్చమని గుండెల్ని చూపించిన మగ ధీరులు. భారత దేశపటంలో ఆంధ్రప్రదేశ్ ఒక మణిరత్నం. నేడు అది చింపి చీలికైన గోచిపాత. నేటి తెలుగువారి వంటి చచ్చు-పుచ్చు మరియు రొచ్చు మూక ప్రపంచంలో మరెక్కడా ఉండరని చాటిచెప్పారు. ఈ ఘటన అడుక్కొనే ముష్టివాళ్లే మనకన్నా ఎన్నో రెట్లు మేలనిపిస్తుంది.

దేశమంతటా ఎన్నికలు జరిగాయి. ఆంధ్రరాష్ట్రాన్ని నవ్యాంధ్ర చేస్తామని, రైతుల అప్పుల్ని త్రోసేస్తామని ప్రజల్ని మభ్యపెట్టి ఒక పార్టీ అధికారంలోకి వస్తే-నల్లధనాన్ని వెలికితీస్తామని ఇంకొక పార్టీ కేంద్రంలో అధికారానికొచ్చింది. స్వాతంత్ర్యానికి పూర్వం నల్లధనం వేళ్లమీదే. ఈనాడు అది బండ్లు, రైళ్లు, విమానాలు కూడా పట్టనంతగా విదేశాలకు తరలివెళ్లిపోతూ ఉన్నది. ఇదంతా కూడా తెలుగు ప్రజలు తమకు ద్రోహం చేసినవారిని గురించి ఆలోచించడం మానేశారు.

దేశంలో ఉన్న కోటీశ్వరులు ఇంకా కోట్లకు పడగలెత్తుతున్నారు. అధికారంలో కొనసాగేందుకు వందల కోట్లు ఖర్చుపెడుతున్నారు. డబ్బుతో అధికారాన్ని, పదవుల్ని కొనుక్కొంటున్నారు. రామాయణ కాలంనాటి ప్రహస్త మంత్రిత్వాలేకాదు, భాగవతంలోని సుందోపసుందులు, పంచతంత్రంలోని కరటకదమనులు "ఆషాడభూతులు" రాణిసంయుక్త కాలంనాటి "జయచంద్రులు" (నేటి పిరాయింపుదారులు) ఎక్కడికక్కడ సాక్షాత్కరిస్తున్నారు. పదవులు, పారితోషికాలు, రాజభోగాలు అనుభవిస్తూ ప్రజలకు మాత్రం నీతులు చెబుతున్నారు.

నేటి భారతంలో రాజకీయ వ్యాపారంకంటే మించిన లాభసాటి వ్యాపారం మరొక్కటిలేదు. అదొక పాటిమట్టిపాతర. త్రవ్వుకుంటూపోతే ఎంత నిధైనా దోచుకోవచ్చు. సమాజంలో పెద్దమనిషిగా చలామణిఅవుతూ, ప్రజలకు నీతులు భోదిస్తూ ఘనాపాఠీగా సాగిపోతూ ఉండవచ్చు.

తెలుగువాళ్లకి ద్రోహంచేసిన విషయం మర్చిపోయారు. అమాయక ప్రజ. అధికారంలో ఉన్నవాడితో పరిచయం కలిగి ఉండాలనే ఆశ. అధికారంలో ఉన్నాయన మెడలో దండవేసి, శాలువా కప్పి, ఆయనకు దండంపెట్టి, ఆయనతో కలిసి ఫోటో ఒకటి తీయించుకోవాలనే అల్ప ఆశ. అలా చేస్తే కొండెక్కినంత సంబరం. అంతలావు ఆయనతో నాకూ పరిచయం అని గొప్పగా చెప్పుకోవడం-సెల్ఫ్ బోస్ట్‌తో సంతృప్తి.

ప్రజాప్రతినిధిగా గెలిచి మంత్రైతే అదో గొప్పతనమా? అలా మంత్రి అయినందుకు కారులో కూర్చోబెట్టి, దారి పొడవునా ఆయనకు పూలుజల్లుతూ వేదికవద్దకు తీసుకవచ్చి మంత్రిగారికి దండలు, శాలువాలు కప్పడం గొప్పతనమా?

దేశం ఎట్లా ఉంది? ప్రజలెలా బ్రతుకుతున్నారు? వ్యాపారస్థులు ఏమిచేస్తున్నారు? దళారీలు ఎంత దోచేస్తున్నారు? విద్య, వైద్యం, రాజకీయం వ్యాపారమై పోయాయి. అక్రమాలు, అన్యాయాలు, అన్యాయార్జితాలు పెరిగిపోతున్నాయి. సంస్కృతి-సాంప్రదాయాలు నాశనమై పోతున్నాయి. నీతి-నిజాయితీలు తుంగలో త్రొక్కేశారు. అధికారం సంపాదించడమే పరమావధి-తరతరాలుగా డబ్బు దాచుకోవడమే జీవిత లక్ష్యం!


ఎక్కడ కెళుతున్నాం మనం?

మొట్టమొదట అక్రమాలను, అన్యాయాలను అరికట్టి-నీతినిజాయితీగా నడుచుకుంటూ, ధర్మబద్ధమైన పరిపాలన అందించినప్పుడు గదా సత్కారాలు, సన్మానాలు అందుకోవాలి. ఆలోచించండి రాజకీయ నాయకులారా.

ఆత్మకూరు మెకానిక్ అబ్దుల్ కరీంకు అనుభవం నేర్పిన సాంప్రదాయ వైద్యం

జీవన విధానానికి ప్రాధాన్యతనిస్తూ, ఆయుష్షును పెంచుకునే మార్గాలకు బాటలు వేసిన మహిమాన్విత సంపద మన ఆయుర్వేదం అని, ఈ వారసత్వ సంపదను కాపాడుకోవటం ప్రతి వ్యక్తి బాధ్యత అంటారు కరీం.

కర్నూలు జిల్లా ఆత్మకూరు మండల కేంద్రం (ఒకప్పటి తాలూకా కేంద్రం) లో తన తెలివి తేటలతో ఎటువంటి యంత్రాన్నయినా సునాయసంగా, విజయవంతంగా రిపేరు చేస్తూ పరిసర ప్రాంతాలలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న వ్యక్తి 60 సంవత్సరాల అబ్దుల్ కరీం. ఆయన తండ్రి వృత్తిరీత్యా కుట్టు మిషన్లు రిపేరు చేసేవారు. బ్రతుకు తెరవుకై సమీపంలోని 'పారుమంచాల' గ్రామం నుండి ఆత్మకూరుకు వచ్చి స్థిరపడ్డాడు. కరీం కూడా తండ్రి దగ్గర అదే విద్యను అభ్యసించి తాను కూడా మెకానిక్‌గా మారాడు. అది ఆయనకు ఎక్కువ ఆనందాన్ని ఇవ్వకపోవడం వల్ల ఇంకా పెద్ద మెకానిక్‌గా మారాలని నిశ్చయించుకొని తన మిత్రుడు అబ్దుల్ ఖాదర్‌తో కలిసి ఒక మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. అది దినదినాభివృద్ధి చెంది ఇప్పుడు ఆత్మకూరు పట్టణంలో లారీలు, ట్రిప్పర్లు, ఆయిల్ ఇంజన్‌లు, ఆటోలు, ఇంటిపనులకు వినియోగించే ఎటువంటి మెకానిక్ పనులకైనా చేసే వర్క్‌షాప్‌గా పేరు తెచ్చుకుంది. ఇదంతా కరీం కృషి ఫలితమే. ఎవరైనా ఇది ఇక రిపేరుకు కూడా పనికి రాదు అని అంటే దాన్ని నేను రిపేరి చేసి పెడతాను అంటాడు కరీం. మిత్రులిద్దరూ మంచి పనితనంతో ఎటువంటి రిపేర్‌నయినా విజయవంతంగా పూర్తిచేస్తారనే మంచి పేరు సంపాదించుకున్నారు. వీరి తర్ఫీదులో ఇప్పుడు కరీం కుమారుడు కూడా మంచి మెకానిక్‌గా అభివృద్ధి చెందుతున్నాడు.



కరీం సంతానంలో మొదటి బిడ్డకు ఒక అంతుబట్టని వ్యాధి సోకింది. తనకున్న ఆర్థిక స్థోమతతో ఎందరెందరో డాక్టర్లకు చూసినా నయం కాలేదు సరికదా ఇక ఈ బిడ్డ బ్రతకడం కష్టమని డాక్టర్లే తేల్చివేశారు. సరే కన్నందుకు ఆలనా పాలనా చూడక తప్పదు కదా అని ఆ బిడ్డను ఇంటికి తెచ్చుకుని తనకున్న పరిజ్ఞానంతో ఈ ఇంగ్లీషు వైద్యం కన్నా సాంప్రదాయ వైద్యం వల్ల ఏమైనా బాగవుతుందేమో అన్న చిన్న ఆశతో ఎన్నో రకాల ఆయుర్వేద గ్రంథాలను సమకూర్చుకుని వాటిని నిశితంగా చదివి, అర్థం చేసుకుని, వాటిలో వున్న జ్ఞానానికి తన స్వంత ఆలోచనలను జోడించి, ఎన్నో రకాల వైద్యాలను చేసి తన కొడుకును కొంతకాలం పాటు బ్రతికించుకో గలిగాడు. కాని విధిని తప్పించలేక పోవటం వల్ల పుత్ర శోకంతో కాస్త కుంగిపోయాడు. ఈ మాటలు అంటున్నపుడు పుత్రుని జ్ఞాపకాలతో ఉద్వేగానికి లోనయ్యాడు.

సరే భగవంతుని ఆలోచన ఇలా వుంది అనుకుని చనిపోయిన కుమారుడ్ని తలుచుకుంటూ క్రుంగి పోక, వృత్తిపరంగా తన మెకానిక్ వృత్తిపై శ్రద్ధ వహిస్తూనే ఎప్పుడో చనిపోతాడనుకున్న తన కొడుకును ఇంతకాలం పాటు బ్రతికించుకునేలా చేసిన సాంప్రదాయ వైద్యాన్ని విస్మరించకూడదు అనుకున్నాడు. తనలాంటి ఎందరో దురదృష్ట వంతులకు కాస్త స్వాంతన చేకూరిస్తే చాలు తన జన్మ ధన్యమైపోతుందని భావించాడు. ఆయుర్వేదంపై మరింత పట్టు సాధించాలనే సంకల్పంతో మరిన్ని గ్రంథాలను చదివి, అనుభవజ్ఞుల వద్ద తెలుసుకుని ప్రస్తుతం మెకానిక్ గానే కాకుండా ఒక పరిపూర్ణమైన వైద్యుడిగా కూడా చుట్టుపట్ల గ్రామాలే కాదు, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లో కూడా పేరు ప్రఖ్యాతులను సంపాదించుకున్నాడు కరీం భాయ్.

మానవులకు ఆయుష్షును, ఆరోగ్యాన్ని ప్రసాదించేవి చెట్లు అని, ఆయుర్వేద వైద్య సంపద మనకు మహర్షులు అందించిన ఒక అద్భుత వరమని అంటాడు కరీం. ఒక్క వైద్యమే కాదు, జీవన విధానానికి ప్రాధాన్యతనిస్తూ, ఆయుష్షును పెంచుకునే మార్గాలకు బాటలు వేసిన మహిమాన్విత సంపద మన ఆయుర్వేదం అని, ఈ వారసత్వ సంపదను కాపాడుకోవటం ప్రతి వ్యక్తి బాధ్యత అంటారు కరీం. వైద్య విధానంలో ఆధునిక పరిశోధనలు ఎన్ని వచ్చినా ఆయుర్వేదం తన విశిష్టతను చాటుకుంటూనే వుంది అంటారాయన.

ఆయుర్వేదానికి అవసరమైన మొక్కలు ఎక్కడో పెద్ద పెద్ద అడవుల్లోనో వుంటాయి అనుకోవటం పొరపాటు అని,

అవి ప్రతి గ్రామంలో పట్టణంలో ఉన్నాయని, కాని వాటిని గుర్తించి సరైన పద్ధతిలో వాడితే ఎన్నో రుగ్మతలు అతి తక్కువ ఖర్చుతో, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా నయం చేయవచ్చు అంటారు కరీం. అందుకై ప్రతి పట్టణంలో ఆయుర్వేద మేళాలు ఏర్పాటు చేసి వాటిని మానవాళికి అర్థమయ్యేలా చెప్పడం మంచి పద్ధతి అని ఆయన ఉద్దేశ్యం. తాను వనాల వెంట నడుస్తుంటే చెట్లు నాతో మాట్లాడుతున్నట్లు అనిపిస్తుందని చిలిపిగా అంటారు కరీం.

మన సాంప్రదాయాలలో మనకి తెలియని ఎన్నో విషయాలను గురించి చెపుతారాయన. మన పెరటిలో భగవంతుని ప్రతిరూపంగా 'తులసి'ని ఎందుకు పూజిస్తారో తెలుసా, అందులో అద్భుతమైన ఔషధ గుణాలుండటం ఒకటైతే, తులసి మొక్కని పూజిస్తున్న ఇంట్లో ఎన్నిరోజులు నివసిస్తే అన్ని వేల సంవత్సరాలు ఆ వ్యక్తి వైకుంఠంలో గౌరవింపబడతాడు అన్నది కొందరి నమ్మకం అంటారు ఆయన. ఇలాంటివి ఎన్నో విశేషాలు చెప్పుకొచ్చారాయన. ఉదా: శివునికి ఇష్టమైన బిల్వ (మారేడు) వృక్షాన్ని పెంచిన వ్యక్తి కుటుంబంలో లక్ష్మీదేవి తరతరాలుగా నివసిస్తుందని, వేప చెట్టు నాటిన వారు స్వర్గలోకాన్ని పొందుతారని, అశ్వర్థ వృక్షం (రావి చెట్టు) ఒక్కటైనా నాటినవారు మోక్షాన్ని పొందుతారని, ఎనిమిది ఊదుంబర (మేడి) వృక్షాలు నాటిన వారు పార్వతీ దేవికి ప్రీతిపాత్రులౌతారని, ఉసిరి వృక్షాలు నాటినవారు అనేక యాగాలు చేసిన ఫలం పొందుతారని, నాలుగు ప్లక్ష (జువ్వి) వృక్షాలను నాటినవారు నిస్సందేహంగా రాజసూయ యాగం చేసిన ఫలితాన్ని పొందుతారని చెప్పుకొచ్చారు కరీం. పదిమంది కొడుకులను కనడంకంటే ఒక వృక్షం నాటడం శ్రేష్ఠమని అంతేకాదు మనం వృక్షాలను పూజిస్తే అవి అనేక ఫలితాలనిస్తాయని నమ్ముతారాయన.

కరీం తన పేరు చెప్పకుండా మాట్లాడుకుంటూపోతే ఈయన ముస్లిం అని ఎవ్వరూ నమ్మరు అంతటి స్వచ్ఛమైన తెలుగు ఆయనది. జ్ఞానానికి, మతానికి సంబంధం లేదని, ఏమతమైనా మానవ కళ్యాణమే కోరుతుందని నిర్దిష్టంగా చెప్పాడు. తాను ఇప్పటికీ ఎన్నో రుగ్మతలను ఎంతో మందికి నయం చేశానని, వారి కృతజ్ఞతాభావమే నన్ను ఇంకా ఎంతోమందికి వైద్య సేవ చేసే అవకాశాన్ని ఇస్తోందని త్రికరణశుద్ధిగా నమ్మారాయన.

తాను కొన్ని రుగ్మతలకు వైద్యం చేస్తూవుంటే, తానిచ్చిన ఔషధాలలో తనకు తెలియకుండానే మరో రోగాన్ని నయం చేసే శక్తి వుందని గ్రహించాడాయన. ఒకసారి ఒక రోగికి వాతం రోగానికి మందు ఇస్తే అది వాడటం వల్ల వాతం తగ్గిపోవటంతో పాటు ఈయన ఇచ్చిన మందులలో ఒక పొడి ఆ రోగికున్న షుగర్ వ్యాధిని కూడా తగ్గించిందని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు కరీం. దానిపైన ప్రయోగం చేసి ఇప్పుడు షుగర్ వ్యాధికి అద్భుతమైన మందును తయారు చేశాడు. ఇది ఎక్కడైనా దొరుకుతుంది. పూజా సామగ్రి అమ్మే షాపుల్లో 'హోమం పొడి' అంటే ఇస్తారు. దాన్ని తెచ్చుకుని, రోజూ ఒక చెంచాడు పొడిని ఒక గ్లాసెడు నీటిలో వడపోసుకుని త్రాగాలి. ఇది ఒక పద్ధతి ప్రకారం త్రాగాలి. అంటే మొదట పది రోజులు ప్రస్తుతం వేసుకుంటున్న షుగర్ మాత్రలతో పాటు ఈ కషాయాన్ని త్రాగాలి. ఆ తర్వాత వరుసగా రెండు రోజులు కషాయం మాత్రమే త్రాగి మూడవ రోజు ఒక మాత్ర వాడాలి. తర్వాత మూడు రోజులు కషాయం మాత్రమే వాడి నాలుగో రోజు కషాయంతో పాటు మాత్ర వేసుకోవాలి. అలాగే రోజులు పెంచుకుంటూ, చివరి రోజున మాత్ర వేసుకుంటూ చివరికీ పది రోజుల పాటు మాత్రలు వేసుకోకుండా కషాయం మాత్రమే త్రాగి, పదకొండవ రోజు మాత్ర వేసుకోవాలి. ఇలా వాడితే ఇవి యాభై రెండు రోజులు అవుతుందని, ఆ తర్వాత ఇక రెండు నెలల వరకు ఎలాంటి మాత్ర వేసుకోకుండా ఈ కషాయం మాత్రమే త్రాగితే ఇక తర్వాత ఈ కషాయం కూడా త్రాగవలసిన అవసరం లేదని నిరూపితమైంది అంటారు కరీం. అప్పుడప్పుడు షుగర్ పరీక్ష చేయించుకుంటూ ఎప్పుడైనా ఎక్కువైనప్పుడు ఒకటి రెండు రోజులు ఈ కషాయం చేసుకుని తీసుకుంటే సరిపోతుంది అంటారాయన. ఈ ఔషధం వల్ల ఆ రోగికి షుగర్ తగ్గిన తర్వాత మిఠాయిలు, అరటి, మామిడి పండ్లు తిన్నా కూడా షుగర్ పెరగదని అంటారాయన. ఈ మందు వాడటం వలన శరీర ఆరోగ్యం మెరుగుపడి ముఖ వర్చస్సు కూడా పెరుగుతుంది అంటారాయన.

ఈ మందును ఈయన ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఎన్నో జిల్లాలకు పంపటమే కాక తమిళనాడు, కర్ణాటకలాంటి ఇతర రాష్ట్రాలతోపాటు, దుబాయ్‌కి కూడా సరఫరా చేశాననీ, ఇంతవరకు వాడిన ప్రతి ఒక్కరూ తాము చాలా ఆరోగ్యంగా, ఆనందంగా వున్నామని చెపుతున్నారు అంటారు కరీం.

అలాగే కొందరికి తలనొప్పి విపరీతంగా బాధిస్తూ వుంటుందని, అలాంటివారు ఏపనీ చేయలేరని, వారు 'గసగసాలు' 50 గ్రా. తీసుకుని రాత్రంతా నానబెట్టి ఉదయం ఆ నీటిని మిక్సీలో వేసి కలియబెట్టాలి. ఆ తర్వాత ఆ నీటితో అన్నం వండాలి. ఆ నీటికి ఎంత బియ్యం సరిపోతుందో (అత్తెసరు) అంతే బియ్యం తీసుకుని బియ్యం అన్నం వండాలి. అందులో వెల్లుల్లి కారం, నెయ్యి తప్పనిసరిగా వేసుకుని రెండురోజుల పాటు తింటే మన తలలో వున్న దోషాలన్నీ ముక్కుద్వారా బయటికి వెళ్ళి తల బరువు తగ్గి, చాలా హాయిగా ప్రశాంతంగా వుంటుందని అంటాడు కరీం.

అలాగే తెల్ల వెంపలి వేరును మెత్తగా నూరి మజ్జిగలో కలుపుకుని త్రాగితే ఎటువంటి కిడ్నీ వ్యాధులైన నయమౌతాయి అంటాడు. గ్రంథాలలో దీని గుణాన్ని విశిష్టంగా వివరించారని, "తెల్ల వెంపలి పచ్చి వేరును పాలతో మెత్తగా నూరి మజ్జిగలో కలిపి సేవిస్తే ప్లీహ రోగాలు నయమౌతాయి. ఇది పని చేయనిచో పర్వతాలు నీటిపై తేలియాడినట్లే" అని వుందని డా.కె.నిశ్శేశ్వర్ గారు రచించిన "భావప్రకాశిక" అనే గ్రంథం లో చూపించాడు.

హెయిర్ ఆయిల్ ఒకటి తయారు చేశాడు కరీం. దాన్ని వాడితే వెంట్రుకలు రాలటం ఆగిపోతుంది. అంతేకాదు వెంట్రుకలు పెరుగుతాయి. నల్లబడతాయికూడా. ఇది విరివిగా

అమ్ముడు పోతోంది. ఎంతోమంది తనవద్దకు వచ్చి ఇది తయారు చేయించి మరీ తీసుకు వెళుతుంటారు అంటాడు.

ఎముకల్లో గుజ్జు తరిగిపోయి మోకాలి నొప్పులు వచ్చిన వాళ్ళకి తన ఔషధం దివ్యంగా పనిచేస్తుంది అంటారాయన. ఈ నొప్పులకీ ఔషధంతోపాటు మర్దనా చేయటానికి ఒక తైలం కూడా ఇస్తాడు. ఈ మందు తిని, నూనె మర్దనా చేస్తే వందశాతం గుజ్జు పెరుగుతుంది. ఇక్కడే ఆత్మకూరులో ఒక మహిళ నడవలేక ఇక మోకాలు ఆపరేషన్ తప్పనిసరి అనుకున్న సమయంలో వారు తన వద్దకు రాగా తాను ఇచ్చిన మందు మూడు మాసాలు వాడిందని, ప్రస్తుతం ఆమె హాయిగా నడుస్తుందని, మోకాలు ఆపరేషన్ అవసరం లేకుండానే తన నొప్పులు నయమైనందుకు ఆమె ఎంతో ఆనందంగా వుందని అన్నారాయన.

తాను ఇచ్చే మందులలో కీళ్ళ నొప్పుల ఔషధం అద్భుతంగా పనిచేస్తోందని, ఇంకా ఎన్నో రోగాలకు తాను ఔషధాన్ని తయారు చేసి ఇస్తున్నానని, భగవంతుని దయవల్ల అందరికీ నయమౌతుండటంతో తనకు మంచిపేరు ప్రఖ్యాతులు వస్తున్నాయని అన్నాడు. తన ఔషధానికి రోగులను పీడించి డబ్బు వసూలు చేసే గుణం తనకు లేదని, రోగి హృదయపూర్వకంగా ఇచ్చిందే స్వీకరిస్తానని, అలాగే ఏమీ ఇచ్చుకోలేని ఎంతోమంది రోగులకు కూడా నేనే స్వయంగా ఇంటికి వెళ్ళి మందులు ఉచితంగా ఇచ్చి వస్తుంటానని అన్నారు.

వైద్యుడు తాను చేసిన మందుకు వచ్చిన ధనాన్ని ఐదు భాగాలు చేయాలి. మొదటిది ద్రవ భాగం అంటే మందు తయారీకి కావలసిన మూలికల సేకరణకు అయ్యే ఖర్చు, రెండవది దైవ భాగం, మూడవది మిత్ర భాగం, నాలుగవది సేవా భాగం (డబ్బులివ్వటం చేతకాని వారి వైద్యం). ఐదవది తన భాగం, అంటే తాను తయారు చేసిన మందులలో తాను ఐదవ వంతు మాత్రమే తీసుకుని చేస్తానని, తనకు ఇంతకన్నా ఎక్కువ అవసరం లేదని, దీనితోనే నేను సుఖంగా సంతోషంగా ఉన్నానని, నా మందులు వాడిన రోగులు నయమై తాను ఎక్కడైనా కనపడితే కృతజ్ఞతా భావంతో పలకరిస్తే చాలు తనకు ఎంతో ఆనందం కలుగుతుందని, ఈ భావాన్ని అన్వయించుకున్న ఏ వైద్యుడు ఎటువంటి మందు ఇచ్చినా రోగం నయమౌతుందని, ఆ సూత్రాన్ని వైద్యులందరూ పాటిస్తే 'వైద్యో నారాయణ' అన్నది నిజమౌతుంది అంటున్నాడు కరీం.

ప్రతి ఆయుర్వేద వైద్యునికి రోగం గురించి క్షుణ్ణంగా తెలిసుండాలి. అలాగే ఆ రోగానికి ఎలాంటి మూలికలు పనిచేస్తాయో గ్రహించగలిగే శక్తి వుండాలి. ప్రతి మూలిక పుట్టుకకు గ్రంథాలలో ఒక కథ వుంటుంది, ఆ కథలు కూడా తెలిసుండాలి, ఎందుకంటే అలాంటి కథలు తెలిసినపుడు ఆ మూలిక ఏయే రుగ్మతలకు, రోగాలకు పనిచేస్తుందో తెలుసుకోగలిగే శక్తి వస్తుంది.

తాను ఇస్తున్న ఔషధాలలో విజయవంతంగా పనిచేస్తున్న మందులు... పైల్స్ (మొలలు), సోరియాసిస్, కీళ్ళ నొప్పులు, అనేక రకాల చర్మవ్యాధులు, ఇంకా ఎన్నో రకాల రోగాలను నయం చేయగలిగానని అన్నారు.

ప్రతి మనిషి ప్రశాంత మనసుతో వుండాలంటే సరియైన నిద్ర, శృంగార నియమాలు పాటించాలని అటువంటి వ్యక్తి ముఖం మంచి వర్చస్సుతో వెలిగిపోతుందని, కాబట్టి ప్రతి వ్యక్తి పై వాటిని నియమం తప్పకుండా పాటిస్తే ఆరోగ్యంగా వుంటాడని వక్కాణించారు.

మెకానిజం, వైద్యంతో పాటు ఆయుర్వేదాన్ని, మూలికలను ప్రచారం చేయటంలో కూడా విరివిగా పాల్గొంటూ వుంటారు కరీం. ఎన్నో దేవాలయాల పుట్టు పూర్వోత్తరాలు, వాటి విశిష్టత ఎరిగిన వ్యక్తి ఈయన. ప్రకృతి అంటే ఆయనకు అపారమైన గౌరవం. ప్రకృతిలో అన్ని వ్యాధులకు పరిష్కారాలున్నాయని ఆయనకు పూర్తి విశ్వాసం. దానివల్లే దృఢమైన సంకల్పంతో ఆయన ప్రతి వ్యాధికి ప్రకృతిలో పరిష్కారం వెతుకుతాడు. ప్రకృతిలో ఏది చూసినా నాకు అంత ఆనందం వేస్తుంది. నేనే కాదు ఏ వ్యక్తి అయినా తాను గొప్పగా సంకల్పం చేసుకుంటే ప్రతి వస్తువులో ఆనందాన్ని చూస్తాడు. ఏదైనా నేను తప్పక చేయగలను అని సంకల్పించుకుంటే అది తప్పకుండా నెరవేరుతుంది.

ఈ విషయాలన్నీ తాను ఎన్నో గ్రంథాలు చదివి తెలుసుకున్నానని చెపుతూ, కొప్పు సంధ్యారావు గారు రచించిన ఒక చిన్న గ్రంథం మొదట చదివి నేను ఎంతో ఉద్వేగానికి లోనై, ఆ తర్వాత కర్రా విశ్వేశ్వర్, కొండపల్లి నర్సింహారెడ్డి, చిరుమామిళ్ళ మురళీమోహన్, సుబ్రహ్మణ్యం, చక్రవర్తుల పద్మనాథ శాస్త్రి గారు లాంటి ఎందరో గొప్ప వ్యక్తులు వ్రాసిన ఎన్నో గ్రంథాలను చదవటమేకాక, వీరిలో దాదాపు అందరినీ కలిశాను. చాలామంది మహానుభావులు నా ఇంటికి కూడా వచ్చి నన్ను అభినందించారు అని సగర్వంగా చెప్పుకుంటాడు.

ప్రకృతిలో వున్న అనంత జ్ఞానాన్ని సముపార్జించి దాన్ని ప్రజల సేవకే ఉపయోగిస్తున్న అబ్దుల్ కరీం ఎన్నో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని, ఇంకెందరో వ్యక్తులకు ఆరోగ్యాన్ని సమకూర్చాలని పల్లెసృజన మనసారా కోరుకుంటోంది.

11వ చిన్నశోధయాత్రలో మన అద్భుత ఇన్నోవేటర్ వెంకటకృష్ణుడు ద్వారా పరిచయమై తన విశేష జ్ఞానంతో శోధయాత్రీకులను ఆకట్టుకున్న కరీం గారికి 'పల్లెసృజన' అభినందనలు. ఇలాంటి విశేష వ్యక్తులు లక్షకొకరుంటారు. కరీంగారు మాకు పరిచయం కావడం మా అదృష్టమని భావిస్తున్నాను.

కరీంగారి వైద్య జ్ఞానాన్ని ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం, వాటిని ప్రామాణికం చేయించడం, పదిమందికి తెలిసేలా ప్రచారం చేయడం, తద్వారా సమాజానికి, కరీంగారి ప్రకృతి జ్ఞానాన్ని చేరవేయడం పల్లెసృజన ఉద్దేశ్యం.

– పల్లెసృజన సౌజన్యంతో

సాంప్రదాయ జ్ఞాని శ్రీ అబ్దుల్ కరీం చిరునామా:
అబ్దుల్ కరీం, ఇంటినెం.17-107/2, రహమత్ నగర్, ఆత్మకూరు, కర్నూలు జిల్లా, ఫోన్: 85004 91978

" దృశ్యం " సినిమా చూశారా?

మనిషి సృష్టించిన వాటిలో అద్భుతమైనది " సినిమా ". మనిషి మనస్సుని కరగదీసేస్తుంది, హృదయాన్ని తాకుతుంది, ఏడ్పిస్తుంది, నవ్విస్తుంది. ఓ మంచి సినిమా మనసులో నాటుకొని చాలాదినాలు ఆలోచనలు రేకెత్తింపజేస్తుంది. ఓ అద్భుతమైన ప్రపంచంలోకి లాక్కెళ్తుంది సినిమా.

" సినిమాలు " అన్నీ అలాగా ఉండవు. చాలా తక్కువ సినిమాలే చాలా బాగుండేది. పూర్వపు సినిమాల్లో దేవదాసు, బంగారుపాప, రక్తసంబంధం, మూగమనసులు లాంటి సినిమాలు, మొన్నమొన్నటి సినిమాల్లో అయితే శంకరాభరణం, అంకుశం, సాగరసంగమం, స్వాతిముత్యంలాంటి సినిమాలు మనసును కదిలించివేస్తాయి. హృదయాన్ని స్పందింపచేస్తాయి. అవి కళాత్మకమైన హృదయాల్లో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి.

తెలుగు సినిమా రంగంలో మంచి మంచి డైరెక్టర్లు ఉన్నారు. మంచి మంచి నిర్మాతలుకూడా ఉన్నారు. కానీ మలయాళంలో, తమిళంలోలాగా ఆలోచింపజేసే సినిమాలు తీసేవాళ్లు చాలా తక్కువ. మరీ మలయాళ సినిమారంగంలో అయితే అద్భుతమైన క్రియేటివ్ డైరెక్టర్లు ఉన్నారు. వాళ్ల సినిమాలు చూస్తూ ఉంటే-సినిమా చూస్తున్నట్లుగా ఉండదు. జీవితాన్ని ప్రతిబింబజేస్తున్నట్లుంది. మనకళ్లముందరే కథ నడుస్తున్నట్లుగా మనల్ని అదో లోకంలోకి తీసికెళ్తాయి.

తెలుగులో మంచి సినిమా చూసి చాలా సంవత్సరాలైంది. ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణమన్నట్లు ఏ తెలుగు సినిమా చూసినా ఏమున్నది గర్వ కారణం. పాత హీరోల కొడుకులు ఇప్పటి హీరోలు. ఇప్పటి హీరోలకు నటన తెలిసి ఉండబన్లేదు. హీరోల వారసులై ఉండి, నాలుగు కోతిగంతులు వేయగలిగి ఉండి హీరోయిన్‌తో జంతుక్రీడ ఆడగలిగే అట తెలిసుంటే చాలు. ఆయనో పెద్ద హీరో అయిపోతాడు. ఆయనొక సమాజఉద్ధారకుడుగా ఎంతమందినైనా అవలీలగా చంపగలిగి, న్యాయంకోసం హీరోయిన్‌కోసం ధైర్యంగా నిలబడే మొనగాడుగా సినిమాల్లో చూపిస్తే చాలు ఆయనకోసం అభిమాన సంఘాలు కూడా వెలుస్తాయి.

ఇక ఇప్పటి హీరోయిన్లైతే నటన అక్కరలేదు. బాగా అందమైన మొఖం, చక్కటి నడుము, మంచి పిరుదులు, వక్షోజాలు అందంగా చూపించగల బొద్దు ఉంటే చాలు-ఆమె ఓ పెద్ద హీరోయిన్ అయిపోతుంది.

నేటి మన తెలుగు సినిమా రంగాన్ని గురించి మాట్లాడుకోవడం శుద్ధ దండుగేమో. మంచి నిర్మాతలు, మంచి డైరెక్టర్లు ఉండి కూడా మళయాళంలోలాగా మంచి, మంచి సినిమాలు తీయలేకపోతున్నారే అని బాధకలుగుతుంటుంది.

మళయాళంలో హిట్టైన సినిమాని " తెలుగులో " దృశ్యం " సినిమాగా రామానాయుదు తీశాదు. ఈ సినిమాకు డైరెక్టర్ ఒకప్పటి నటి శ్రీప్రియ.

మంచి కుటుంబ కథ. నేటి తరం కథ. యువకుల వెర్రి చేష్టలకు ఎంతమంది జీవితాలు ఎన్ని మలుపులు తిరుగుతాయో, కొందరి జీవితాలైతే ఎంత దారుణంగా బలైపోతాయి చూస్తుంటే మనస్సు ద్రవించి పోతుంటుంది. కథలో పాత్రలు అనుభవిస్తున్న కష్టాలు, మానసికవేదన చూసి-పగవాడికి కూడా ఈ కష్టాలు వద్దురా దేవుడా అనిపిస్తాయి.

" దృశ్యం " సినిమాలాంటిది ఇప్పటికి కథగా వచ్చిన సినిమా ఇంతకు ముందు మేము చూడలేదు. ఆ సినిమాకు స్క్రిప్టు అంత పకడ్బందీగా కథలో పట్టుసడలిపోకుండా బిగుతుగా నడుస్తుంది. సినిమా చూస్తున్నంతసేపు హీరో వెంకటేష్, హీరోయిన్ మీనా కనిపించరు. మన నిజ జీవితంలో ఓ కుటుంబ కథను నేరుగా మన కళ్లతోనే చూస్తున్నట్లుగా ఉంటుంది. ఈ కుటుంబానికి ఏమీ కాకూడదు దేవుడా ఈ కథ సుఖాంతంగా ముగిసిపోతే బాగుణ్ణు అని సినిమాహాలులో ఉన్న ప్రతి ప్రేక్షకుడు కోరుకుంటూ ఉంటాడు.

" దృశ్యం " సినిమాలో మనం-నేర్చుకోవలసినది ఒకటి ఉన్నది. న్యాయంకోసం, ధర్మంకోసం అబద్ధాన్ని గట్టిగా, పట్టుసడలి పోకుండా, ఎంతటి కష్టాన్నికైనా ఓర్చుకొని ' అబద్ధం " మీదే గట్టిగా, నిజాయితీగా నిలబడితే ఒక్కోసారి అబద్ధం కూడా చివరకు విజయాన్ని చేకూరుస్తుంది-ఇది సత్యం. హాయిగా, సంతృప్తిగా గడిచిపోతున్న ఓ కుటుంబంలో జరగరాని సంఘటనతో జరిగిన కథ. మంచి మధ్య తరగతి కుటుంబంలో గల ఆడవాళ్ల జీవితాలతో చెలగాట మాడుకోవాలని చూస్తాడు ఓ అహంకార యువకుడు. తల్లి-కూతురు ఆ కుర్రాడి పాదాలు పట్టుకొని మమ్మల్ని వదిలెయ్యమని దండం పెట్టి ప్రార్థిస్తారు. వాడు కనికరించడు, అలాంటి సమయంలో యువతి ఆ కుర్రవాడిని వెనుకమాటుగా కొడుతుంది. ఒక్క దెబ్బతో ఆ కుర్రాడు చనిపోతాడు. ఆ యువతి ఆ కుర్రాడిని చంపాలని కొట్టలేదు. తమను తాము రక్షించుకోవాలని ఆ కుఱ్ఱవాడి తలమీద కఱ్ఱతో గట్టిగా కొడుతుంది. ఊహించని విధంగా ఆ కుర్రాడు చనిపోతాడు.

చనిపోయిన కుర్రవాడు పోలీసు ఐ.జి. కుమారుడు. అటువంటి వాడు చనిపోతే పోలీసులు ఊరుకుంటారా? ఓ

ప్రక్క పోలీసుల ఇన్వెస్టిగేషన్-మరోప్రక్క హీరో తన కుటుంబాన్ని రక్షించుకోనే చక్కటి పథకం.


సినిమా ఎంత బాగా తీశారని! హాలులో కూర్చుని సినిమా చూస్తున్న ప్రేక్షకులు ఏమి జరుగబోతుందోనని ఉత్కంఠతతో ఊపిరి బిగబట్టి సినిమా చూస్తుంటారు. సినిమా చివరి వరకు ఉత్కంఠ.

కానీ సినిమా అంతంలో పోలీస్ ఐ.జీ., ఆమె భర్త ఇద్దరు కలిసి-సినిమాలో హీరో అయిన వెంకటేష్‌ను పిలిపించుకొని " జరిగిందేదో జరిగిపోయింది, మీ కుటుంబం మా అబ్బాయిని హత్య చేసిందని మా పోలీసు డిపార్ట్‌మెంటు నిరూపించలేకపోయింది. కోర్టులోకూడా మేము ఓడిపోయాం. నేను ఐ.జీ. ఉద్యోగానికి రాజీనామా చేశాను, నేను నా భర్త భారతదేశం వదిలి శాశ్వతంగా అమెరికాకు వెళుతున్నాం. మేము అమెరికా వెళ్ళేముందు నీ నుంచి నిజం తెలుసుకొని వెళ్లాలని మా చివరి కోర్కె. మా యందు దయవుంచి మా అబ్బాయి ఏమయ్యాడో చెప్పండి " అని పోలీస్ ఐ.జి. అడిగితే అందుకు హీరో వెంకటేష్ చెప్పిన సమాధానంతో సినిమా ముగుస్తుంది. ప్రేక్షకుల హృదయాల్లో ఓ బాధను గ్రుచ్చుతుంది. ప్రేక్షకులు హృదయాలు బాధగా హాలులోనుండి బయటకు వస్తారు. సినిమా చూస్తే మీకే తెలుస్తుంది-సినిమా ఎంత బాగుండేది.

రాయండి... రాయండి!

ఈ సాంకేతిక యుగంలో యువత పెన్ను పట్టుకోవడం అనేది అరుదైన విషయాంగా మారింది. సాంకేతికంగా ఎంత ముందంజలో ఉన్నా కొన్ని అలవాట్లను మాత్రం అందులో నుంచి మినహాయించుకోవాలి.

కాగితం మీద కలంతో రాయడం అనేది అందులో ఒకటి. మీ మనసులో రకరకాల భావాలు ఉండవచ్చు. అభిప్రాయాలు ఉండవచ్చు. వాటిని కాగితం మీద రాస్తూ ఉండండి. కంప్యూటర్ మీద టైపు చేయడం కన్నా కలంతో రాయడంలోని మజాను అనుభవించండి.



హృతిక్ రోషన్

మా చేతిలో చేలు, గుప్పిట్లో పిడికిళ్ళు

మట్టి మాట్లాడినప్పుడల్లా
ఇంద్రధనుస్సుల్లా వంగిపోయిన వెన్నెముక తోడుగా
ఎద్దుతోక, కాడి, ములుగర్ర పోటీగా
విత్తులోంచి ఆశ మొలకెత్తినప్పుడల్లా
మా కళ్ళల్లో వేయి దివిటీలు
ప్రభల జాతర్లు, కరెంటు తీగల పగళ్ళు

ఇప్పుడు
ఎండి మోడులై పోయిన మా బతుకుల్లో
ఉదయాల్ని ఉప్పుకొటారుల్లో ఊరవేసిన వాళ్ళం
ఎన్నడూ చూడని దృశ్యాన్ని తిరస్కరించాక
నడిచి వచ్చే నీడల్ని నిరాకరించాక
సందర్భమూ పాతదే
మా గోచిపాతే జీవితమూ పాతదే!

చర్మం తలుపులు బార్లా తెరిచి
నెత్తుటి జలపాతం దూకాలనే
ఉక్రోషమూ పాతదే
ఊహాలోకమూ పాతదే!

విశ్వాస ప్రకటనల సాక్షిగా
ఎంత తోడినా మెతుకురాని
సత్తు బొచ్చె, పగిలిన నీటికుండ
కాళ్ళు ముడుచుకున్న కుక్కిమంచం సాక్షిగా
ప్రామిసరి నోట్ల పదకోశాల సాక్షిగా
మా ఎడారి నాలుక పాతదే

తడారి పోయిన కుక్కపిల్ల మూలుగూ పాతదే
రుతువుల్ని కంటున్న నీటిబొట్టు బాల్యమూ పాతదే
పచ్చదనాన్ని పాతిపెడుతున్న
పురుగుల మందు వృద్ధాప్యమూ పాతదే
ఈ పాటనే మేమిప్పుడు ద్వేషిస్తున్నాం

మా కిప్పుడు కొత్తదనం
పురిట్లో కాదు
మంత్రసాని చేతుల్లో ఉంది

శ్రీరామకవచం సాగర్

రచ్చబండ ముచ్చట్లు

* ఏమిరా వెంకటసుబ్బయ్యా! ఏందిరా ఆ మొఖమా? ఏందో భలే సీరియస్‌గా మొఖం పెట్టి-మొఖమేందో మాడ్చుకొని ఉండావా? ఏందిరా కథ!
* నాతో నువ్వు మాట్లాడబాకు గోపాలమామా!
* అమ్మో! ఏందిరాకథ! ఆ సీరియస్ ఏంది? ఆ ముఖమేందిరా కుక్క మాడ్చుకున్నట్లు మాడ్చుకొని ఉండావా?
* నువ్వు నాతో మాట్లాడుబాకు అన్నానా? నన్ను పలకరించబాకు అన్నానా అంతటితో గమ్మునుండు -నీ మొఖం చూస్తుంటేనే నాకు వళ్లు తగలకపోతుంది గోపాలమామా
* నీకు వళ్లు తగలకపోయే పని నేనేమిజేశానురా భాదుకోవ్!
* మేము మా పార్టీ తరుపున గెలిపిచ్చుకున్న మావాడిని-ఆ పార్టీవాళ్లకి ఎంతకి అమ్మేశావో జెప్పు



* ఏందిరో నీ పార్టీ నీ సొంతమైనట్లు -నీ బాబుగాడి సొమ్మేదో నేను దోసుకోపోయినట్లు, నువ్వేందో పెద్ద నాయకుడివైనట్లు మాట్లాడు తుండావుగదరా తుంటాబిత్తరోడా
* మా పార్టీవాడిని ఎంతకు అమ్మేశావో ముందు చెప్పు గోపాలమామా?
* రాజకీయాలతో నాకేమి సంబంధంరా పోరంబోకోడా!
* ఇంక నువ్వు మాట్లాడబాకు గోపాలమామా! నిన్ను జూస్తుంటే నాకెట్టాఉందంటే నిన్ను ఏమిజేశినా పాపంలేదనిపిస్తున్నది. నువ్వెంత ఉక్కిష్టపోడివో? సంతలో పశువునమ్మినట్లు మనుష్యుల్ని అమ్మేసే నీఛస్థితికి దిగజారి పోయ్యావు గదా గోపాలమామా
* నాకే పాపం తెలియదురా వెంకటసుబ్బయ్యా!
* ఇంక నోరుమూసుకో గోపాలమామా! నీ నక్కచేష్టలు, నీ లోఫర్‌చేష్టాలు నాకు తెలియదనుకుంటుండావేమో? నువ్వేటువంటి డాఫర్‌గాడివో నాకు తెలియదా?
* మర్యాదగా మాట్లాడరా! గమ్మునుండే కొంది నీ నోరు జాస్తైపోతుందిగదరా-నోరు అదుపులో పెట్టుకోరా గాడిద
* పెట్టుకోను గోపాలమామా-మేము గెలిపిచ్చు కున్నోడిని డబ్బుతో కొనేసి అవతల పార్టీవాళ్లకి ఇచ్చేస్తావా? అమ్ముడు బోయినోడికి సరే సిగ్గులేదనుకో-నీకు సిగ్గెట్టాలేకుండా బోయింది గోపాలమామా
* నాకేమి తెలియదురా పనికిమాలిన గాడిదకొడకా అని నేను ఒక ప్రక్కన జెప్తాఉంటే-నువ్వేందిరా నన్ను బట్టుకొని ఆమన్నే సతాయిస్తుండావా లేబర్ నాయాలా
* ఏదైనా ఒక పనిజేస్తే-నీతినిజాయితీ ఉండాల గోపాలమామా. మనిషన్న వాడికి కాస్త సిగ్గు-ఎగ్గు ఉండాల గోపాలమామా. ఇట్టాంటి రాజకీయం చేస్తే ఏమి? చేయ్యకపోతే ఏమి? బజార్లో వళ్లు అమ్ముకోనేవాళ్లకు-నీకు తేడా ఏముంది? గోపాలమామా!
* ఒరే వెంకటసుబ్బయ్యా! మీ క్యాండేట్‌ని ఎవరు కొనుక్కున్నారో? వాడు ఎంతకి అమ్ముడుబోయ్యేడు నిజంగా నాకు తెలియదురా!
* ధూ-భాంచత్-నీదీ ఒక బ్రతుకేనంట గోపాలమామా. నిదర్లేసింది మొదలుకొని ఒకటే అబద్దాలు-అవిగాకపోతే ఛీటింగ్ పనులు లోఫర్-డాఫర్ పనులు-నీదీ ఒక బ్రతుకేనంట గోపాలమామా!
* నన్ను ఇంత పెద్దోడిని బట్టుకొని ఎంతెంత మాటలంటుండావురా! నువ్వు పురుగులు పడిచస్తావురా నికృష్టపు నాయాలా!
* నేనా? నువ్వా నికృష్టపోడివి గోపాల మామా! డబ్బిస్తానంటే ఎంత నీచానికైనా వడిగడతావా? నువ్వెంత తీసుకున్నావు? మా క్యాండేట్‌కి ఎంత డబ్బిచ్చావా గోపాల మామా?
* నా కస్సలు ఆ విషయమే తెలియదురా అంటుంటే-నన్ను బట్టుకొని ఎంతెంత మాటలు మాట్లాడుతుండావురా లఫంగోడా
* ఈ ఊర్లో వీధి కుక్కని అడిగినా నీ సంగతి జెప్తది గోపాలమామా! చెయ్యాల్సినదంతా జేసేసి-ఇప్పుడు ఆ సంగతి నాకేమి తెలియదని కూస్తా! అది నోరా లేకపోతే జల్దారిగుంట గోపాలమామా
* ఈ రోజు నువ్వు అరుగు మీదకు తాగొచ్చినట్టుండావు నేను నీతో ఇంక మాట్లాడను. నేను వస్తా-ఇంక నేను ఇంటికి బోతా!
* యాడకి నువ్వు బొయ్యేదా? అరుగు మీదనుండి లేశావంటే గోపాలమామా! నువ్వు నా చేతిలో ఏమైపోతావో, నేను నిన్ను ఏమి జేస్తానో నాకే తెలియదు.
* ఏందిరా నువ్వు మనిషివా? పశువువురా! ఎవుడితో మాట్లాడుతుండావో తెలిసే మాట్లాడుతుండావా! వళ్లు ఎట్లాఉంది ఏందిరా?

* నా ప్రాణం బోయినాసరే గోపాలమామా! నీమీద నాకున్న కోపం, నీమీద నాకు కలుగుతున్న అసహ్యం, నువ్వు చేసిన నీతిమాలిన పనికి నాకు వళ్లు తగలకపోతా ఉంది. నువ్వింత నీచుడవని అనుకోలే!

* ఆశపోస్తపోరా! నువ్వెన్నైనా అనుకో! నన్ను ఎన్నైనా తిట్టుకో! ఏమి జరిగిందో నాకు తెలియదు.

* మళ్లీ కూసినకూతే కూస్తుంటావు గోపాలమామా! ఎంత బరితెగించినోడివి నువ్వా! నువ్వుచేసిన నీఛమైన పనికి అంతకంత అనుభవిస్తావు ఉండు గోపాలమామా! ఇప్పుడే ఏమైంది నీ కథ.

* అవున్రా మీ వోడిని నేను డబ్బిచ్చేకొన్నాం. ఇప్పుడు నువ్వు మమ్మల్ని ఏమిజేస్తావురా! చెప్పుకోపోస్త చెప్పుకోపోరా-నువ్వు ఎవుడితో చెప్పుకుంటావో -చెప్పుకోపోరా స్కౌండల్!

* నువు ఇంగ్లీషులో తిడితే-అంతకంటే రెండింతలు నేను నిన్ను తెలుగులో తిడతా! నేను నోరు తెరిశానంటే ఈ చుట్టుప్రక్కల నువ్వేడ ఉండ్లేవు-అది తెలుసుకొని మాట్లాడు గోపాలమామా! నేను నిన్నేమి చెయ్యగలనులే. కాకపోతే మనిషన్నోడికి కాస్త పద్ధతి, నీతి, సిగ్గుశరము ఉండాల అది తెలుసుకో. నువ్వేదో ఘనకార్యం చేశానని సంకలు గుద్దు కుంటుండావు గావాల! నీవు జేసింది నీతిమాలిన పని గోపాల మామా!

* అన్నీ మాకు తెలుసుపోరా పుడింగి. అస్సలు రాజకీయం నీకేమి తెలుసని మాట్లాడుతుండావురా. వీధుల్లో టీ బొంకులకాడ ' టీ ' తాగేనాయాలా.

* మేము పేదోళ్లమి. ఇంట్లో ' టీ ' పెట్టుకోవాలంటే అదో పని. ఎక్కడబడితే ఆడే టీ త్రాగే అలవాటుంది. టీ అదేమి దొంగతనంగాదే-అదేమి లోఫర్-డాఫర్ పనికాదే. అదేందో పెద్దతప్పైనట్లు మాట్లాడుతుండావా గోపాలమామా!

* దాన్ని బట్టి నీ లెవల్ ఎంతో నువ్వు అర్థంజేసుకో. అటువంటి లేబర్ నాయాలివి నువ్వు-నువ్వెంట్రా నన్ను విమర్శించేదా-నోరు మూసుకోస్త

* డబ్బుందని, చేతిలో అధికారముందని నీ ఇష్టమొచ్చినట్లు ఆడుతుంటే ఎవుడేమి జెయ్యలేడని అనుకుంటుండావేమో! ధర్మం ఉంది, న్యాయం ఉంది. పైన భగవంతుడుండాడు. అయితే ఏదో ఒక రోజు పాపం పండాల.

* పండినప్పుడు చూసుకుందాంపోరా! నీ సలహాలు, నీ యవ్వారం మా కొద్దుపోరా బుడబుక్కలోడా!

* పండినప్పుడు ఏందీ నువ్వు జూసేదా! అప్పుడు నీకు-కాలు చెయ్యి పడిపోద్ది-మూతి ఒంకరపోద్ది -నోట్లో నుంచి మాటరాదు-అప్పుడేంది ఇకన నువ్వు జూసేదా!

* ఓరి దరిద్రుడా! దరిద్రపు కూతలు కూయబాకురా. అస్సలే నీ నోరు మంచిదిగాదు. నీ నోటినుండి గుండా ఏదన్నా మాటొస్తే ఏదన్నా జరగద్దేమోనని భయంరా నాకా

* నా నోటిగుండా వాక్కువస్తే ఏమీ జరగదులే భయపడబాకు-చేస్తే ఏమన్నా ఆ భగవంతుడే జెయ్యాల-ఆయనగదా న్యాయా-ధర్మాల జూసుకొనేదా!

* ఇంక ఆడక ఆపవయ్యా నీ నోరా! గమ్మునుండే కొందీ రెచ్చిపోతుండావా?

* ఆపతాగానే! నేను నిన్ను అడిగిన డబ్బులు సంగతేమి జేశావు గోపాలమామా?

* నీదెంత సిగ్గులేని జన్మరా వెంకటసుబ్బయ్యా! ఇప్పుడుదాకా నన్ను తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టి-మళ్లీ ఇప్పుడే నన్ను డబ్బులడగతా ఉండావా?

* రాజకీయానికి-డబ్బులకేమి సంబంధం గోపాలమామా. దానిది దానిదే-దీనిది దీనిదే. నాకేమన్నా డబ్బులు నువ్వు తిరిపంగా ఇస్తుండావా ఏంది? ఏందో ఊరకనే నాకు డబ్బిచ్చినోడివి మాట్లాడినట్లు మాట్లాడుతుండావే. అప్పు అడిగా ఇస్తే ఈ-లేకపోతే లేదని జెప్పు. డబ్బు కాడ మూజమాన్యం ఎందుకా?

* నేను నా జీవితంలో ఎంతోమందిని జూసుండానిగానీ, నీలాంటి బరితెగించినోడిని నేను చూడలేదురా వెంకటసుబ్బయ్యా!

* నేనేమి బరితెగించలా! శిగ్గుశరములేకుండా నడుసుకోలే. ఎవురికీ డబ్బుకు అమ్ముడుబోలె. నీతి-నిజాయితీలేని పనులే నేనెప్పుడూ జేయలే. రాజకీయం చేసినాగూడా నిజాయితీగానే నిలబడ్డా.

* నీ చిన్నప్పటినుండి నువ్వు ఎటువంటోడివో! నీ దగ్గర ఎన్ని యాక్షన్లు ఉండాయో, ఎవుర్ని ముంచుతావో-ఎవుడ్ని తేలస్తావో-ఒరే నక్కజిత్తుల నాయాల-నా దగ్గరంట్రా నీ కథా. మూసుకోస్త నోరు మూసుకో.

* నేను ఈ ఊర్లో ఏదిజేసినా అది నీ మంచికే జేసినా. నాకోసం నేనేమి జేసుకోలే. ఏదో పోనీలే మన గోపాలమామ కోసమేగదా అని జేసినా-ఆ విశ్వాసం నామీద నువ్వు పెట్టుకోచాలు. ముందు డబ్బులు సంగతి జెప్పు-తరువాత వేరే సంగతులు మాట్లాడుకుందాం.

* అయ్యా! వెంకటసుబ్బయ్యగారు! ఇంకేమీ సంగతులు నీతో మాట్లాడబన్లే. అసలు నీ ప్రక్కన కూర్చున్నా-గజ్జి కుక్కకాడ కూర్చున్నా రెండు ఒకటే నాయనా! వస్తాను మహాప్రభో.

* డబ్బుల సంగతి ఏమి జెప్పకుండా పోతుండావా? సరేలే ఏడకుబోతావోపో! రేపురావా ఈడకి-అప్పుడు జూస్తా నీ సంగతి గోపాలమామా!

మన రైతు బిడ్డ ఏ.సి. ప్రతాప్

అమ్ముచున్న మంచి కంపెనీల ఏ.సి. మిషన్‌లు

రైతు మిత్రులారా - శ్రేయోభిలాషులారా..

ఏ.సి. కొంటే మన ప్రతాప్ దగ్గరే కొనండి..!

హాయిగా ప్రశాంతంగా నిద్రపోండి..!

ఈ వేసవిని చల్లగా సాగనంపండి..!

MITSUBISHI ELECTRIC

Changes for the Better

AIR CONDITIONERS

GENERAL

AIR CONDITIONERS

Haier

Mr.SLIM

For a Greener Tomarrow

0% Finance

All Cards Accepted

తీసుకుంటాం Exchange కు

5years Warranty on Cumpressor

Authorised Sales and Service Dealer

SAI PRATHAP AIR CONDITIONERS

Brindavanam, NELLORE-1. Ph: 0861 2347273, 9246464631

RNI Regd. No. 67307/97

Postal Reg. No. J/Nellore/014/13-15



మహోన్నత నాటకం "కన్యాశుల్కం"

(నెల్లూరులో ప్రదర్శించబోతున్నారు)

నేటి తరానికి మన పూర్వకవుల విషయం తెలియదు. తెలుగుభాషలో ఎంత అద్భుతంగా నాటకాలు, నవలలు, కథానికలు, రాసున్నారో కూడా తెలియదు. వాటిని గురించి తెలుసుకోవాలన్న ఆకాంక్ష కూడా చాలా తక్కువ.

కానీ వారు రాసిన నాటకాలు, నవలలు, కథానికలు, అద్భుతమైనవి. ఎన్నితరాలైనా వాటిని చదువుతూ పోవల్సిందే. అవి మనలో ఆలోచనలను రేకెత్తింపజేస్తాయి, అభ్యుదయభావాలు పలికిస్తాయి. సమాజంపట్ల మన బాధ్యతను గుర్తుచేస్తాయి.

తన కాలంనాటి సమాజంకన్నా చాలా ముందు చూపున్న అభ్యుదయ భావాలు కలిగిన కవి మన గురుజాడ అప్పారావు. అయనెప్పుడో 120 సంవత్సరాల క్రితం రాసిన అ&త్యద్భుతమైన నాటకం "కన్యాశుల్కం". అది ఈనాటికి నిత్య నూతనంగానే ఉంది. ఇప్పటి తరం తెలుసుకోవాల్సిన అద్భుతమైన విషయాలెన్నో ఆ నాటకంలో ఉన్నాయి. అస్సలు ఆ నాటకం మనుష్యులు రాసిందికాదు, దేవతలు రాసిందనిపిస్తుంది.

అటువంటి బృహత్తరమైన నాటకాన్ని యధాతథంగా-ఏక బిగిని 8 గంటలసేపు ప్రదర్శిస్తున్నారు విజయనగరం కళాకారులు. ప్రపంచంలో ఏక బిగిని ఎనిమిది గంటల సేపు నాటకం ప్రదర్శించిన సంఘటన ఒక్క యూరోపియన్ కవి ఇబ్సెన్ విషయంలో జరిగింది.

అటువంటి అత్యంత అద్భుతమైన నాటకాన్ని సెప్టెంబర్ 21వ తేదీ నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రంలో ప్రదర్శించబోతున్నారు విజయనగరం నటీనటులు. ఇప్పటికి ఎనిమిది చోట్ల ఆ నాటకాన్ని క్రిక్కిరిసిన ప్రేక్షకులు తిలకించారు. హాలులో నుండి కదలకుండా ఎనిమిది గంటలసేపు ఆ నాటకాన్ని చూసి పరవశించి పొయ్యారు.

ఆ నాటకాన్ని ఇప్పుడు నెల్లూరులో ఆడబోతున్నారు. ప్రతి కవి, ప్రతి కళాకారుడు, అభ్యుదయభావాలు కలిగినవారు, అధ్యాపకులు, మేధావులు, విద్యార్ధులతో సహా నాటకాన్ని చూసి ఆనందించాల్సిందే.

మధ్యాహ్నం 2 గంటలకు నాటకం ప్రారంభమైతే-రాత్రి పది గంటలకు ముగుస్తుంది. అన్ని గంటలసేపు నాటకాన్ని చూడగలమా? అంతసేపు కూర్చోగలమా? ఇలాంటి సందేహాలు మీ మనస్సుల్లోకి రానివ్వకండి. ఇదొక గొప్ప ప్రయోగం.

ప్రదర్శనకు రావడం మీ కర్తవ్యం-నాటకాన్ని అత్యంత అద్భుతంగా ఆడి చూపించడం మా కర్తవ్యం!

మీరు తప్పక రావాలి.....

నెల్లూరు జిల్లా కళలను బాగా ప్రోత్సహిస్తుందని ఆంధ్రరాష్ట్రానికి ఎలుగెత్తి చాటాలి

నెల్లూరీయుడా! కళాభిమాని! రా-కదలిరా

Published by V. Niranjan Reddy, 15/173-A, Brindavanam, Nellore - 524 001, Cell : 9490142934, 08622-258513
Printed at Dhanalakshmi Graphics, Prop. : E. Muthyalu Reddy, 16/533, Thipparajuvari Street, Nellore-524 001

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA105M238
పుస్తకం పేరు	సింహపురి రైతు
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Vedavathi.
పేజీలు విడదీసినది	Vedavathi
స్కాన్ చేసినది	Sivalakshmi
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good